ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి



# గాయత్రి



ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 12 - సంచిక 1
**జూన్ 2010**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TRUST
BUSINESS DIVISION,
HYDERABAD


## యుగధర్మాన్ని గౌరవించాలి

ఇది యుగసంధి సమయం. మానవుని భవిష్యత్తు ఉజ్జ్వలం అవుతుందో, అంధకారమయం అవుతుందో అని ఆందోళన పడే సమయం. ఒక రకంగా ఇది ప్రమాదకరమైన సమయం. పశుపక్ష్యాదులవలె కేవలం కడుపునింపుకోవడం, పిల్లల్ని కనడం మాత్రమే మన లక్ష్యం కాకూడదు. యుగపరివర్తనా సంకేతాలను అందుకుంటూ తనలోని నరపశువును దూరంగా ఉంచాలి. కొంతలో కొంత సమయదానం ఇవ్వాలి. యుగం యొక్క పిలుపును అందుకుని కర్తవ్యాలను నిర్ణయించుకోవాలి. పరమపూజ్య గురుదేవులనుండి ప్రేరణ పొంది ఆచరణలో పెట్టాలి. వారి ఆలోచనలను అర్థం చేసుకోవాలి. దానికి అనుగుణంగా మనల్ని మనం మలచుకుంటూ ముందుకు సాగాలి. అంతరాత్మకు జాగృతిని కల్పించాలి. ఈ యుగసంధి సమయంలో యుగధర్మాన్ని గౌరవించాలి. లోభమోహాలలో బంధింపబడి, కేవలం వాటి కొరకే జీవితాన్ని గడిపివేయడం హర్షణీయం కాదు. ఒక్కసారి మహాభారత కాలాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవాలి. ప్రతి ఒక్కరూ ఒక్కొక్క అర్జునుడిగా నిలబడాలి.

జీవిత నిర్వహణలో, కుటుంబపోషణలో మనవంతు బాధ్యతను నిర్వహిస్తూనే యుగచేతనలో భాగస్వాములు కావాలి. రామాయణంలో ఉడుతలాగా, శబరిమాతలాగా మనకు చేతనయినంత సహకారం అందిస్తూ ఉండాలి. అది సమయదానం కావచ్చు. అంశదానం కావచ్చు, ప్రతిభాదానం కావచ్చు. సోమరితనానికి, మోసగించి జీవించడానికి ఇది సమయం కాదు. ఈనాటి మన బద్ధకం మనతర్వాతి తరాల వారికి శాపం కాకూడదు. ఇలాంటి ఆపద సమయాన్ని కూడా స్వలాభానికి ఉపయోగించుకోవాలన్న ప్రయత్నం చెయ్యకూడదు. సమాజక్షేమమే మన క్షేమం. సామాజిక లాభమే మన లాభం. **“మనం మారుదాం - యుగం మారుతుంది.”** ఇదే మన నినాదం, ఇదే మన లక్ష్యం.

★★★

పత్రిక అందనివారు ఈ క్రింది నంబర్లనుసంప్రదించగలరు.
**9032674117, 9603509900**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**

**స్వయంగా నీకు ఇష్టం లేని ఆచరణ ఇతరుల పట్ల చేయరాదు.**

## విషయ సూచిక


1. **సంపాదకీయం :**
యుగధర్మాన్ని గౌరవించాలి 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :**
కష్టాలను ఎదుర్కొనటానికి సిద్ధపడు 2
3. **వేదమంత్రం :** సఫలతకు రాజమార్గం 3
4. **వర్తమాన భారతం :**
పరివర్తన పవనాలు నెమ్మదిగా వీస్తున్నాయి 4
5. **ఉపాసనకు రెండు పాదాలు : జపం-ధ్యానం**
ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా? 6
6. **బాలల భవితకు బంగారు బాట-8 :**
కబీర్‌దాసు-(ఏకపాత్ర) (26-06-2010 కబీర్‌దాసు జయంతి) 7
7. **ధారావాహిక : ప్రశ్నోపనిషద్**
ద్వితీయ అధ్యాయం - 7 8
8. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-13**
కర్తవ్యపరాయణ జీవజంతువులు 10
9. **మనం-మన ఆరోగ్యం :**
యజ్ఞవిద్యలో వనౌషధ విజ్ఞానం 13
10. **ధారావాహిక : హనుమత్‌కథామృతం-26**
భక్తులను బాధించేవారికి క్షమాపణ దొరకదు 16
11. **కుటుంబ నిర్మాణం**
దివ్య భావనల అభ్యాస వ్యాయామ శాల గృహస్థ ధర్మం 18
12. **ధారావాహిక : భక్తిగాధ - 31**
భక్తి ఫలస్వరూపము 21
13. **ప్రత్యేక వ్యాసం : గాయత్రీజయంతి, గురుదేవుల మహాప్రయాణం**
పితృదేవతలను స్మరించాలి-వారు మనకు శక్తిని ఇస్తారు 23
14. **పూజ్య గురుదేవుల అమృతవాణి**
యజ్ఞమంటే ఉదారత, ఆత్మీయత, సద్భావనలే 25
17. **వైజ్ఞానిక ఆధ్యాత్మికత :**
అధర్వణ ఋషి లోకసేవ 27
18. **జీవించేకళ :**
సమయం కూడా ఒక సంపదే-చక్కగా వినియోగించుకోవాలి 29
19. **గాయత్రీమాత-24 శక్తిధారలు 13 :** సావిత్రి 32
20. **మహిళాజాగరణ :**
నారీ అభ్యుదయం - అరుణోదయం 33
21. **అమృతత్వ విద్య** 36
22. **నా వారితో నా మాట : 2011-2012 (శతాబ్ది సం॥)**
జన్మశతాబ్దికి ఇంకా 253 రోజులు మాత్రమే ఉన్నాయి 39
23. **దేవ సంస్కృతి విశ్వవిద్యాలయం**
భారతదేశ ప్రాచీన విద్యాలయాలు 42
24. **సంజీవని సాధనా శిబిర సమీక్ష** 43
25. **సామూహిక యజ్ఞములు - శాంతికుంజ్ అనుశాసనాలు** 45




## సద్గురు వచనామృతం

### కష్టాలను ఎదుర్కొనడానికి సిద్ధపడు

ఏదైనా గడ్డు పరిస్థితిలో కాని, గొప్ప ఆపదలోకాని పరీక్షించబడనంత వరకు మనిషి తనలోని గుప్త శక్తి యొక్క గొప్పతనాన్ని తెలుసుకొనలేడు. నడివయసులో సైతం మనిషి తన పూర్తి శక్తిని గుర్తించలేడు. ఏదైనా గొప్ప ఆపద, హాని లేక శోకం అతడిని పరీక్షించ నంతవరకూ తాను ఎంత గొప్ప కష్టాన్ని ఎదుర్కొనగలడో, ఏదైనా గొప్ప ఆపద వచ్చినపుడు ఎంత వీరత్వాన్ని చూపగలడో అతడు చెప్పలేడు.

బాధ్యతను మీద వేసుకోవడానికి ఇష్టపడక పోతే, విశ్రాంతిగా జీవిద్దామని కోరుకుంటే, స్వతంత్ర్య కృషిలో ఎదురయ్యే కష్టాలనూ, జంజాటాలను ఇతరులపై నెట్టాలని అనుకుంటే కుదరదు. తమశక్తిని సాధ్యమైనంత హెచ్చుగా వినియోగించదలచుకుంటే, యోగ్యతను వీలైనంత అధికంగా అభివృద్ధి చేసుకోవడం లక్ష్యం కావాలి. అయితే కేవలం ఇతరులు చూపిన మార్గంలో నడుస్తూ ఉన్నంతవరకు, అన్ని పనులూ ఇతరుల ఆలోచనల కనుగుణంగా చేస్తూ ఉన్నంతవరకు లక్ష్యాన్ని సక్రమంగా చేరుకోలేరు.

ప్రతి మనిషిలోనూ కొత్త పనులు చేసే యోగ్యత ఏదో ఒకటి ఉంటుంది. ఆత్మవిశ్వాసం వలన ఈ యోగ్యత వికసిస్తుంది.

*అఖండజ్యోతి, డిశంబరు, 1952*

*- అనువాదం : ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

## పండుగలు

**జూన్ 2010**

07-06-2010 హనుమజ్జయంతి

12-06-2010 వటసావిత్రీ వ్రతం

21-06-2010 గాయత్రీ జయంతి

26-06-2010 కబీర్ జయంతి

**జూలై 2010**

25-07-2010 గురుపౌర్ణమి

**కష్టతరమైన పరిస్థితులను విశ్వాసము, సాహసం, ధైర్యంతో ఎదుర్కునే వాడే నిజమైన వీరుడు.**

వేద మంత్రం

# సఫలతకు రాజమార్గం

**మమాగ్నే వర్చో విహవేష్వస్తు వయంత్వేన్ధానాస్తన్వంపుషేమ।**
**మహ్యంసమన్తాం ప్రదిశశ్చతస్త్ర స్త్వయాధ్వ క్షేణపృతనాజయేమ॥**

**(అధర్వవేదం 5/3/1)**

**భావార్థం :** మానవులు సంఘర్షణతో చలించిపోరాదు. పరమాత్మను ఉపాసిస్తూ ఆత్మను, శరీరాన్ని పుష్టివంతం చేసుకోవాలి. ప్రపంచంలో ఎవ్వరూ వారిని ఉన్నత స్థితినుండి పడద్రోయకుందురు గాక !

**సందేశం :** ప్రపంచంలో మానవుని ఎదుట ఎంతో వికటమైన, విచిత్రమైన పరిస్థితి ఎదురవుతూ ఉంటుంది. అతడు ఏదైనా న్యాయోచిత కార్యం చేసినా, దానిని ఇతరులు అన్యాయంతో కూడిన దుష్కృత్యాల ద్వారా విఫలం చేస్తుంటారు. అతడు ఓటమి తర్వాత ఓటమిని చవిచూడాల్సివస్తుంది. ఆ దురవస్థను దూరం చేసుకోవడానికి ఏం చేయాలో తోచక తికమకపడుతుంటాడు. నాలుగువైపులా చింత, భయం, శోకం, క్రోధం, నిరాశ, ఈర్ష్య, తృష్ణ, కోరికలు వ్యాపించిఉన్నాయి. ప్రజలు తమ కోరికలు తీర్చుకోవడానికి పరుగులుదీస్తూ క్రింద మీద పడుతుంటారు.

మానవ జన్మ ఏదో విధంగా గడిపివేయడానికి ఇవ్వబడలేదు. శ్రేష్ఠులైన గొప్పవారుగా చలామణి అవ్వాలనే, గొప్ప గొప్పపనులు చేయాలనీ ఇవ్వడం జరిగింది. ఆ విధంగా జీవించినవారు ధన్యులు. ఆ ధన్యతను సాధించాలంటే జాగరూకులై ఉండాలి. ఎల్లప్పుడూ సంఘర్షణ శీలురు కావాలి. మనస్సును దృఢం చేసుకుని లక్ష్యంవైపుకు సాగిపోవాలి.

లోభమోహాలు కలిగిన వ్యక్తులు తమ తమ మనస్సులను తృప్తి పరచుకోవడానికి అనేక అవినీతి మార్గాలను వెతుక్కుంటారు. మోసపూరితమైన మార్గాలలో తమ స్వార్థాన్ని పూర్తి చేసుకుంటారు. అలాంటి వారు మనకు ఆదర్శం కాకూడదు. నిజమైన ఆదర్శపురుషుడు పరమాత్మయే. మనం ఎల్లప్పుడూ ధర్మాన్ని, కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. బాధ్యతతో మెలగాలి. న్యాయమార్గంలో పయనించేటప్పుడు ఎన్ని సమస్యలు ఎదురైనా బెదిరిపోకూడదు. ప్రశాంతంగా మనపనిలో మనం నిమగ్నం కావాలి. పురుషార్థంలో కార్య శూరులం కావాలి. పరమాత్మయొక్క ఉపాసన అంటే ఇదే.

జీవితం అంటేనే సంఘర్షణ. ప్రపంచంలోని దుష్ప్రవృత్తులతో ఘర్షణ పడడమే జీవితానికి సార్థకత. వాటి ముందులొంగిపోవడం అంటే ప్రాణం లేని కర్రముక్క నదిలో కొట్టుకుపోవడంతో సమానం. సంఘర్షణ వల్ల మనుష్యునిలో స్వాభిమానం, సాత్వికత జాగృతం అవుతాయి. మంచి పనుల పట్ల ప్రేమ, రుచి, నిమగ్నత, విశ్వాసం, శ్రద్ధ మొదలైన భావాలు బలపడతాయి. శ్రేష్ఠమైన ఆదర్శాలను తన జీవితానికి కేంద్రబిందువుగా చేసుకోగలుగుతాడు. దానికి అనుగుణంగా జీవిస్తాడు. జీవితంలో ఎదురయ్యే చిన్న పెద్ద సమస్యలకు చలించకుండా ధైర్యంగా ఎదుర్కోవాలి. అప్పుడే అగ్నిలో కాల్చబడిన బంగారం వలె ప్రకాశిస్తాడు. జీవితంలో విజయాలను సాధిస్తాడు. మనధైర్య సాహసాలను పరీక్షించడానికే పరమాత్ముడు మనకు కష్టాలను కల్గిస్తూ ఉంటాడు. ఎదురొడ్డి నిలిచిన నాడే పరమేశ్వరుని కృపకు పాత్రులం అవుతాం.

సంయమంతో ఆత్మను, శరీరాన్ని, పుష్టివంతం చేసికొని జీవిత సంఘర్షణలో దూకడమే ఆదర్శ బ్రహ్మణత్వం.

★★★

**ఇతరులను హింసించడం వీరత్వం కాదు.**

వర్తమాన భారతం

# పరివర్తన పవనాలు నెమ్మదిగా వీస్తున్నాయి

ఏది ఏమయిన మన దేశం చాలా గొప్పది. ఇంత పెద్ద వైవిధ్యపూర్ణమైన సంస్కృతి గల దేశం ఎన్నో అవరోధాలను దాటింది. దీని వయస్సు ఎంత? మనకు స్వాతంత్ర్యం వచ్చి 63 సంవత్సరాలయింది. రిపబ్లిక్ అయి 60 సంవత్సరాలు అయింది. కాని మన పురాతన వేల సంవత్సరాల సంస్కృతి ఎన్నడూ ఓటమిని అంగీకరించలేదు. ప్రతి భారతీయుడు దేశం ప్రగతి పథంలో నిరంతరం ముందుకు సాగుతూ ఉండాలని కోరుకుంటాడు. భారతదేశం ఒక నిద్రిస్తున్న అపరిమితమైన బలశాలి, అటూ ఇటూ పొర్లుతూ మేల్కొనడానికి సిద్ధమవుతున్నాడు. లేచి నిలబడటానికి ఎక్కువ సమయం పట్టదు. అన్ని దేశాలు దీనికి సలాము చేస్తాయి. భారతదేశం విశ్వాన్నే మార్చివేస్తుంది.

కాని ప్రస్తుత పరిస్థితి ఇంకొక రకంగా ఉన్నది. భ్రష్టాచారం చరమదశలో ఉన్నది. బీదతనం, ఆకలి కేకలు పరాకాష్టలో ఉన్నాయి. కాని ఆహార ధాన్యాలు పుష్కలంగానే ఉన్నాయి. కొందరు చదువు సంధ్యలు లేకుండా ఉన్నారు. మరి కొంతమంది చిన్నతనం నుంచే శ్రమచేసి జీవిస్తున్నారు. వీరికి చదవటం కూడా రాదు. ఈ రోజులలో కూడా స్త్రీలు గడ్డి కోసేందుకు కొండలపైకి ఎక్కుతూ దిగుతూ ఉంటారు. అనేకచోట్ల రోడ్లు కూడా లేవు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. గంగతో సహా అన్ని ముఖ్యమైన నదులు కలుషితమయ్యాయి. నీటి లభ్యత తక్కువయింది. జలవాయువులు వేడెక్కిపోతున్నాయి. మన రాజకీయ నాయకులు చేతులు చాపుతుంటారు. వీరి ఆచరణ అనుమానస్పదమే. స్త్రీల మీద అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. పంటలు జెనెటిక్ మరమత్తుల వల్ల వాటి గుణగణాలలో దోషాలు వస్తున్నాయి. ఋషి-కృషి సిద్ధాంతం పట్టించుకోకపోవడం వల్ల మన వ్యవసాయదారులు, అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

**ఒక ప్రాంతపు ప్రగతి:** క్రియ జరిగినప్పుడు ప్రతి క్రియ కూడా ఉంటుంది. పైన చెప్పిన వాటితో పాటు మంచి పరిణామముల గురించి తెలుసుకోవడం కూడా అవసరమే. మన దేశంలోని ఒక రాష్ట్రం బీహార్. దీని గురించి 3,4 సంవత్సరాల క్రితం చెడ్డగా చెప్పుకునేవారు. ఇప్పుడు కూడా చెప్తున్నారు. కాని ఒక వ్యక్తి పరివర్తనా వాతావరణం తయారుచేసి ఎంతో వెనుకబడ్డ ఆ రాష్ట్రాన్ని ప్రగతి పథాన నడిపించి మంచి మార్పులు తీసుకువచ్చాడు. టైమ్, న్యూస్ వీక్, బిబిసి వారు ఇక్కడ జరిగిన ప్రగతిపై వ్యాఖ్యానించారు. దొంగతనాలు దోపిడీలతో నిండి ఉన్న ఈ రాష్ట్రంలో ప్రగతి పవనాలు వీస్తున్నాయి. ఇక్కడ ఒక వ్యక్తిని గురించి కాని వారి పార్టీ గొప్పదనాన్ని గురించి మాట్లాడటం లేదు. అసంభవాన్ని సంభవం చేసి చూపిన వారి ప్రయత్నాన్ని మెచ్చుకుంటున్నాము.

**జన జాగృతి:** పైన చెప్పిన విషయములపై జన జాగృతి కార్యక్రమాలు వార్తా పత్రికలు, టివి ఛానల్సు చేస్తున్నాయి. గత పది సంవత్సరాల నుంచి చిన్న పిల్లల నుండి యువకుల వరకు, స్త్రీలలో, ముసలివారిలో అలా జీవించకూడదు మారాలి అనే ఆలోచన, ఉత్సాహం, ఉల్లాసం కనిపిస్తున్నాయి. ఈ మార్పు నెమ్మది నెమ్మదిగా జరుగుతున్నది. నదులలోని మాలిన్యాలు, కాలుష్యాలు, నీటి సమస్యలు, వాతావరణం వేడెక్కటం మొదలైన సమస్యల నివారణ కొరకు గత మూడు సంవత్సరాలుగా చర్చలు జరుగుతున్నాయి. మీడియా ద్వారా ఈ విషయములు అందరికి అందుతున్నాయి. ఇప్పుడు సగం జనాభా దగ్గర సెల్‌ఫోన్లు ఉన్నాయి. వీటి ద్వారా తమ అభిప్రాయాన్ని వెంటనే తెలియచెప్పగలుగుతున్నారు.

**మన ప్రయత్నం:** ఈ ప్రగతి ఇలాగే జరుగుతుంటే నదులు, సరస్సులు శుద్ధి అవుతాయి. 2013లో ప్రయాగలో జరుగబోయే కుంభమేళలో త్రాగేందుకు నీటి బాటిల్ తీసుకెళ్ళక్కరలేదేమో. మధ్యప్రదేశ్‌లోని అమరకంటకంలో నర్మదా నది క్లీనింగ్ ప్రోగ్రాం ప్రారంభించారు. భోపాల్ గాయత్రీ పరివార్, యువాప్రకోష్ట మధ్యప్రదేశ్ జన జాగృతి యాత్ర "నర్మదాంచల్ శుద్ధి అభియాన్" అమరకంటకంలో ప్రారంభించి భరూచ్ సముద్రతీరాన సోమనాథ్ శివాలయాలలో అభిషేకం చేశారు. దీనిలో సుమారు 1352 కి.మీ పొడవున్న నర్మదానది శుద్ధికై సంకల్పం తీసుకున్నారు. సుమారు 7000 కి.మీ. కలశయాత్రలో 10000 కన్న ఎక్కువ గ్రామాలను స్పర్శించి అనేక చోట్ల నర్మదా ప్రజ్ఞామండలులను

**నిజాయితి మనిషిని ఇతరులకు దగ్గర చేస్తుంది.**

స్థాపించారు. పరిణామ రూపంలో ఈ ప్రదేశాలలో అద్భుతమైన మార్పు జరిగింది. చాలా మంది యువకులు స్వావలంబన రూపంలో తీసుకుని నర్మదా శుద్ధితో పాటు జీవనోపాధి సంపాదించుకుంటున్నారు. నదుల పునర్జీవనం జరుగుతున్నది. కొత్త విశ్వాసం పెల్లుబికింది.

**విశ్వవిద్యాలయ పాత్ర:** మానవుడు సంకల్పించుకుంటే అన్నీ సాధ్యమే. ఆకాశంలో కన్నాలు వేయటం కూడా సాధ్యమే. "గంగా శుద్ధి అభియానం" కూడా ఈ స్థాయికి తీసుకురావాలని శాంతికుంజ్ ప్రయాస. ఈ కార్యక్రమం భగీరథ్ నుంచి భరద్వాజ్ (గోముఖం నుండి ప్రయాగ వరకు) మొదటి ప్రారంభించి తరువాత గంగాసాగర్ వరకు చేయవలసిఉన్నది. మన మీద మనకు విశ్వాసం ఉంటే అన్ని సాధ్యమే. ఈ విశ్వాసంతోనే దేవ సంస్కృతి విశ్వవిద్యాలయంలో "జల సంరక్షణ మరియు నదీ ప్రబంధనం" అనే ఒక సర్టిఫికేట్ కోర్సు (ఒకనెల) ప్రారంభించారు. దీని ఉపయోగం దీనికున్నది. ఎవరో ఒకరు ఈ పనిని చేయాలి. మనం ఎందుకు చేయకూడదు?

**సూచనా అధికారం - బాధ్యతతో కూడిన అస్త్రం:** 2005లో పార్లమెంటులో సూచనా అధికార బిల్లు పాసయింది. రైటు టు ఇన్‌ఫర్మేషన్. ఇది భ్రష్టాచారాన్ని ఎదుర్కొనటానికి పదునైన అస్త్రం. శాసన వ్యవస్థను పారదర్శకంగా చేసే బిల్లు ఇది. నూతన శతాబ్దిలో మంచి మార్పుతేగల ఆయుధం ఇది. పాలన మంత్రులు, అధికారులు చేస్తారు. వారు సవ్యంగా ఈ పని చేస్తున్నారా లేదా అనేది మనం చూడవచ్చు. ఎటువంటి వివరాలు కావాలన్న ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వ అధికారిది. ఇవ్వకపోతే తగిన జుర్మానా, సంబంధిత విభాగంపై చర్య తీసుకుంటారు.

**ప్రతివారికి శిక్షణ (చదువు):** చాలామార్పులు వస్తున్నాయి. "శిక్షా కా అధికార్" అనే బిల్లు 2010 ఏప్రిల్ 9 నుంచి అమలులోనికి వచ్చింది. దీని వల్ల పిల్లలందరికి 14 సంవత్సరముల వరకు చదువుకోగలిగే గ్యారంటి ప్రభుత్వం ఇస్తుంది. స్కూలుకు వెళ్ళలేని ఒక కోటిమందికి ఈ బిల్లు ప్రయోజనం కలిగిస్తుంది. ప్రతి విద్యాలయంలో 25% బీద విద్యార్థులకు రిజర్వేషన్ కల్పిస్తుంది.

**దేశాన్ని అగ్రగామిగా చెయ్యాలి:** స్వ పరిపాలన కొరకు, స్వరాజ్యం కొరకు స్వతంత్ర సంగ్రామం జరిగింది. ప్రభుత్వ విధివిధానాలపై ప్రజల నియంత్రణ రావాలి. ప్రజల ఆదేశమే జరిగితీరాలి. రాబోయే దశాబ్దంలో ఇలాంటి ఆశతో ఎదురుచూడాలి. యుగపరివర్తన జరిగితీరుతుంది. అన్ని దేశాల కన్న ఎక్కువ యువత భారత దేశంలో ఉన్నారు. భారతీయ యువత మారుతున్నారు. నారీశక్తి వర్చస్సు క్రమక్రమంగా పెరుగుతున్నది. భారతదేశం గొప్పశక్తిగా, ఆర్థికశక్తిగా, ప్రపంచానికి నేతృత్వం ఇవ్వగలిగే జగద్గురువుగా ఎదుగుతుంది. హిమాలయాలలోని ఋషులు దీనికి నేతృత్వం వహిస్తున్నారు. 2011 నుంచి పరివర్తన తీవ్రతరమవుతుందని విశ్వసించాలి. ఒకప్పటి మన ప్రధానమంత్రి శ్రీ అటల్‌బిహరి వాజ్‌పేయ్ చెప్పిన కొన్న పంక్తులు– భారతదేశం మట్టి మాత్రమే కాదు. ఇది ఒక జాగృతమైన దేశం. ఇది నమస్కరించదగిన, అభినందనం చేయవలసిన భూమి ఈ భరతభూమి. దీనిలోని కణకణము శంకరుడే, ప్రతినీటి బిందువు గంగాజలమే. దీని కొరకే మనం బ్రతకాలి. దీని కోసమే మరణించాలి.

*– అఖండ జ్యోతి జూన్ 2010*

## సూపర్ బ్రెయిన్ యోగా

### (Super Brain Yoga)

*సూపర్ బ్రెయిన్ యోగా అమెరికాలో చాలా ప్రాచుర్యం పొందినది. దీని వల్ల మెదడులోని ఎడమభాగం, కుడిభాగం బాగా పనిచేస్తాయని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని నిరూపించబడింది. ఇంతకీ ఇదేమిటంటే మనం మరచిపోయిన గుంజీలు. 30,40 సంవత్సరముల క్రిందట కూడా ఇవి స్కూళ్ళలో విద్యార్థి చదువులో సవ్యముగా లేకపోతే చేయించేవారు. కాని దానిని ఒక పనిష్మెంట్‌గా భావించి దీనిని వదలివేయటం జరిగింది. ఈ పద్ధతిలో కుడిచేతి బొటనవ్రేలు, చూపుడువ్రేలుతో ఎడమచెవి పట్టుకోవాలి. ఎడమ చేతి వేళ్ళతో ఈ విధంగానే కుడిచెవి పట్టుకోవాలి. తరువాత గాలి పీల్చుకుంటూ కూర్చోవాలి. గాలి వదులుతూ లేవాలి. ఈ ప్రక్రియ అంతా నెమ్మదిగా చేయాలి. రోజుకు ఇలా 14సార్లు చేస్తే చాలు. అద్భుతమైన ఫలితాలు చూడవచ్చు. ఈ విధంగా చేయడం వల్ల జీవితంలో వచ్చే అనేక అడ్డంకులు విచిత్రంగా తొలగిపోతాయి. ఈ విధానానికి సంబంధించిన వీడియోలు ఇంటర్‌నెట్‌లో* **YouTube-Super Brain Yoga**లో *చూడవచ్చు.*

**నలుగురితో పంచుకుని తిను.**

ఉపాసన - రెండు పాదాలు : జపం-ధ్యానం

# ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు? ఎలా?

ధ్యాన సాధనలో భక్తునికి, భగవంతునికి మధ్య ఉచ్చస్థాయిలో ఇచ్చిపుచ్చుకోవడం జరగాలి. సాధన ప్రారంభదశలో సమాధి స్థితిని పొందడం కష్టం. భక్తుడు తన సమస్త కోరికలను, సంపదలను భగవంతునికి అర్పిస్తాడు. దానికి బదులుగా అతనికి కావలసినవన్నీ లభిస్తాయి. వాటి ద్వారానే భక్తునికి భగవంతుని శక్తి స్పష్టం అవుతుంది. ఆ అనుభూతితో ఆనందంగా, ఉల్లాసంగా జీవిస్తాడు. భగవంతుని నుండి భక్తునికి ఏదైనా లభించింది అనడానికి ఆ ఆనంద ఉల్లాసాలే ప్రత్యక్ష సాక్ష్యం. సద్భావన, సత్ప్రవృత్తులు గలవారికి సహజంగానే ఆత్మ సంతోషం, ఆనందం అనుభవంలోకి వస్తాయి.

భగవద్దర్శనానికి సంబంధించి కలలో గాని, మెలకువలోగాని ఇష్టదైవం ఏదో ఒక రూపంలో కనిపిస్తాడనుకోవడం, చిత్ర విచిత్ర దృశ్యాలు కనిపిస్తాయి అనుకోవడం, కాంతి రూపంలో కనిపిస్తాడు అనుకోవడం కేవలం భ్రమ మాత్రమే. అలాంటి వారికి ముండ్లపొద భూతంవలె, త్రాడు పామువలె కనపడుతూ ఉంటుంది. అది వారి ఆలోచనలకు మానసిక ప్రతిక్రియ మాత్రమే అనుకోవాలి. చైతన్యానికి ఆకారం అనేది ఉండే అవకాశమే లేనప్పుడు ఈ దృశ్యాలన్నీ మిథ్యయే కదా! భగవంతుడు మన జీవితంలో ఒక భాగం అవ్వాలంటే సత్ప్రవృత్తులే కారణంగా ఉంటాయన్న విషయం నమ్మితీరాలి. ఆదర్శ వాదంతో కూడిన కోరికలను కోరడం, వాటిని ప్రాణాధికంగా ప్రేమించి తగిన విధంగా ఆచరించడం చేస్తూ ఉంటే ఆనందం, ఉల్లాసం కలుగుతూఉంటాయి. ఆ అనుభూతియే భగవంతుని సాక్షాత్కారానికి ప్రమాణం అని చెప్పవచ్చు.

నిరాకారధ్యానంలో షుమారుగా అన్ని సందర్భాలలో సూర్యుని ప్రకాశపుంజాన్ని మాధ్యమంగా తీసుకోవడం జరుగుతుంది. ప్రభాతకాలంలో ఉదయించే సూర్యుని దివ్య కిరణాలు మన మనస్సులోనికి, అంతరాత్మలోనికి చొచ్చుకుపోతాయి. అలా చొచ్చుకుపోయిన కిరణాలు సత్కర్మ, సత్‌జ్ఞానాల రూపంలో ప్రతిబింబిస్తాయి. ఈ పరిధిలోనే నిరాకారధ్యాన సాధన సాగుతూ ఉంటుంది. యజ్ఞాగ్ని రూపంలో ఉన్న భగవంతునికి సమర్పించిన హోమ ద్రవ్యంవలె, కాలువ నీరు నదీ ప్రవాహంలో కలిసిపోయినట్లు, నదులలోని నీరు సముద్రంలో చేరిపోయినట్లు, దీపపుకాంతి సూర్యకాంతిలో విలీనం అయినట్లు, అర్ఘ్యజలం ఆవిరిగా మారి విశాలక్షేత్రంలో వ్యాపించినట్లు ధ్యానంలో జీవశక్తిని సమర్పించుకోవాలి. అప్పుడే ఏకాత్మ భావనకు చెందిన అనుభూతిని పొందగలుగుతాము.

ధ్యానానికి ఏకాగ్రత చాలా అవసరం. అయినా ఏకాగ్రతే ధ్యానం అనుకోవడం పొరపాటు. ఏకాగ్రత అనేది అభ్యాసంలోనే వస్తుంది. ఏకాగ్రత పట్టుబడడానికి కొంత సమయం పడుతుంది. అందువల్ల దాని కోసం తొందరపడడం కాని, ఆతృతచెందడం గాని చెయ్యకూడదు. జీవిత లక్ష్యాన్ని అన్ని వేళలా గుర్తుంచుకుంటే ఆప్రవాహానికి ఒకదిశ ఏర్పడుతుంది. ఆ దిశ వల్ల ఏకాగ్రత ప్రాప్తిస్తుంది. ఆ నాటినుండి ఏకాగ్రతతో ధ్యానం చేస్తే ధ్యానం యొక్క ప్రయోజనం సిద్ధిస్తుంది. అందువల్ల అన్నింటికీ మించింది సంకల్పబలం అని గుర్తుంచుకోవాలి.

– *అనువాదం: ఊటుకూరి సత్యనారాయణ గుప్త*

**శ్రీ కె.వి. వాలయ్య పంతులు గారు బాల సంస్కారశాలల *ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనరుగా నియమితులయ్యారు. కార్యకర్తలందరూ వీరికి సహాయ, సహకారాలను అందించవలసిందిగా* కోరుతున్నాము.**

***ఫోన్ : 9989860217***

**చేసిన పాపాలు- రోగం, శోకం, పతనం, ఆపదలను తీసుకువస్తాయి.**



## బాలల భవితకు బంగారు బాట-7

# కబీర్‌దాసు (ఏకపాత్ర)

రాత్రంతా ఆ రామనామాన్ని జపిస్తూ జపిస్తూ ఈ వస్త్రాలు నేయగలిగాను ఇవిగనుక అమ్ముడు పోయాయంటే రెండు రోజులు కడుపునిండుగా భోజనం లభిస్తుంది. (నడుస్తూ) కన్నతల్లిదండ్రులు ఎవరో తెలియదు. పెంచిన తండ్రినీరూ, తల్లి నీమా నన్ను ప్రాణసమానంగా చూచుకుంటున్నారు. ఏదో నాకు తోచిన నాలుగు మాటలు చెబుతూ ఉంటాను. నచ్చినవాళ్లు ఆనందిస్తున్నారు. కొందరికి నచ్చడంలేదు. (పెదవి విరిచి) దానికి నేనేం చేసేది? అతిథి అభ్యాగతులకు వండిపెట్టడానికి, ఇంటిని చూచుకోవడానికి గృహిణి కావాలికదా! నన్ను, నా పద్ధతుల్ని ఇష్టపడుతున్న లోయీని పెండ్లి చేసుకున్నాను. (వ్యంగ్యంగా) దానివల్ల ఈ పెద్దలకు వచ్చిన నష్టం ఏమిటి? (నవ్వుతూ) నిన్నటికి నిన్న కొంతమంది గుంపుగా నా యింటికి వచ్చారు. నేనట, పెద్దల ప్రమేయంలేకుండా, అంటే వారికి విందు భోజనాలు పెట్టకుండా పెండ్లి చేసుకున్నానట. అందుకని న్యాయాధికారి ముందర పెండ్లిని విచ్చగొడతారట. అనవసరమైన ఆడంబరాలకు ఖర్చు పెట్టడం వల్ల ప్రయోజనం ఏమిటి అనీ, చివరకు ఆస్తిపాస్తులు అమ్ముకోవాల్సి వస్తుందనీ నచ్చచెప్పే ప్రయత్నం చేశాను. (నవ్వి) అది కూడా వారికి బాధ కలిగించింది. హాత్‌హూత్ అంటూ సమాజం నుండి వెలివేస్తున్నామని తీర్మానం వినిపించారు. (పకపక నవ్వి పొట్టపట్టు కుంటాడు) నాకు నవ్వు ఆగలేదనుకోండి. (నింపాదిగా) "అయ్యలారా ! నా పుట్టుక గురించి మీకందరికీ తెలిసిందే. నాకంటూ ఏ జాతీ లేదు. ఏకులమూలేదు. ఏ మతమూ లేదు. నన్ను మీరు దేనినుండి వెలివేస్తారు?" అని అన్నానో లేదో అందరు దిక్కులు చూడడం మొదలు పెట్టారు. నేను మళ్ళీ "నా జాతి నిజాయితీ, నామతం ప్రేమ, నా కులం సమానత్వం వీటిలో దేనినుండి వెలివేస్తారు? అని ప్రశ్నించాను అంతే. ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటూ వెనుక్కు తిరిగారు. రెండు అడుగులు వేసి ఏమనుకున్నారో ఏమో! వెనక్కువచ్చి పాదాభివందనం చేశారు. బిత్తరపోయాననుకోండి. నాకు కావలసింది నమస్కారాలు కావు. వారి ఆలోచనల్లో మార్పు. (తృప్తిగా) అద్వైతే వచ్చింది అంతేచాలు.

నేను దూదేకులవారి ఇంట్లో పెరిగాను. నేను నిత్యము చేసే రామనామజపాన్ని నా తల్లిదండ్రులు ఎన్నడూ ఖండించలేదు, దండించలేదు. నాకు రాముడు, రహీము ఇద్దరూ సమానమే. (నవ్వుతూ) పాపం! పెరిగిన ఇంటినిబట్టి ముస్లిములు 'మావాడు' అంటున్నారు. నాకుమాత్రం జాతి వాదం, సంప్రదాయవాదం ఏవీ నచ్చవు. మానవతావాదమే అన్నింటికన్నా శ్రేష్ఠమైందని నా భావన. నన్నుపెంచిన తల్లి, నాకు జ్ఞానాన్ని ప్రసాదించిన గురువు పరమపదించడంతో నాకు కాళ్లకింద భూమి కదిలి పోయినట్లయింది. వైరాగ్యంలో సాధు సంతులతో సంపర్కం చెయ్యాలనిపించింది. దేశంమీద పడ్డాను. (నవ్వుతూ) అక్కడి ఆ ప్రపంచంలో గృహస్థును మించిన లోభమోహాలు కనిపించాయి. "మాలా ఫిరతీ హాథ్ మే – మన్ ఫిరై చారోం ఓర్" పేరుకు మాత్రం మాల తప్పుతున్నారు. మనస్సు అనేక ప్రలోభాలవైపు తిరగడం చూశాను. చాలనిపించింది. వచ్చేశాను. హాయిగా ఇంటికి తిరిగివచ్చి అనాధశిశువులకు, అనాథవితంతువులకు నాకు తోచిన సాయం చేస్తూనే వచ్చాను. ఇలాంటి పనులన్నీ ఎందుకోకాని చాలామందికి కంటకంగా తయారయ్యాయి. నా మీద అనేక రకాలుగా విమర్శలు చేస్తూ ప్రచారం చేస్తున్నారు. (ఆలోచిస్తూ) అదీ ఒకందుకు మంచిదే. "నిందకునియరే రాఖియే – కుటీఆంగన్ ఛవాయ్ – బినాసాబున్ మైల్ దూర న హోయ్". మనతప్పుల్ని ఎత్తిచూపించే వాళ్లు మన ప్రక్కనే ఉండాలి. అప్పుడే మనం సరిఅయిన మార్గంలో నడుస్తాం. సబ్బు లేకుండా మురికి పోతుందా?

(ధృఢంగా) కాశీలో మరణిస్తే స్వర్గం వస్తుందనీ, మగహర్‌లో మరణిస్తే నరకం వస్తుందనీ మూర్ఖంగా నమ్ముతారు. నేను నాకుమారుడికి ముందుగానే చెప్పిఉంచుతాను. మరణ సమయానికి నన్ను మగహర్‌కి చేర్చమని ప్రజల్ని మూఢనమ్మకాల నుండి దూరం చేస్తాను. (ఆలోచనగా) ఏమిటీ? నా వెర్రి? అందరిలోనూ చెడును గూర్చి ఆలోచిస్తున్నాను. నేను చేస్తున్నదీ తప్పేనేమో! ముందునన్ను నేను పరిశీలించుకోవాలి. "బురాదూంఢ్ మైచలా మురే సాబురా ఔర్ న మిలాకోయ్ కోయ్‌మిలా" ముందు నాలోని చెడును తగ్గించుకోవాలి. తరువాతనే ఇతరుల గురించి ఆలోచిస్తా.

కం॥ నాటికబీరే రయమున
మేటిపరమహంసయగుచు మేదిని వెలిగెన్
సూటిగ శ్రీరాముడనగ
ధాటిగ గుణముల కబీరు దలపుము బాలా!

★★★

**ఇతరులకు ఇవ్వడమే పుణ్యం.**

ప్రజ్ఞోపనిషద్

# ద్వితీయ అధ్యాయం - 7

*వయం యద్ బ్రహ్మతత్వస్య మునే కుర్మేవగాహనమ్*
*న వివేచ్యో విరాటత్ర పరమేతతదవేహి యత్* **(42)**

*మానవానామన్తరాలే సత్తా యా విద్యతే ప్రభో*
*తస్యా మహో మహత్తాం తుజ్ఞాతుం క్షమా వయం* **(43)**

*కథం పశ్యామ ఏవంచ కథం కుర్మస్తథాత్మసాత్*
*ప్రయోజన మిదం సర్వం బ్రహ్మవిద్యా ప్రచక్షతే* **(44)**

**టీకా:–** హే ఋషివర్యా! మనము అర్థం చేసుకుంటున్న బ్రహ్మతత్వ ఉద్దేశ్యం విరాట్ యొక్క వివేచన కాదు. మానవ అంతఃకరణలో ఉన్న ఈశ్వరీయ సత్తా యొక్క మహత్వమును ఏ విధంగా అర్థం అయ్యేటట్లు చేయగలము? దానిని చూడడం ఎలా? పెంపొందించుకోవటం ఎలా? ఎలా స్వంతం చేసుకోగలము? దీనినే బ్రహ్మవిద్య అంటారు.

అంతర్ జగత్తులో పరమాత్ముని అంశ బీజరూపంలో ఉన్నది. దీనిని గుర్తించి దానిపై ఆవరణలను తీసివేసి వికసింపచేసుకోవాలి. ఇలా సాధించుకున్నవారు మహామానవులని, దేవదూత స్థాయికి చేరతారు. రిద్ధి సిద్ధులు ఆత్మతత్వ అనుదాన రూపంలో వర్షిస్తాయి. మీరాబాయి, చైతన్య మహాప్రభు, కబీరు మొదలైన వారు ఇలాంటి సాధన చేశారు.

*సువిధాసమ్పదా పూర్ణం జగదేతత్తు భౌతికమ్*
*సమృద్ధిరాత్మికం తృప్తితుష్టిశాంతిభిరా ప్లుతమ్* **(45)**

*సువిధాః సాధనేష్వేవ రమన్తే మన్దబుద్ధయః*
*యథా క్రీడన్తిబాలాస్తథా తే సన్తి నిశ్చితమ్* **(46)**

*ఆధ్యాత్మికస్య జగతః స్వర్గ్యా ప్రాప్తుంతు సంపదామ్*
*రుచిర్యేషాం మహాభాగ్యా ధన్యం తేషాం హి జీవనమ్* **(47)**

**టీకా :–** భౌతిక జగత్తులో సుఖసాధనములు ఉన్నట్లే ఆత్మిక క్షేత్రంలో తృప్తి, తుష్టి, శాంతి అనేవి సంపదలే. ఎవరైతే భౌతిక సుఖములలో తేలియాడుతుంటారో వారు బొమ్మలతో ఆడుకునే పిల్లల వలె మందబుద్ధులు. ఎవరైతే ఆత్మిక జగత్తులోని స్వర్గీయ సంపద ప్రాప్తించుకోవడంలో అభిరుచి ఉంటుందో వారిని అదృష్టవంతులు అనవచ్చు. వారి జీవనం ధన్యము.

అజ్ఞానం వల్ల మనిషి భౌతిక సుఖ సాధనాలే అంతా అని భావిస్తాడు. మనిషికి శారీరిక బలం, బుద్ధి యశస్సు, ఐశ్వర్యం, ప్రతిష్ఠలు లభించినా, ఆత్మిక సంపదలేకపోవడం వల్ల నిమ్నస్థాయి జీవితమే జీవిస్తాడు. భౌతిక వసతులు అవసరమే కాని వాటివల్ల జీవనంలో సుఖం ఉంటుంది కాని శాంతి ఉండదు. శరీర నిర్వాహణకు భౌతిక సంపదలకు, ఆత్మిక సంపదలకు సమన్వయం అవసరం. శారీరిక దృష్టితో తృప్తి, జ్ఞాన దృష్టితో తృష్టి, ఆత్మ దృష్టితో శాంతి పొందగలగాలి.

*బహిర్ముఖాః జనాః సర్వే భ్రమజాలేషు పాశితాః*
*అంతర్ముఖాశ్చ తథ్యజ్ఞా సత్యం శ్రేయః శ్రమన్వలమ్* **(48)**

**టాకీ :–** బహిర్ముఖీ భ్రమ వల్ల ఝుంఝూటనలలో ఇరుక్కుంటాడు. అంతర్ముఖ తథ్యాలను అర్థం చేసుకొని సత్యాన్ని గ్రహించి శ్రేయస్సు పొందుతాడు.

*అంతర్జగత్ ఉత్థానం పర్యవేక్షణమేవ చ*
*ఆత్మవిజ్ఞానమస్య స్మిన్నుపలబ్ధిర్యథా - యథా* **(49)**

*యస్య తత్క్రమతోగృహ్యామునీనాంణాం భూమికామపి*
*దేవదూతావతారాణాం మహామానవ రూపిణామ్* **(50)**

*సఫలం మానవం జన్మ స్వం కరోతి తథా చ సః*
*కల్యాణ మార్గం జగతః ప్రశాస్తి చ మహామునే* **(51)**

**టీకా :–** అంతర్ జగత్తు యొక్క పర్యవేక్షణ, అభివృద్ధే ఆత్మ విజ్ఞానం. ఇది ఎంతగా లభ్యమవుతుందో అంతగా మహామానవుడి, ఋషుల, దేవదూతల అవతారాల భూమిక నిర్వహిస్తూ మానవ జన్మను సార్థకం చేసుకుంటాడు. జగత్తు యొక్క కళ్యాణ మార్గమును ప్రశస్తం చేస్తాడు.

ఆత్మవివేచన ఋషులు అందించిన విద్య. తమ అంతరంగంలోకి తొంగిచూచి ఆత్మ నిరీక్షణ, విశ్లేషణ దాని వికాసక్రమాన్ని వెదకి పట్టుకోవడమే అన్నింటికన్నా పెద్ద పురుషార్థము. మనలో చాలమంది బహిరంగ జగత్తులోనే ఊగిసలాడుతుంటాం. ఎప్పుడూ లోపలికి తొంగి కూడా చూడము.

*జిజ్ఞాసాయాః సమాధానం త్వేకమేవాస్తి తాత! యత్*
*స్వతన్త్రో మానవః స్వస్యాం ప్రగతౌ దుర్గతౌ భృశమ్* **(52)**

**సభ్యతా స్వరూపం - ఇతరులపట్ల సరళత్వం, ఔదార్యం.**

*వృత్వా స్వయమనౌచిత్య మాత్మనే స విషదృమమ్*
*స్థిరయత్యాత్మనౌ యస్య గౌరవే విపులా రుచిః* **(53)**

*ఆత్మ నిర్మాణ రూపే యః పురుషార్థే రతస్తథా*
*సన్మార్గే సహసం గుప్తం తస్య పాతౌ నసమ్భవః* **(54)**

**టీకా :–** నాయనా! మీ జిజ్ఞాసకు ఒకే సమాధానమున్నది. మనిషికి ప్రగతి మార్గాన వెళ్ళాలన్న లేదా దుర్గతివైపు వెళ్ళాలన్నా పూర్తి స్వేచ్ఛ ఉన్నది. అనౌచిత్యాన్ని అవలంభించడం అనేది తనకు తానే విషవృక్షం నాటుకోవడమే. ఎవరికి ఆత్మగౌరవం ఉన్నదో, వారు ఆత్మ నిర్మాణమనే పురుషార్థం చేస్తుంటారు. వీరికి సన్మార్గం వైపు వెళ్ళగలిగే సాహసముంటుంది. వీరికి పతన పరాభవములు ఎన్నడూ ఎదురుకావు.

*సమాయూస్తు జనాః సర్వే గృహ్ణన్తో దూరదర్శితామ్*
*వివేకం సంత్యజన్తశ్చాకర్షణేషు భ్రమ ద్వితీయః* **(55)**

*కుమార్గామినే భూత్వా దురూహం దుఃఖసన్తతిమ్*
*సహన్తే మోఢమాయాయా యది మొక్తుం సమేతు తే* **(56)**

*ఆత్మావలంబినాం సాహసం తు వివేకినామ్*
*లభ్యైరస్తేపి కుత్రాపి తౌ విపత్తి విభీషికాః* **(57)**

*ద్రష్టుం నైవ తు శక్ష్యామౌ దృష్టా మగ్నాస్తు యత్ర తే*
*సమాప్తిం నరకస్యాయం హాహాకారో గమిష్యతి* **(58)**

**టీకా :–** దూరదృష్టి లేకపోవడం వల్ల సామాన్యజనులు వివేకం కోల్పోయి ఆకర్షణలలో కొట్టుమిట్టాడుతుంటారు. చెడు మార్గంలో పయనిస్తూ దుఃఖాలను సహిస్తుంటారు. ఇటువంటి వారు మూఢత్వాన్ని వదులుకుని, వివేకవంతుడై ఆత్మావలంబనం (ఆత్మ మీద ఆధారపడడం) తీసుకునే సాహసం లభ్యమైతే అతనికి ఇప్పటి దాకా వేధిస్తున్న కష్టాలు, బాధలు ఇక కానరావు. నరకప్రాయమైన వాతావరణం, హాహకారాలు ఇక కనిపించవు.

వివేకాన్ని వదలిపెట్టడమే పెద్ద తప్పు. సమాజంలో ఉన్న ఆకర్షణలో ఆనందాన్ని వెదకడంలోనే నిమగ్నమైనవాడికి దాని పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించలేడు.

*మహామనీషిణస్తత్వజ్ఞానిన ఎతదేవ హి*
*ఆత్మతత్వంతు విజ్ఞాతు ముచ్యోద్ధుం చాస్య మూర్ఛనామ్* **(59)**

*ప్రౌఢం పరిష్కృతం కర్తుం భజన్తే యోగ సాధనామ్*
*తపస్యాయాం రతాహేమ్నః పరిష్కార ఇవాస్తి యత్* **(60)**

**టీకా:–** తత్వజ్ఞానులు, మహామనీషులు ఆత్మ తత్వాన్ని అర్థం చేసుకుని, దానిని మూర్ఛ నుంచి లేపి పెంచి పోషించేందుకు యోగసాధన చేస్తారు. తపశ్చర్యలో నిమగ్నమై ఉంటారు. ఈ పని బంగారానికి పుటం పెట్టడం వంటిది.

సామాన్య జనసముదాయం మూఢత్వం అనే మాయలో ఒక రకమైన నిద్రాస్థితిలో పడి బ్రతుకు బండిని ఈడుస్తుంటారు. ఈ నిద్రనుంచి మేల్కొనాలి. తరువాత సాధనా పురుషార్థం అవసరమవుతుంది. లోపలి మాలిన్యాలను కడిగివేయడానికి తపశ్చర్య అవసరమవుతుంది.

*పాత్రతాయాం వికాసోయం హ్యనేకానేక సంపదాం*
*ఉపలబ్ధేహిం భూతీనాం పన్థాశ్చ కేవలః స్మృతిః* **(61)**

**టీకా:–** అనేకమైన విభూతులు, సంపదలు పొందటానికి ఒకే మార్గం ఉన్నది. అది పాత్రత పెంచుకోవడమే.

భౌతిక క్షేత్రంతో పోలిస్తే ఆధ్యాత్మిక ప్రతిఫలం చాలా రెట్లు మహత్వపూర్ణమైనది, సామార్థ్యవంతమైనవి, చమత్కారమైనవి. కొందరు మహాపురుషులను చూచినప్పుడు వీటిని ప్రాప్తించుకోవాలని మనస్సు ఉవ్విళ్ళూరుతుంది. కాని కావలసిన స్థాయిలో ఆధ్యాత్మిక పురుషార్థం లేకపోవడం వల్ల, పాత్రత లేకపోవడం వల్ల ఈ దివ్య విభూతులు లభించడం లేదు. పాత్రత వికసించినపుడు ఇవి అడగకుండానే సాధకుని పై వర్షిస్తాయి. లౌకికమైన ఆశలు, కోరికలు లేని వారికి, ఉదారులకే ఈ శక్తులు లభిస్తాయి.

*ఆత్మ నిరీక్షణం ఆత్మనిర్మాణం సర్వతో మహాన్*
*పురుషార్థే మతో నాస్తి సాధనా యాచనాథ చ* **(62)**

*పరావలంబనం నైవ విద్యతే విద్ధి తామతః*
*ఆత్మనస్తు పరిష్కార స్యాధారః సునియోజితః* **(63)**

**టీకా :–** ఆత్మ నిరీక్షణ, ఆత్మ నిర్మాణమే అన్నింటి కన్న పెద్ద పురుషార్థము. సాధన అనేది పరావలంబనం కాదు. యాచన కాదు. ఇది ఆత్మ పరిష్కారానికి సరియైన ఆధారమని భావిస్తారు.

జీవితం కల్పవృక్షం వలె అసంఖ్యాకమైన సత్పరిణామాలతో నిండివున్నది. కాని ఇవి జీవితమును సవ్యముగా జీవించిన వారికే లభిస్తాయి. జీవన క్షేత్రమును సువ్యవస్థితముగా చేసుకొనడమే సాధన అని చెప్పబడ్డది. మనలో ఉన్న అలవాట్లు, కోరికలపై నియంత్రణతో పాటు సత్ప్రవృత్తులను పెంపొందిచుకోవడం వల్ల వ్యక్తిత్వనిర్మాణం జరిగి లాభాన్వితులవుతారు.

– అనువాదం : శ్రీ మారెళ్ళ కామరాజు

**మనిషి తన పరిస్థితులను తానే నిర్మించుకుంటాడు.**

ధారావాహిక: పరమేశ్వరుని చిరునామా-13

# కర్తవ్య పరాయణ జీవజంతువులు

పిల్లలను పెంచేపని తల్లిదండ్రులది. ఈ పెంపకం వాళ్ళను సోమరులుగా చేయడానికి కాదు. కాని వాత్సల్య ప్రభావం ప్రబలంగా ఉంటుంది. ఎవరి పిల్లలు వారికి ముద్దు. పిల్లల పిల్లలంటే ఇంకా ఎక్కువ ప్రేమ ఉంటుంది. మానవజాతికి ఇది ఒక ప్రత్యేక లక్షణం. అయితే అడవులలో తిరిగే కుందేలు కూడా ఈ విషయంలో మనిషి కంటే తక్కువేమీ కాదు. ఎందుకంటే అది కూడా తన పిల్లలను మనిషి కంటే ఎక్కువగా ప్రేమిస్తుంది.

ప్రసిద్ధ జీవ శాస్త్రవేత్త డా. డీ. టరిచ్, డి. వికెల్ చాలా కాలం కుందేళ్ళ సామాజిక జీవనాన్ని అధ్యయనం చేసి కుందేళ్ళలో మానవీయ గుణాలు అధికంగా ఉంటాయని, కొన్ని అయితే చిన్న చిన్న విషయాలకి కోపగించుకుంటాయని మరికొన్ని శాంత స్వభావాన్ని సహనాన్ని కలిగి ఉంటాయని వ్రాశాడు. వాటి మధ్య స్నేహానికి గుణాలే ఆధారమవుతాయి. అంటే కొంత సమయం కలిసి ఉండి తనలాగ ఉంటేనే స్నేహం పోషించడంతోపాటు ఆటలలో శిక్షణ ఇచ్చే బాధ్యతను కూడా స్వీకరిస్తాయి. ఆటలు ఆడటం కుందేళ్ళకి అనివార్యం. ఆటల సమయంలో అనేకసార్లు ఎంత ఆనందాన్ని అనుభవిస్తాయంటే ముంగిసలు కూడా స్వజాతీయ జీవాలుగా భావించి వాటితో కూడా ఆటలాడు తుంటాయి. వాటి ఈ స్వభావం జీవితాంతం ఆరోగ్యంగా ఉండే వరాన్నిచ్చింది. కుందేళ్ళ ఈ నైసర్గిక గుణాల నుండి మానవ జాతి కూడా ఎప్పుడూ పనిచేస్తూ ఆటపాటలలో మునిగి ఉండే శిక్షణను పొందవచ్చు. ప్రస్తుత రోగాల చికిత్సకోసం వెదజల్లబడుతున్న ధనంలో సగభాగం గ్రామగ్రామాలలో క్రీడావ్యవస్థ ఏర్పాట్లలో ఖర్చుపెడితే వంద వైద్యశాలల కంటే ఎక్కువ ఉపయోగకరం.

మనిషికి తానే తెలివిగలవాడిననే అహంకారం బాగా ఉంది. అయితే ఈ అహంకారం కారణంగానే తనను తాను ప్రకృతికి విరుద్ధంగా తయారయ్యాడు. రోగ శోకాలలో కొట్టుమిట్టాడు తున్నాడు. ఆరోగ్యకరమైన సమతుల్య జీవన శిక్షణను అతడు ఇప్పుడైనా ప్రకృతి నుండి, ఈ చిన్న చిన్న జీవ జంతువుల నుండి పొందవచ్చు. మనం అతి నిర్లక్ష్యంగా చూసే కాకులలో కూడా జాతీయ హితం, స్వతంత్ర భావాలను చూడవచ్చు. ఒకసారి వాటి స్వభావాన్ని విస్తృతంగా అధ్యయనం చేయడానికి మేడమ్ జీన్ జార్జ్ మరియు ఆమె భర్త డా॥ జాన్ ఒక కాకి గుడ్డును పొదిగించారు. కాకులు సాహసంగా, నిర్భయంగా దాడి చేస్తాయి. అందువలన వాటి పిల్లలను పట్టుకోవడం కష్టం. అందువలననే వాళ్ళు ఇలా చేశారు. గుడ్డు నుండి పిల్ల బయటకు వచ్చింది. పెరిగి పెద్దదైంది. మానవులతో కలసిఉండటం వలన దానికి వారితో స్నేహం ఏర్పడింది. ఇది ఇతర కాకులకు నచ్చలేదు. ఇంకా అధ్యయనం చేయడంతో ఆ కాకి పిల్లకూడా తన తప్పును ఖచ్చితంగా అంగీకరిస్తుందని తెలిసింది. అది కిటికీ దగ్గర కూర్చుని తన యజమానితో ఆటలాడుతూ ఉంటుంది. అయితే ఒక ప్రత్యేకమైన ధ్వనితో ఇతర కాకులు దానిని తిరస్కరించి తమ భాషలో మానవజాతి చేసే తప్పుల పట్ల జాగ్రత్త వహించమని సంకేతాన్నిస్తాయి. అప్పుడు ఆ పిల్లకాకి తన యజమానిని కూడా లెక్కచేయకుండా ఎగిరిపోతుంది. తన సోదరులతో కొంచెం సేపు ఆడుతుంది, తరువాత ఇంటికి తిరిగి వస్తుంది.

కాకి గొప్ప తెలివిగల పక్షి. తెలివి తన వారసత్వమని మనిషి అనుకుంటూ ఉంటాడు. అయితే నిజం ఏమిటంటే తమ పరిమిత క్షేత్రం మరియు శక్తులలోనే సృష్టిలోని ఇతర జీవాలలో కూడా విలక్షణమైన బుద్ధి మరియు ఆత్మిక శక్తులు ఉన్నాయి. కాకులన్నీ ఓడిపోయినప్పుడు వాటి నాయిక ఆలోచించి ఉపాయంతో ఒక పథకాన్ని రచించింది. అది ఒక విందు ఏర్పాటు చేసింది. ఆ పెంపుడు కాకి తన తుంటరితనాన్ని ప్రదర్శిస్తూ ఒక చోట కూర్చుంది. దానికి ఆశపెట్టి తన దగ్గరకు పిలిచింది నాయిక. ఈ విధంగా అవి ఆ పరాధీన కాకిని కూడా బంధన విముక్తి గావించడంతో విజయం సాధించాయి.

కాకులలో ఒక జాతి అయిన నల్లకాకి తెలివిని, సామాజికతను చూస్తే మనిషే కాకి యోనిలోకి వెళ్ళడానికి వివశుడవుతాడు. ఎందుకంటే అవి మనుషుల అలవాట్లకు

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఆలోచనా వ్యవహారాలకు అసాధారణ సామీప్యాన్ని కలిగి ఉంటాయి.

భారతదేశం, సైబీరియా, గ్రీన్‌లాండ్, ఆఫ్రికా, ఉత్తర అమెరికా మరియు యూరప్‌లో కనిపించే ఈ రెండు అడుగుల పొడవుగల పక్షి లక్షణాలను అధ్యయనం చేసేకొలది కొత్త రహస్యాలు తెలుస్తున్నాయి. ఏదో ఒక రోజు ఈ ప్రపంచంలో పూర్వజన్మ సిద్ధాంతానికి సార్వభౌమిక నమ్మకం లభిస్తుంది. విజ్ఞాన శాస్త్రం దానిని బలపరుస్తుంది. మరిన్ని అన్వేషణలు జరిగితే నల్లజాతి మనుషులు మరణించిన తరువాత సంస్కారవశాన ఈ కాకి యోనిలో ప్రవేశించారని విదితమవుతుంది. ఆ రోజు తప్పక వస్తుంది.

జర్మనీకి చెందిన 'మ్యాక్స్ పల్లోక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఫిజియాలజీ ఆఫ్ బిహేవియర్ ఇన్ సీ విజన్' జీవ జంతువుల స్వభావ అధ్యయనానికి చాలా ఉపయోగకరమైన స్థానం. జర్మన్ వైజ్ఞానికుడు డా॥ ఎవర్‌హోయి గ్వినర్ ఈ నల్లకాకి మీద విస్తృత అధ్యయనం చేశాడు. దాని రక్తంలోని లక్షణాలు మనిషి రక్తంలోని లక్షణాలను పోలి ఉండడం చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. దాని స్వభావంలోని చిత్ర విచిత్రాలు నల్లజాతి మానవుల లక్షణాలతో నిండి ఉంటాయి.

వివాహానికి ముందు ఆడ – మగ కాకులు ఒక సంవత్సరం పాటు కలిసి ఉంటాయి. ఆడకాకి నాయకత్వ లక్షణాలు, సాహసం, ధైర్యం గల మగకాకిని ఎంచుకుంటుంది. సోమరిపోతు, బలహీనుడు, మూర్ఖులను ఎవరు అంగీకరిస్తారు? ప్రకృతి ప్రయత్నశీలుని, సాహసి మరియు ధైర్యం గలవారినే వరిస్తుంది. ఆడకాకి కూడా ఇలాగే ప్రవర్తిస్తుంది. ఈనాటి యువకులు బాగా తెలివిమీరారు. స్త్రీలకు బుద్ధి ఉండదని, వారిని మోసగించి బుజ్జగించ వచ్చునని అనుకుంటారు. కాని ఆడ నల్లకాకి ఎకాఎకిన విశ్వసిస్తే మోసానికి గురవుతామని ఒక సంవత్సరం దానికి సమీపంగా ఉండి అధ్యయనం చేస్తుంది. అది మగ కాకి కాముకతను చక్కగా గుర్తిస్తుంది. అందువలననే ఒక సంవత్సరం పాటు పరీక్షించి చూస్తుంది, ఆ గుణాలు ఆ కాకిలో లేవని పసిగడితే అది దానిని వదలిపెట్టి మరో కాకిని వరిస్తుంది. సహజంగా కట్నం మరియు కృత్రిమ గుణాలమీద ఆడపిల్లలు మోసపోతుంటారు. కాని నల్లకాకిని మోసగించడం అసాధ్యం.

పరీక్షాకాలంలో వారు ఒకరికొకరు సహకరించుకుంటామని చేయడంలో ఎటువంటి సందేహము లేదు. అనేకసార్లు ఆడ–మగ కాకులు దారి తప్పుతాయి. ఈ పరిస్థితుల కోసం అవి ముందునుండే కొన్ని ప్రత్యేకమైన ధ్వనులను నిర్ధారించుకుంటాయి. ఇవి ఏ ఇతర కాకికి తెలియదు. ఆ ధ్వనుల ఆధారంగానే ఒకదానినొకటి వెతుక్కుంటాయి. ఒకసారి పరీక్షించేటపుడు డా॥ గ్విినర్ ఒక కుక్క అరుపువిని ఉలిక్కి పడ్డాడు. అక్కడ కుక్క ఏదీ కనబలేదు. కొద్దిసేపయిన తరువాత ఒక నల్లకాకి ఒక నవ వధువు కాకికి సంకేతాన్ని అందిస్తూ పిలుస్తున్నట్లు తెలిసింది. కొద్దిసేపట్లో రెండూ కలిసిపోయాయి.

వివాహం తరువాత కూడా ఆడకాకి దాంపత్య అధికారాన్ని, స్వాభిమానాన్ని సురక్షితంగా ఉంచుకుంటుంది. స్త్రీ అయిన కారణంగా తన శక్తిని, తేజస్సును కోల్పోవాలి అన్న విషయాన్ని ఆడ నల్లకాకి ఏ మాత్రం అంగీకరించదు. సంబంధం నిశ్చయం కాగానే తాము ఉండడానికి అనువైన స్థలాన్ని వెదుక్కుంటూ ఉంటాయి. ఈ వెదుకులాటలో అనేకసార్లు మగకాకి సగం పూర్తయిన గూడు వదలి మరల మరల కొత్త గూటిని తయారుచేయవలసి వస్తుంది. వాటిలో దేనిని ఎంచుకోవాలి? అందులో ఉండాలా వద్దా అనేది ఆడకాకి ఇష్టాయిష్టాల మీదే ఆధారపడి ఉంటుంది.

గ్విినర్ ఇంకా ఇలా వ్రాశాడు. 'భార్యాభర్తల సంబంధం ఎలా ఉంది? పారివారిక జీవనంలో ప్రేమ, శాంతి, సుఖం మరియు మంచి వ్యవస్థ ఉందా? లేదా? ఈ విషయాలు ఇంటిని, పిల్లలను చూసి తెలుసుకోవచ్చు. ప్రేమ, స్నేహం, సద్భావనలు ఉన్న ఇల్లు శుభ్రంగా, అందంగా అలంకరించబడి ఉంటుంది. వారి పిల్లలు, సభ్యులు ఆడుతూ, పాడుతూ ఆనందంగా ఉంటారు. నల్లకాకికి కూడా ఇదే వర్తిస్తుంది. దాని గూడు చూసి వాటి పారివారిక జీవనంలో ప్రేమ, సౌహార్ద్రాలు ఉన్నాయా లేదా అన్న విషయాన్ని తెలుసుకోవచ్చు.

మగకాకి కూడా తన స్త్రీ పట్ల సమర్పిత భావంతో ఏకపత్నీ వ్రతాన్ని పాటిస్తూ మానవజాతికి శిక్షణనిస్తుంది. ఒక రకంగా దాని కాముకతను పరిత్యజించి కర్తవ్య భావనలను ప్రేరేపిస్తుంది. గుడ్లను పొదగడానికి ఆడకాకి 18–19 రోజులుదాకా గూటిలోనే ఉండిపోతుంది. ఆ సమయంలో ఆహారాన్ని తీసుకువచ్చి దాని

**సమయాన్ని ఉపయోగించుకున్న వ్యక్తి ఉన్నత స్థితికి ఎదుగుతాడు.**

నోటిలో వేసి తినిపించే పనిని మగకాకి భావపూర్వకంగా పూర్తిచేస్తుంది. ఒక డచ్ జీవశాస్త్రవేత్త ఒకసారి గుడ్లను పొదిగే సమయంలో ఆడకాకి చనిపోయింది. ఆ సమయంలో మగకాకి గుడ్లను పొదిగే బాధ్యతను స్వీకరించింది. పిల్లలను పెంచి ఎగరడం వరకు అన్నీ నేర్పే బాధ్యతను ఒంటరిగానే నిర్వహించిందని వ్రాశాడు.

ఆటలు వీటికి అనివార్యం. మన గ్రామాలలో ఒకప్పుడు పహిల్వానులే గురువుగా ఉండేవారు. గ్రామాలలో పిల్లల ఆరోగ్య బాధ్యత పూర్తిగా వారిమీదే ఉండేది. వారు ఉదయం, సాయంత్రం పిల్లలను క్రీడా ప్రాంగణాలకు తీసుకెళ్ళి కుస్తీ, మల్లయుద్ధ విద్య, ఆయుధ ప్రయోగాలను నేర్పి శక్తిశాలులుగా, ఆరోగ్యవంతులుగా, సమర్థులుగా తయారుచేసేవారు. మనదేశంలో ఈ వ్యవస్థ అంతరించినప్పటి నుండి ఆరోగ్యం, సామర్థ్యం స్థానాలను రోగశోకాలు. బలహీనతలు ఆక్రమించాయి. కాని ఈ పక్షులలో ఈ అనుసరించదగిన పరంపర ఈ కలియుగంలో కూడా దృఢంగానే ఉన్నది. మనిషి మానవోచిత గుణాల నుండి దిగజారి ఏ యుగాన్నయినా కలియుగంగా చేస్తే చేయవచ్చు. కాని జీవ జంతువులు ప్రాకృతిక సమత్యులతను ఎప్పుడూ పోగొట్టుకోవు. అందుకనే అవి అనాదికాలం నుండి తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నాయి.

ప్రతి కాకి గుంపుకు కొన్ని రింగ్ లీడర్లుగా ఉంటాయి. పిల్లకాకులను ఆటలాడించడం వాటి పని. ఏవైనా సోమరిగా కనబడితే ముక్కుతో పొడిచి ఆటలలోనికి తీసుకువస్తాయి. శరీరంలోని కల్మషాలన్నీ బయటకు వెళ్ళిపోయే విధంగా ఇవి ఆటలలో శ్రమిస్తాయి. ఒకదానికొకటి సహకార భావనలు కలిగి ఉంటాయి. వాటిని చూస్తే మనిషి కూడా బుద్ధిమంతుడై ఈ గుణాలను ధారణ చేస్తే అతడు కూడా ఎంతో ఆరోగ్యంగా, సుఖంగా, సమున్నతంగా ఉండవచ్చు కదా అనిపిస్తుంది.

ఆఫ్రికాలో దట్టమైన కీకారణ్యాలలో ఒక మొక్క ఉంది. దాని ద్వారా అనేక జీవ జంతువులకు ఆహారం లభిస్తుంది. ఈ మొక్క భూమి నుండే మొలిచి వస్తుంది. కాని భూమిపైకి రావడంతోనే ఏదో తెలియని ఆవశ్యకత–ఆకాంక్షల కారణంగా పెరగడానికి నిరాకరిస్తుంది. మొక్క పెరుగుదల ఆగిపోవడానికి ముందే ఉడుతలు ఎక్కడినుండో కొన్ని విత్తనాలు తెచ్చి ఆ మొక్క వేళ్ళ దగ్గర గొయ్యి తవ్వి పాతుతాయి. సముచిత శిక్షణ, సంస్కారాన్ని పొందిన పిల్లల బుద్ధి, ఆత్మవికాసం ఎలా జరుగుతుందో, అదే విధంగా ఆ విత్తనాలు మొక్కకు ఎరువుగా, నీరుగా అవుతాయి. అది ఉత్సాహంగా పెరిగి పెద్దదై పండ్లు, పూలను ఇస్తుంది.

ఈల్ పక్షులు భోజనము మరియు భ్రమణం కోసం వేలాది మైళ్ళు వెళ్తూ ఉంటాయి. అయితే గ్రుడ్లు పెట్టే సమయం వచ్చినపుడు తమ జన్మ స్థానానికి చేరుకుంటాయి. మరణకాలం ఆసన్నమైనపుడు అవి ఎక్కడ ఉన్నా జన్మస్థానానికి తిరిగివస్తాయి. సాల్మన్ పక్షికూడా జీవితమంతా అది గుర్తుంచుకునే విషయం – ఏ పరిస్థితుల కారణంగా ఈ యోనిలో జన్మించవలసి వచ్చిందో, జన్మించిన తరువాత మరల అలాంటి నికృష్ట జీవనం లభించకూడదని తమ మూల స్థానానికి తిరిగివచ్చి జీవన దిశను మార్చుకుంటుంది.

కోడిపిల్లలు పుట్టిన పదిహేను నిమిషాలకే తమ ఆహారం కోసం బయలుదేరుతాయి. ఏదైనా ప్రమాదం అనిపిస్తే వాటంతట అవే ప్రమాద సూచిక ధ్వనిని వినిపిస్తాయి. అయితే ఆ ధ్వనిని అంతకుముందు తన తల్లిదండ్రుల నుండి గానీ, బంధువుల నుండి గానీ విని ఉండవు. కందిరీగ పిల్లలు చాలా చిన్నవిగా ఉంటాయి. వాటి మరణకాలం తటాలున వచ్చిపడుతుంది. ఇంటిలో ఆహారాన్ని సంపాదించుకోలేని చిన్న పిల్లల రక్షణ కర్తవ్యం మరోవిధంగా బాధిస్తూ ఉంటుంది. అపుడు కందిరీగ మిడతలను పట్టుకొని ముక్కలు ముక్కలు చేసి ఉంచుతాయి. పిల్లలు వాటి మాంసాన్ని తిని పెద్దవుతాయి.

ఉడుత విత్తనాలు నాటడం, సాల్మన్ మరియు ఈల్ పక్షులు మృత్యు సమయంలో వేలాది మైళ్ళ దూరం నుండి ఇంటికి చేరడం, కోడిపిల్ల వంశ పరంపర ఆధారంగా ఎటువంటి శిక్షకుడు లేకుండా జ్ఞానాన్ని పొందడం, చచ్చేదాకా ఓ చిన్న 'కందిరీగ' లోని కర్తవ్య పాలన భావన మనలను ఆలోచింప చేస్తాయి. జీవులలో ఇలాంటి గణనీయమైన బుద్ధి రహస్యం ఏమిటి? ఈనాటి బుద్ధివాద వ్యక్తులు, జంతు శాస్త్రవేత్తలు ఇదంతా ప్రకృతి ప్రేరణతో జరుగుతుందని జవాబిస్తారు.

★★★

**సమయాన్ని వృథా చేసుకోవడం జీవితాన్ని వృథా చేసుకోవమే.**

మనం - మన ఆరోగ్యం

# యజ్ఞవిద్యలో వనౌషధ విజ్ఞానం

ఋగ్వేదంలో 'వాత్ అవాత్ భేషజమ్' అని చెప్పబడింది. దాని అర్థమేమనగా ఔషధ యుక్తమైన వాయువు నలువైపులా వీచినపుడు, అది రోగాలను హరించే సర్వశ్రేష్ఠమైన ఔషధపు గాలి అవుతుంది. అధర్వణ వేదంలో (3-11-1) యజ్ఞాలలో అర్పించబడిన ఆహుతులవల్ల క్షయ (టి.బి) మొదలైన రోగాలనుండి విముక్తి పొందవచ్చునని స్పష్టం చేయబడింది.

వేద విజ్ఞానాచార్యుడైన పండిత వీరసేన వేదశ్రయీ, తమ 'ప్రపంచ ఆరోగ్యానికి యజ్ఞ ఉపయోగం' అను వ్యాసంలో ఈ క్రింది విధంగా ఉద్ఘాటించారు. యజ్ఞం యొక్క అద్భుత ప్రభావం వలన గుండె, వాతం, శ్వాస, ఉన్మాదం, పక్షవాతం, మాట్లాడలేకపోవుట, కల్పవాతం, పుట్టకురుపు, క్షయ, సంతానహీనత, శక్తిహీనత వంటి అనేక రోగాలు దూరమౌతాయి. యజ్ఞంలో ప్రయోగించిన వనౌషధులపైన రోగ విముక్తి ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా వనౌషధులను ఉపయోగించి చేసిన యజ్ఞం పర్యావరణ కాలుష్యాన్ని తొలగించడానికి సహకరిస్తుంది. ఈ విషయంలో మహర్షి దయానందుల కథనం ప్రకారం యజ్ఞంలో వాడబడిన వనౌషధులు సూక్ష్మరూపంలో గాలిలో కలిసి, వ్యాప్తిచెంది, దుర్గంధాన్ని తొలగించి సుగంధాన్ని నింపుతాయి. ఈ యజ్ఞసామగ్రులు అగ్ని సామర్థ్యం వల్ల దుర్గంధ పూరితమైన వాయువును తొలగించి దాని స్థానంలో పవిత్రవాయువు వీచేలా చేస్తాయి. ఈ విధంగా వనౌషధులు వాయువు, జలం మొదలైన వాటిని శుద్ధి చేసి పుష్టికారకంగా చేస్తాయి.

శతపథ బ్రాహ్మణంలో యజ్ఞం ద్వారా రోగ నివారణ పద్ధతులను విస్తారంగా వివరించబడింది. దీనిలో అగ్నిహోత్రంలో ప్రయోగించబడిన వనౌషధుల వర్ణన లభిస్తుంది. అపామార్గహోమం ద్వారా దేవతలు రాక్షసులను తమ మార్గం నుండి తొలగించారు. మార్కండేయ పురాణంలో ఈ మొక్కను 'అఘాట్' అన పిలిచారు. ఏకలింగ విరచితమైన 'శతపథ బ్రాహ్మణం' 3వ భాగంలో సూర్యునికి హవిస్సుల రూపంలో అర్పణ జరుగుతుందని స్పష్టం చేయబడింది. సూర్యుడు 'అన్నం'గా పిలువబడ్డాడు. శతపథ బ్రాహ్మణంలో నవమ ఖండంలోని శతరుద్రీయంలో రుద్రునికి అర్పించబడిన 425 హవిస్సులలో అర్కపత్రం కూడా ఉన్నది. అధర్వణవేదం, తైత్తరీయ సంహితల ప్రకారం 'అవకా' యజ్ఞములలో ప్రయోగించబడేది. ఇదొక నీటి మొక్క. ఎర్రని రంగులో తీయని పండ్ల నిచ్చే వృక్షమొకటి ఉన్నది. దానిని యజ్ఞంలో వాడిన తర్వాత దాని భస్మం కూడ లభించదు. వైదిక బ్రాహ్మణములలో అశ్వద్ధ, అశ్వబాల్, ఉదుంబర్, కాపర్మయం ఛాథిర్, గవేధిక్, సోమ మొదలైన వనౌషధుల వర్ణన లభిస్తుంది. ఈ వనౌషధుల ప్రయోగం శరీరం, మనస్సులను రోగ రహితంగా శాంతంగా ఉంచేందుకు చేస్తారు.

మహర్షి దయానందులు దేవయజ్ఞంలో వాడే నాలుగు రకాల పదార్థాలను వర్ణించారు. 1. పౌష్టిక పదార్థాలు, నెయ్యి, పాలు, అన్నం (బియ్యం, గోధుమలు, యవలు, జొన్నలతో వండిన ఆహారం) మొదలైనవి 2. సుగంధ పదార్థాలు: కుంకుమ పువ్వు, కస్తూరి, చందనం, తెల్ల చందనం, జాజిఫలం, జాపత్రి, ఏలకులు మొదలైనవి. 3. రోగాలను నివారించే పదార్థాలు : తిప్పతీగ, సోమలత, గుగ్గిలం మొదలైనవి. 4. తీపిపదార్థాలు : పంచదార, బెల్లం, తేనె, ఖర్జూరం, ఎండిన విత్తుకల పెద్ద ద్రాక్ష వంటివి.

ఈ పదార్థాల రసాయనిక గుణాలు, వాటి భౌతికస్థితిపై ఆధారపడతాయి. ఘన పదార్థాల స్థితికంటె వాటి సూక్ష్మ స్థితిలోనే పదార్థాల అణువులు అత్యధిక సంఖ్యలో పరస్పరం కలుస్తాయి. అందువలన పదార్థాల వాయు స్థితిలో వీని సంబంధం పెరుగుతుంది. యజ్ఞ సామాగ్రి మండినపుడు అల్డీహైయిడ్, ఎమీన్సు, పిలోనిలిక్, సైక్లిక్ శ్రేణికి చెందిన పదార్థాలను కనుగొనడమైనది. యజ్ఞంలో నేయి కూడా ఎక్కువగా ఉపయోగించబడుతుంది. ఇది వాయు రూపంలోనికి మారి సామగ్రుల సూక్ష్మకణాలకు నలువైపుల నుండి కమ్ముకొని వాటిపై విద్యుచ్ఛక్తి యొక్క ఋణ ధృవప్రభావాన్ని కలుగచేస్తుంది. కుంకుమ పువ్వులోని రంగు పదార్థము, ఇగిరే తత్వంగల నూనె, సామాన్య నూనె, కోసిన్ అనబడే గ్లూకోసైడ్ మరియు పికోకోసీన్ అనబడే చేదుతత్వంగల చక్కెర ఉంటుంది. దీని భస్మంలో పొటాషియం, ఫాస్పరస్ ఉంటాయి. ఇది మెదడుకు శక్తినిస్తుంది. కుంకుమపువ్వు

ఈ రోజు చెయ్యాల్సిన పనిని రేపటికి వాయిదా వెయ్యకు.

వాతావరణాన్ని పరిష్కరిస్తుంది. గులాబిలో ట్రైనిక్ ఎసిడ్, గైలిక్ ఏసిడ్ ఉంటాయి. చందనంతో యజ్ఞం చేస్తే వాయుమండలం శుద్ధి అవ్వడమే కాకుండా సుగంధ భరితమౌతుంది. ఇది దుర్గంధాన్ని హరించి, దాహాన్ని శమింపచేసి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. మానసిక వ్యాకులత, దుర్బలతలను దూరం చేయడానికి యజ్ఞంలో వీటిని ప్రయోగిస్తారు.

వనౌషధులలో బ్రాహ్మీ మేధస్సు వృద్ధి చేయడమే కాక మానసిక వికారం, రక్త, శ్వాస, చర్మసంబంధ రోగాలను నిరోధించేదిగా భావించబడుతుంది. దీనిలో హైడ్రోకోటిలీన్, ఏసియాటికోసాయిడ్ మరియు మేధస్సుకు సంబంధించిన రచనల కోసం ఉపయోగపడే అయిజోబ్రాలిక్ యాసిడ్ ఉంటుంది. వాయుమండల శుద్ధికి జాజిఫలం, జాపత్రిలతో యజ్ఞం చేయబడుతుంది. వీటి సూక్ష్మకణాలలో వక్రత తగ్గి వీని రసాయనిక ప్రభావం పెరుగుతుంది. సతావరీహవనం వాత పిత్త వికారాలను దూరం చేయడానికి చేస్తారు. ఇది నాడిని బలపరుస్తుందికూడ. అశ్వగంధలో గ్లాయికోసైడ్, వితానిఆల్ ఆమ్లం, పిండి పదార్థం, చక్కెర మరియు ఎమినోఏసిడ్ పొందవచ్చును. ఇది బలవర్థక, పుష్టి దాయకమౌతుంది. రక్త వికారాల నుండి విముక్తి పొందడానికి వటవృక్ష సమిధలను ప్రయోగిస్తారు. పడిశాన్ని (రొంపని) పోగొట్టే గుణం కర్పూర రూపంలో ఉంటుంది. కలకండ హవనం కలరా, క్షయ, మశూచి మొదలైన రోగాలను నివారిస్తుంది.

తిప్పతీగ, నేలవేము, తేనె మొదలైనవి రక్తశుద్ధి చేసే ఔషధులు. కర్పూరం, గుగ్గిలం క్రిమినాశకాలు. గుగ్గిలంవంటి క్రిమి నాశక హవనం వలన వీటి సూక్ష్మకణాలు ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా శరీరంలోపలకు ప్రవేశించి క్రిములను నాశనం చేస్తాయి. దీనిలో పంచదార కలుపుతారు కూడ. ఈ తీపి మాధ్యమం ద్వారా క్రిములన్నీ ఒకే చోట చేరడంతో తేలికగా నశింపచేయవచ్చు.

వేద విజ్ఞానాన్ని అధ్యయనం చేసే సంస్థ ఒకదాని ప్రకారం విశిష్ట వనోషధులు అగ్ని హోత్రంలో హవనం చేయడం వలన శరీరక మానసిక రోగాల నుండి విముక్తిపొందడమే కాక వాతావరణ శుద్ధి, కాలుష్య నివారణ కూడా చేయవచ్చును. ఈ సంస్థ డెంగ్యూ వంటి ప్రమాదకర రోగ నివారణకు కూడా ఈ హవనం మహత్తరమైనదని గుర్తింపజేసారు. మహారాష్ట్రకు చెందిన శివపురి వేద విజ్ఞాన అధ్యయన సంస్థ ప్రవక్త రవిరాజు ప్రకారం ఢిల్లీలో వ్యాపించే డెంగ్యూ వ్యాధికి హవనమే ఏకైక చికిత్సా విధానం. శ్రీరాజుగారి అంచనా ప్రకారం, ప్రపంచంలో సుమారు ఐదు లక్షలమంది ప్రజలు నియమిత పద్ధతిలో యజ్ఞం చేస్తున్నారు. వీరు యజ్ఞానికి సంబంధించిన వనౌషధ విజ్ఞానం చాలా లాభదాయకం మరియు అద్భుత పరిణామాలను కలిగిస్తుందని స్పష్టం చేసారు. దీని వలన వాయు మండలం కాలుష్యం నుండి విముక్తి పొందుతుంది. యజ్ఞం చివరలో లభ్యమైన వనౌధుల భస్మాలు రోగులకు ఉపచర్యలు చేసేందుకు పనికి వస్తున్నాయి. డాక్టర్ ఎల్.బి.కోటరీకర్ ఈ భస్మాలతో అనేకరోగాలకు సఫలమైన ఉపచర్యలను వృద్ధి చేసారు. ఢిల్లీకి చెందిన డాక్టరు సెల్వమూర్తి అనే వైజ్ఞానికుడు ఆ వనౌషధుల మహత్తును గుర్తించారు. యజ్ఞం వలన ఒత్తిడి తగ్గి మానసిక శాంతి పెంపొందుతుందని వారి అభిప్రాయం. దీనివలన మెదడుకు సంబంధించిన అల్ఫా తరంగాలు 20 శాతం వృద్ధిని కనపరచాయి.

రోగుల ప్రకృతి, రోగాల ఆధారంపైనే వేర్వేరు వనౌషధులను ప్రయోగించే విధానం ఏర్పడింది. వేర్వేరు రోగాలకు దీని నిష్పత్తి మారుతూ ఉంటుంది.

**చలిజ్వరానికి :–** పటోల్ పత్రం, తుంగ, చిన్నతునియ, వేపబెరడు మరియు పువ్వులు, తిప్పతీగ, కరంచా మొదలైన వాటితో తయారైన సామాగ్రిని హవనానికి ఉపయోగిస్తారు.

**దగ్గునివారణకు :–** తమలపాకులు, పసుపు, దానిమ్మ, అత్తిబెరడు లవంగాలు మొదలైన వాటితో నిష్పత్తి ప్రకారం యజ్ఞం చేస్తారు.

**రొంప నివృత్తికోసం :–** గరికదుబ్బు, సోపుగింజలు, నల్లమందు చెట్టు బెరడు, రెల్లు, అత్తి, ధనియాలు, నల్లమిరప మొదలైన వాటిని యజ్ఞంలో వాడతారు.

**మందబుద్ధి నివారణ కోసం :–** సతావరీ, బ్రహ్మీ, బ్రహ్మదండి, గోరఖ్‌ముఖీ, శంఖ పుష్పీ, మండూక పర్ణీ, మాలకొంగనీ మొదలైన వాటిని యజ్ఞ సామగ్రిగా చేస్తారు.

**మెదడు రోగానికి:–** రేగుపండు గింజ గుజ్జు, రావి చిగుళ్ళు, చింతగింజల గుజ్జు, కాఖ్‌జంఘా, మర్రిపూలు, సిరేటీ, తిప్పతీగను ప్రయోగిస్తారు.

**సజ్జనులు ఐశ్వర్యవంతులైనప్పటికి వినమ్రత కలిగివుంటారు.**

**చర్మరోగాన్ని దూరం చేయడానికి :–** శీతల్ చానీ, చోప్‌చానీ, వేపపూలు, మల్లెఆకులు, పసుపు కొమ్ములు, కర్పూరం, మెంతి కూర కలుపుతారు.

**రక్తవికార విముక్తికి :–** దూమాసా, శాఖా, అడూసా, సర్ సౌంఖా, మంజిష్ట తీగ, కుల్కీ, రాసనాలతో హవన సామాగ్రి తయారు చేస్తారు.

ఋతువులననుసరించి ఔషధుల ప్రయోగం చేస్తారు. ఎందుకంటే వేర్వేరు ఋతువులలో ఓషధుల ప్రభావం వేర్వేరుగా ఉంటుంది.

**వసంత ఋతువులో :–** గుగ్గిలం ధూపం, దేవదారు, తిప్పతీగ, ఎండిన విత్తులుండే పెద్ద ద్రాక్ష, మేడిపండు పై భాగం, సుగంధ కోకిల, ఒక రకమైన రేగు, నేలవేము, తెల్లచందనం, ఎర్రచందనం తామర బీజం, కర్పూరకచరీ, ఇంద్రయన ధాన్యం, శీతల్ చానీ, దాల్చీసుపత్రం, అగరుతగరు, మంజిష్టతీగ, జాపత్రి, కుంకుమ పువ్వులను నిర్దిష్ట నిష్పతిలో కలుపుతారు.

**గ్రీష్మ ఋతువులో :–** గుగ్గిలం, దేశవాళీ పంచదార, గులాబి, చిరౌంజీ, శతావరు, వట్టివేరు, తిప్పతీగ, పోకచెక్కలు, ఉసిరిక, జటామోసీ, తుంగ, వాయ్‌బిడంగ్, ఛరీలా, దాల్చిన చెక్క, లవంగాలు, ఎర్ర చందనం, తగరు, మంజిష్ట తీగ, పెద్ద ఏలకులు, ఎండిన రంపంపొట్టు, తాలీసాకు, ఉన్నావ్, పద్మాఖ్ మరియు కుంకుమ పువ్వు ఉపయోగిస్తారు.

**వర్ష ఋతువులో :–** గుగ్గిలం, దేశవాళీచక్కర, దేవదారు, రాల్, మారేడు బుర్ర, జాజికాయ, జటామాసీ, బచ్, తెల్లచందనం, ఛువారా, ఎండిన వేపాకులు, మకోయకొమ్ములు, సుగంధ కోకిల, నల్ల అగరు, ఇంద్రయవధాన్యం, ధూపం, తగరు, కరివేపాకు, మారేడు గుజ్జు, తిప్పతిగ, తులసి, వాయ్‌బిడంగ్, నాగకేసరాలు, నేలవేము, చిన్నయాలకులు మరియు కుంకుమ పువ్వును ప్రయోగిస్తారు. శరదృతువులో గుగ్గిలం, తెల్ల చందనం, చిరౌంజీ పప్పు, అత్తి బెరడు, పసుపు పచ్చన ఆవాలు, కర్పూర కచరీ, జాజికాయ, నేలవేము, జటామాసీ, సహదేవీ, ఎరుపు మరియు పసుపు చందనం, నాగకేసరాలు, తిప్పతీగ, దాల్‌చానీ, పిత్తపాపడ్, మోచరస్, అగరు, ఇంద్రయవధాన్యం, అసగంధ్, శీతల్‌చానీ, పత్రజ, తౌలమ్ ఖానా, ధాన్యము పొట్టు, ఎండిన విత్తుగల పెద్ద ద్రాక్ష, దేశవాళీ చక్కెర, కుంకుమ పువ్వులతో తయారైన యజ్ఞ సామాగ్రి ఉపయోగించబడుతుంది.

**శశిర ఋతువులో :–** హవన సామగ్రులలో గుగ్గిలం, దేశవాళీ చక్కెర, అక్రోటు పండుగుజ్జు, ఎండిన విత్తుగల పెద్ద ద్రాక్షా, నల్ల నువ్వులు, ఎర్ర చందనం, నేలవేము, ఛువారా, జటా మాసీ, తుంబరు, ధూపం, కర్పూర వామ బిడంగ, పెద్ద యాలకులు, మూలహటీ, మోబాసు, తిప్పతీగ, తులసి, చిరౌంజీపప్పు, కాకడా సింగీ, శతావరు, పసుపుకొమ్ములు, పద్మాఖ్, ప్రసుపీర్, రేణుకా, శంఖపుష్పీ, చిక్కుడు చెట్టు వంటి కాయల బీజములు, భోజపత్రాలు కలుపుతారు.

హేమంత ఋతువులో గుగ్గిలం, దేశవాళీ చక్కెర, కపూర కచరీ, ఎండిన విత్తుగల పెద్ద ద్రాక్ష, అక్రోటు పండు గుజ్జు, నల్ల నువ్వులు, మారేడు బుర్ర, సుగంధ కోకిల, ఒకరకమైన రేగు, నల్లని ముసలీ, పిత్తపాపడ్, దంచిన తిప్పతీగ, దాల్‌చానీ, జాపత్రి, కస్తూరి, తాలీసాకులు, కరివేపాకు, తెల్లచందనం, రాసనామరి కుంకుమపువ్వులతో తయారయ్యే హవన సామాగ్రిని ఉపయోగంలోకి తెస్తారు. ఈ వనౌషధుల యజ్ఞవిధానప్రక్రియ సమస్త మానవాళి ఆరోగ్యానికి ఆయుష్షుకు, స్వస్థతకు వరప్రదాయని అని చెప్పక తప్పదు.

*– అఖండ జ్యోతి జూన్ 1998*

*అనువాదం : బాసంగి శ్రీరాములు*

## దప్పిక తీరేది అక్కడే

*గురు గోవింద సింహుడు పదహారేండ్ల పెద్ద కుమారుని పిలిచి, ఖడ్గం చేతికిచ్చి యుద్ధం చేయుమని ఆజ్ఞాపించాడు. తండ్రిమాట ప్రకారం అజిత్ సింహుడు యుద్ధానికి వెళ్లాడు. అక్కడే వీరగతిని పొందాడు. తరువాత రెండవ కుమారుడు జోరూర్ సింహుని పిలిచి యుద్ధానికి వెళ్లుమని ఆజ్ఞాపించాడు. "నాన్నగారూ! దప్పిగా ఉంది. నీరు త్రాగి వెళ్లుతాను" అన్నాడు. "నీ అన్న పడిపోయిన చోట రక్తపు నది ప్రవహిస్తోంది. అక్కడకే వెళ్ళి నీ దప్పి తీర్చుకో" అన్నాడు తండ్రి. జోఝూర్‌సింహ్ వెంటనే యుద్ధరంగానికి వెళ్లాడు. శత్రువులను చీల్చిచెండాడుతూ తన ప్రియసోదరుని దగ్గరకు చేరుకున్నాడు.*

**సజ్జనులు లేమిలో కూడా ఉదారత కలిగి ఉంటారు.**



### ధారావాహిక: హనుమత్ కథామృతం-26

# భక్తులను బాధించే వారికి క్షమాపణ దొరకదు

వశిష్ఠ మహర్షి బ్రహ్మదేవుని దగ్గరకు పోదాం అనగానే ఇంద్రుడు గట్టిగా ఊపిరిపీల్చుకున్నాడు. "తాను వజ్రాయుధం ప్రయోగించింది శ్రీరామభక్తుని మీద. తనను సృష్టికర్తఅయిన బ్రహ్మదేవుడు తప్పక క్షమించి తీరుతాడు. శ్రీరాముడు క్షమిస్తాడో లేదో ఆ పరమాత్మకే తెలియాలి అనుకుంటూ ఇంద్రుడు పలువిధాలుగా భయపడుతున్నాడు. పవనదేవుడు తన ప్రాణప్రవాహాన్ని నిలిపివేసిన కారణంగా సృష్టియావత్తూ చైతన్యాన్ని కోల్పోయి మృతప్రాయం అయిపోయింది. ఒకవైపు సూర్య దేవుడు తేజోవిహీనుడయ్యాడు. అందు వల్ల లోకాలన్నీ అంధకార బంధురం అయ్యాయి. దీని పరిష్కారం సృష్టికర్త చేతిలోనే ఉంది. ఆ ఆలోచనతోనే ఇంద్రుడు ఋషి గణాలను వెంటపెట్టుకుని బ్రహ్మలోకానికి బయలుదేరాడు. బ్రహ్మర్షి వసిష్ఠుడు వెంట ఉండడం కొండంత అండగా భావిస్తున్నాడు.

లోకాల సరి హద్దులను దాటుకుంటూ దేవేంద్రుడు ఋషిగణాలతో బ్రహ్మలోకం చేరుకున్నాడు. బ్రహ్మదేవుడు కమలాసనం మీద కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తూ ఉన్నాడు. వీరి రాకపై దృష్టి పెట్టలేదు. కానీ సరస్వతీ మాత యొక్క మాతృహృదయం వారిని, వారి దీనత్వాన్ని చూడగానే దయతో స్పందించింది. చిరునవ్వుతో వశిష్ఠుని వైపు చూచింది. "కుమారా! అయోధ్యలో అందరు కుశలమే కదా" అని ప్రశ్నించింది. మరలా "నారాయణుడే అయోధ్యలో అవతరించి ఉండగా కుశలానికి ఏం తక్కువ?" అంటూ తన ప్రశ్నకు తానే జవాబు చెప్పుకుంది. "అవునమ్మా! రామభద్రుని నీడలో అంతా కుశలమే" అని సమాధానం ఇచ్చాడు వశిష్ఠుడు.

"అమ్మా! ఇప్పుడు మేము దేవేంద్రుని కోరికమీద తండ్రి గారిని కలవాలని వచ్చాము." దేవేంద్రుని పేరు వినగానే సరస్వతీమాత ఒక్కసారి ఇంద్రునివైపు చూచి దీర్ఘంగా నిట్టూర్చింది. ఆమెనిట్టూర్పుతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పువచ్చింది. బ్రహ్మదేవుని కన్నులు విచ్చుకున్నాయి. కన్నులు తెరచి ఎదురుగా ఉన్నవారందరిపైనా దృష్టిసారించాడు. వశిష్ఠుని వైపు చూస్తూ చిరునవ్వు నవ్వాడు. "కుమారా! మహాదేవుని లీలలు మనకు అర్థం కావు. అయినా ఇంద్రుడు హనుమాన్‌ను గాయపరచి పార్వతీ దేవి ఆగ్రహానికి గురి అయ్యాడు. దయాళుడైన శంకరుడు ఇప్పటివరకు పార్వతీదేవికి అనేక విధాలుగా సర్ది చెప్పాడు. మరి దేవరాజు పరిస్థితి ఏమి కానున్నదో చూడాలి." అన్నాడు.

"పరమపితా! క్షమించండి అన్నాడు భయంభయంగా. అతని మనస్సుబ్రహ్మ దేవుని నుండి ఓదార్పును కోరుకుంటున్నది. బ్రహ్మదేవుని మనస్సులో అతనిపై రాగమూలేదు. ద్వేషమూ లేదు. ఇంద్రుని గురించి ఒక్కమాట కూడా కఠినంగా మాట్లాడలేదు. "దేవేంద్రా! నీవు హనుమాన్‌పై వజ్రాయుధాన్ని ప్రయోగించి ఎవరెవరి కోపానికి గురి అయ్యావో తెలుసా? వారు తలచుకుంటే నిన్ను కాదు, స్వర్గలోకాన్ని కూడా ధ్వంసం చెయ్యగలరు. కానీ సృష్టిని దృష్టిలో పెట్టుకుని అందరు మౌనం వహించారు. వారిలో జగజ్జనని అయిన పార్వతీ దేవికి హనుమాన్ అత్యంత ప్రేమాస్పదుడు. అందువల్ల ఆమె తనను తాను నిగ్రహించు కోలేకపోతూ ఉంది. అవతారపురుషుడైన శ్రీరామచంద్రునికి హనుమాన్ భక్త శ్రేష్ఠుడు. శ్రీరాముని సంగతి నీకూ తెలుసు. ఆయన ఎలాంటి వారికైనా క్షమించివేస్తాడు. కానీ భక్తులను బాధించేవారిని మాత్రం క్షమించలేడు. తన ప్రియతమ భక్తునికి కష్టం కలిగించినప్పుడు లోకంలో దేనినీ లెక్కచేయడు. ఆయన చేతివ్రేలినుండి సుదర్శన చక్రం కదలిరాకమునుపే, రామాబాణం అంబుల పొదినుండి తీయబడకముందే నీవు హనుమంతుని శరణవేడుకో. అతను క్షమిస్తే కానీ జగన్మాత, శ్రీరామచంద్రులు క్షమించరు. క్షమించలేరు.

ఇప్పుడు ఇంద్రునికి మార్గం అయితే దొరికింది. కాని భయం పెరిగింది. సరస్వతి మాతవైపు దీనంగా చూశాడు.

**శీలవంతుడైన లోకసేవకుడే దేశాన్ని పురోగమింప చేయగలడు.**

ఆమె కళ్ళల్లో ఈనాడు మమతానురాగాలు కనిపించడంలేదు. పైగా తీవ్రస్వరంతో "స్వర్గాధిపతి ఈ విషయాన్ని ఎన్నటికీ మరచిపోరాదు. నేను ఆదిశక్తిలో ఒక అంశాన్ని ఆమె ఆజ్ఞను అనుసరించే బ్రహ్మదేవునికి సృష్టికార్యంలో సహకరిస్తూ ఉన్నాను. హనుమంతుడు నాకుకూడా పుత్రసమానుడే. ఆదిశక్తికి ఆగ్రహం తెప్పించిన వ్యక్తి నాకు ఆత్మీయుడు కాలేదు. కాబట్టి నా నుండి ఎలాంటి ఆశలు పెంచుకోవద్దు" అంది. దేవేంద్రుడు బ్రహ్మదేవుని వైపు, వశిష్ఠుని వైపూ నిస్సహాయంగా చూశాడు.

ఆ సమయంలో వశిష్ఠుడు సదాశివుని లీలను అంతః ప్రజ్ఞతో ప్రత్యక్షం చేసుకుంటున్నాడు. ఇక్కడకు వచ్చిన తర్వాత సృష్టి పట్ల జరిగిన ఈ ఘటనకు వెనుక ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఉన్న శ్రీరాముని లీలను కూడా దర్శించగలగాడు. అయినా బయటకు ప్రకటించలేదు. గంభీరస్వరంతో "దేవేంద్రా! మనకు పితామహుని ఆదేశం శిరోధార్యం. మన వెంటనే బయలుదేరి హనుమాన్ దగ్గరకు వెళ్లాలి. అక్కడే పవన దేవుడు కూడా ఉన్నాడు. పరమపిత బ్రహ్మదేవునికూడా మనతో కలిసిరమ్మని ప్రార్థిద్దాం. సరస్వతీ మాతను కూడా వెంట తీసుకుని వెళ్లుదాం." అని కర్తవ్యాన్ని సూచించాడు. దేవేంద్రుని అభ్యర్థన మేరకు క్షణం కూడా ఆలస్యం చేయకుండా వారిరువురు కూడా బయలుదేరారు.

గతంలో తనను బ్రహ్మదేవుడు రక్షించిన ఘట్టాలను నెమరువేసుకుంటూ దేవేంద్రుడు ధైర్యాన్ని కూడగట్టుకుంటూ ఉన్నాడు. దేవేంద్రుని మానసిక స్థితిని బ్రహ్మదులు సులభంగా చదువుకోగలిగారు. వారు లోలోపలే నవ్వుకుంటూ సదాశివుని లీలను గుర్తుచేసుకుంటున్నారు. భావపూర్వకంగా పరమశివునికి నమస్కారం చేసుకున్నారు. వీరు వెళ్లి చూచే సరికి పవనదేవుడు హనుమాన్‌ను ఒడిలో పరుండబెట్టుకుని మహామృత్యుంజయ మంత్రాన్ని పఠిస్తూ ఉన్నాడు. ఆపద తొలగిపోయి, ఆనందఘడియలు చేరువ అవుతున్నాయని వాయుదేవునికి తెలియడం లేదు.

చూస్తూ ఉండగానే దేవముని గణాలు హిమాలయంలోని ఆ గుహపరిసరాలను పావనం చేశాయి. పరమపిత పత్నీ సహితంగా విరాజిల్లుతూ ఉన్నాడు. వశిష్ఠుడు మొదలైన మహర్షులు చిరునవ్వు ముఖాలతో పవన హనుమాన్‌లను పరికిస్తూ ఉన్నారు. బాలహనుమాన్‌కు నలుదిక్కులా దైవత్వం ఆవరించి ఉంది.

*– అఖండ జ్యోతి సెప్టెంబరు 2009*

## కదిలించే కళ్లు

25.సీ॥ చిక్కుముడులు విప్ప చిత్తంబు నిలుపుచు<br>
ఆవునేతి జ్యోతి నాశ్రయింప<br>
జ్యోతి కిరణకాంతి జోరుగా ప్రసరించి<br>
ముడులవిప్పుకొనుచు ముదము గూర్చ<br>
మాతకెదురుగాను మాలను ద్రిప్పుచు<br>
ఉదయించు సూర్యుని మదిని నిలిపి<br>
అరువది ఆరుకున్ సద్దంకి రానీక<br>
దినమంత జపియించి తనియుచుండ

తే॥ అమ్మకన్నులు వర్షించు హర్షజలము<br>
జాలువారిన వితమంత పొల్లుపోక<br>
మానవాళికి తెలుపుట మరువకనుచు<br>
కవిని కదిలించె గురుదేవు కంటి చూపు

26.సీ॥ తాంత్రిక సాధనల్ దరికైన రానీక<br>
శాస్త్రోక్త పూజలు జరుపుచుండి<br>
అరువదేండ్లకు పైన యలుపన్నదెరుగక<br>
స్వాధ్యాయరంగాన సాగుచుండి<br>
సందర్భమున్ పట్టి సరసమౌ వ్యాసాలు<br>
పత్రికా ముఖమున వ్రాయుచుండి<br>
డిగ్రీలు లేకనే డిగ్రీల వారికి<br>
పాఠాలు చెప్పుచు పరవశించి

తే॥ వంశమందున వెలుగొందు వాణిదలచి<br>
సంస్కృతంబును నేర్చిన సరణినంత<br>
మానవాళికి దెలుపుట మరువకనుచు<br>
కవిని కదిలించె గురుదేవు కంటి చూపు

రచన–మధుర కవయిత్రి<br>
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**భగవంతుని ప్రేమ కర్తవ్య పరాయణుడికే లభిస్తుంది.**

కుటుంబ నిర్మాణం

# దివ్య భావనల అభ్యాస వ్యాయామశాల-గృహస్థ ధర్మం

సృష్టి ప్రారంభంలో బ్రహ్మ ఒక్కడే ఉన్నాడు. "ఏ కోహం బహుశ్యామ్" అనే సూత్రం ప్రకారం ఒకటి నుండి అనేకం కావాలని కోరుకున్నాడు. బ్రహ్మ ఎంత ప్రయత్నించినా ఆ విధంగా చేయలేకపోయాడు. ఆ దిగులుతో ఆయన శరీరం రెండు భాగాలుగా విడిపోయింది. సగం శరీరం పురుష రూపం గాను, సగభాగం స్త్రీ రూపంగాను మారింది. ఈ విధంగా మానవ జాతికి మొదటి జన్మస్థానాన్ని ప్రపంచంలోని మొదటి గృహస్తును, సృష్టి పరిణామక్రమాన్ని వర్ణిస్తూ మైత్రేయుడు విదురునితో ఇలా అన్నాడు. వారిలో పురుషరూపం సార్వభౌమ సామ్రాట్ స్వాయంభువ మనువు. స్త్రీ రూపం అతని భార్య శతరూప.

ఒకే బ్రహ్మ రెండు రూపాలతో వ్యక్తం అయ్యాడు. ఈ రెండు రూపాలు వాటికి అవి పరిపూర్ణమైనవే. అయినప్పటికీ వాటికి వాటి విశేషతలు కూడా ఉన్నాయి. అందువల్లనే స్నేహంతో కలిసి ఉండాలని నిశ్చయించుకుని ఒకరి కొకరు సహాయపడుతూ బ్రహ్మ కోరికలను పూర్తి చేశారు. ఈ విధంగా గృహస్థాశ్రమానికి ఆధారమేర్పడింది. కేవలం పురుషుడి వలన లేక ఒంటరి స్త్రీ వలన గృహస్థులు ఏర్పడరు. గృహనిర్మాణంలో స్త్రీ పురుషులిద్దరూ సమాన బాధ్యత వహిస్తారు. భవిష్యపురాణంలో నాలుగు ఆశ్రమాలను గురించి శ్రీకృష్ణుడు ధర్మరాజుతో చెప్తూ అన్ని ధర్మాలలోనూ గృహస్థ ధర్మం శ్రేష్ఠమైనదని చెప్పాడు. గృహస్థధర్మానికి మూలాధారం శ్రేష్ఠమైన గృహం. గృహం కంటే కూడా శ్రేష్ఠమైనది గృహిణి.

గృహ నిర్మాణంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానులైనప్పటికీ, ఇద్దరిలోనూ ఒకరికి గొప్పదనం ఆపాదించాలంటే అది స్త్రీలకే చెందుతుంది. అందువల్లనే 'గృహిణీ గృహముచ్చతే' నిజానికి గృహిణి యే గృహం అంటారు. కుటుంబ నిర్మాణంలో స్త్రీ ముఖ్య భూమిక వహిస్తుంది. పురుషుని పాత్ర తక్కువగానే ఉంటుంది. అందువలన స్త్రీ గృహస్థ జీవితానికి వెన్నుముక అనటంలో అతిశయోక్తి లేదు. స్త్రీ పురుషులెవరైనా స్త్రీ శరీరం, మనస్సు, ఆలోచనల నుండి ఉద్భవించినవారే. మన లోపల, భయట ఉన్నవి అన్నీ కూడా స్త్రీ వలన పొందినవే. ఇందువలనే స్త్రీ జాతికి ప్రాముఖ్యతను ప్రతిపాదిస్తూ శ్రీకృష్ణుడు ధర్మరాజుతో స్త్రీలు అమృత భాండాలనీ, సుఖాల రాశి అని చెప్పాడు. బ్రహ్మ వీరిని సంపూర్ణ ఆనంద నిధుల రూపంలో సృష్టించాడు.

ఈ ప్రపంచంలో మనకు కనబడే ఆనందం, సుఖం అంతా స్త్రీ ప్రసాదించినవే. కానీ మన ప్రాచీన శాస్త్రీయతలను పరిశీలించి ప్రస్తుత పరిస్థితులను చూసినట్లయితే బాధకలుగుతుంది. సుఖ సంతోషాలు ఇప్పుడెక్కడున్నాయి? ఇప్పుడు నాలుగు దిక్కులా బాధలు, పతనం, కలహాలు, వ్యాపించి ఉన్నాయి. మన సౌభాగ్యాన్ని ఎవరు లాక్కెళ్ళారు? స్వర్గంతో సమానంగా భావించిన గృహస్థాశ్రమం నేడు నరకం కంటే అధిక దఃఖకారణమౌతుంది. పూలమడిలోనే విషపు మొక్కలు తయారవుతుంటే తోటలో చందన వృక్షాలు ఎక్కడినుండి వస్తాయి? ప్రస్తుత కాలంలో అన్ని చోట్లా విషమే వ్యాపించినట్లుగా అనిపిస్తోంది.

ఈ పరిస్థితులను మార్చాలని కోరుకుంటున్నారా? మార్చాలని కోరుకుంటున్నట్లయితే ఎందుకు జరిగిందని ఆలోచించాలి. అమృత భాండం అని భావించిన స్త్రీని మనం విషపుగుండంగా మార్చాం. ఆమెను నిందించాం. ఆమెకు గల మానవ అధికారాలన్నింటినీ తీసుకుని ఎన్నో ప్రతిబంధకాలను ఆమెపై రుద్దాం. ఆమెను అవిద్య, అంధవిశ్వాసాలు, చెడురీతులలో నెట్టివేశాం. ఇప్పుడు స్త్రీలు వంట చేసేవారిగానూ, చౌకీదారులు గానూ వంశవృద్ధి సాధనంగా మాత్రమే నిల్చిపోయారు. స్త్రీలు ఇందుకు మాత్రమే సృష్టించబడ్డారా? యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు ఈ విధంగా అన్నాడు. ధర్మపత్నితో కలిసి జీవించటం విషయభోగాలకే కాక ధార్మిక పరంపరను రక్షించే నిమిత్తం, సంతానోత్పత్తి కోసం అని చెప్పాడు. వివాహం

మస్తిష్కాన్ని శాంతంతో నింపుకోవాలి.

యొక్క ఉద్దేశ్యం ఉన్నతమైనది. ఏ విధంగా ఐతే ఇద్దరు స్నేహితులు పరస్పరం సహాయం చేసుకుంటూ దూర ప్రయాణం చేస్తారో అదే విధంగా స్త్రీ పురుషులిద్దరూ కలిసి గృహస్థాశ్రమం ద్వారా ఆత్మ వికాసాన్ని పొందుతూ చివరి మజిలీని చేరతారు.

ఎంత ఉదాత్తమైన ఆశ్రమం! బ్రహ్మచర్యానికి అర్థం ఇంద్రియాలను నిగ్రహించి సంయమంతో గొప్ప ఆదర్శాలకై జీవితాన్ని సమర్పించటం. మన జీవిత ఉద్దేశ్యం క్షుద్రమైనది కాక గొప్పదికావాలి. ఈ ఉద్దేశ్యపూర్తికై భగవంతుని పంచమహాయజ్ఞాల అనుష్ఠానం దారిచూపిస్తోంది. యజ్ఞం అంటే కేవలం హవనం మాత్రమే కాదు. యజ్ఞానికి వాస్తవ అర్థం – దానం, స్నేహం, పరోపకారం. మన దేవఋణం, పితృఋణంతో ఋణపడి ఉంటాం. యజ్ఞాల ద్వారా మన ఈ ఋణాలనుండి విముక్తి పొందుతాం. అందువలన మనం మన అవకాశాలను విస్తరింపచేసుకోవాలి. సమాజపతనాన్ని పీడలను నివారించడం ద్వారా మనం ఋణ భారాన్నుండి ముక్తి పొందవచ్చు. దానం ద్వారా పీడలను, జ్ఞానదానం ద్వారా పతనాన్ని నివారించవచ్చు. ఇది దేవకార్యం. ఋషి కార్యం. గృహస్థాశ్రమం హద్దులతో కూడిన మంచి గుణాలను పెంపొందించుకోవటం ద్వారా వారి సేవాభావనను పరిపుష్టం చేసుకునే ఆశ్రమం. మనం మన కర్తవ్యాలను నిర్వహించినట్లయితే మనం ఏ తీర్థాలకు వెళ్ళవలసిన అవసరం లేదు. మన ఇల్లే తీర్థమౌతుంది. తల్లి దండ్రుల సేవచేయటం, ధర్మపత్నిని సంతోష పరచటం, గృహస్థాశ్రమాన్ని పాలించటం తీర్థాలంటారని శ్రీ కృష్ణుడు ధర్మరాజుకు వివరించాడు.

గృహస్థాశ్రమంలొ కేవలం భార్యేకాక తల్లి తండ్రి, సోదరులు, సోదరీ మణులు కూడా ఉంటారు. తల్లి తండ్రి, సోదరులు, అక్కాచెల్లెలు మొదలైన వారి సేవ వలన మనం పితృఋణం నుండి విముక్తులవుతాము. తల్లి దండ్రుల వలనే మనకు జన్మ కల్గుతుంది. సేవ, సహకారాల అందించటం సహాయం కాక, మన కర్తవ్యాన్ని పాటిస్తున్నామని అనుకోవాలి. చిన్నవారైన తమ్ముళ్ళ, చెల్లెళ్ళ బాధ్యతను స్వీకరించి, మనం తల్లి దండ్రుల దిగులును దూరం చేసి వారిని సమాజ సేవకై వానప్రస్థ జీవనానికి ప్రేరణ కల్గించి మార్గాన్ని సుగమం చేయాలి. భగవంతుడు భార్యను కూడా సంతోషంతో ఉంచేందుకు ప్రేరణను కల్గిస్తాడు. భార్యకు సమాన హక్కులనిచ్చి చదువు సంధ్యలకై వ్యవస్థనేర్పరచి, వారిని అనవసరపు ప్రతిబంధకాలనుండి ముక్తులను గావించి పరస్పర సహకారం ద్వారా మన ఇంట్లో స్వర్గవాతావరణాన్ని నిర్మించుకోవచ్చు. మనం సుఖ శాంతుల కోసం తీర్థాలకు వెళ్ళవలసిన అవసరం ఉండదు. మన ఇల్లే స్వర్గతీర్థాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉంటుంది. మనం ఆరాధించాలనుకునే దేవతే మన ఇల్లు. విశ్వరూపం నుండి తమ ధర్మ కృత్యాలను స్వీకరించుమని కోరుతూ దేవతలు ఇలా అన్నారు. "ఆచార్యులు వేదానికి, తండ్రి బ్రహ్మకు, సోదరులు ఇంద్రునికి, తల్లి సాక్షాత్తు భూమికి ప్రతిరూపాలు.

ఈ ఆదర్శాన్ని అనుసరించి కుటుంబం అంతా సంయమనంతో నడవాలి. వీరందరిలోనూ తల్లి స్థానం సర్వోన్నతమైనది. తల్లిని భూమాతతో పోలుస్తారు. సమగ్రజీవనంలో భూమికి ఏ స్థానం ఉందో అదే స్థానం మానవ జీవితంలో తల్లికి లేక స్త్రీకి ఉంటుంది. తల్లి రూపంలో తన శరీరం, మనస్సు, భావనల రూపంలో మనకు జన్మనిస్తుంది. సోదరీ రూపంలో నిర్మల ప్రేమను, ధర్మపత్ని రూపంలో సహకారాన్ని, కూతురు రూపంలో వాత్సల్యాన్ని అందిస్తారు. తల్లి ఈ రూపాలన్నింటికీ ప్రతిరూపం. తల్లికి సేవచేయటం అంటే సమస్త స్త్రీలోకాన్ని సేవించటమే. మనం స్త్రీ జాతిని నిరాదరించి ఆలోచించకుండా పీడించాం. ఇందువలనే ఈ ఆనందమనే సెలయేరు ఎండిపోయింది. ఫలితంగా మన సమస్త మానవ జీవితం శుష్కించి నీరసపడింది. తప్పుకు ప్రాయశ్చిత్తం జరగాలి. స్త్రీ జాతిని మళ్ళీ గౌరవప్రదమైన పదవిపై ప్రతిష్ఠించి మనం ఆనందం పొందగలం. బ్రహ్మవైవర్త పురాణంలో తల్లి దేవకిని క్షమించమని అడుగుతూ కంసవధ తర్వాత శ్రీ కృష్ణుడు ఇలా అన్నాడు. తల్లి గర్భంలో భరించి పోషిస్తుంది. ఇందువలన తండ్రి కంటే వంద రెట్లు శ్రేష్ఠం. తల్లి భూమిలాగా అందరి

**రక్తాన్ని ఉత్సాహంతో ఉరకలు వేయించాలి.**

హితాన్ని కోరుతుంది. అందువలన భూలోకంలో తల్లిని మించిన బంధువు ఇంకొకరు ఉండరు. విద్యను ప్రసాదించే తల్లి నిజానికి పరమగురువు.

ఇది తల్లి యొక్క భవ్యస్వరూపం. కానీ ఈనాటి పరిస్థితులను చూస్తే మన కళ్ళముందు చీకటి వ్యాపిస్తుంది. ఈ రోజులలో విద్యను, జ్ఞానాన్ని, సవ్యమైన ఆలోచనా విధానాన్ని ప్రసాదించే తల్లులెక్కడున్నారు? ఈ రోజు మానవ సమాజమంతా మదాలస, సుమిత్ర, విదుల, కుంతి, ఓజాబాయి, మొదలైన తల్లులను ఎలుగెత్తి పిలుస్తోంది. కానీ ఇందులో స్త్రీ జాతి దోషమేముంది? స్త్రీ జాతిని శుష్కింపచేసిన ఫలితంగానే సారవంతమైన భూమి ఊసరక్షేత్రమైంది. మళ్ళీ దీనిని సారవంతం చేయటానికి స్నేహరూపమనే జలాన్ని, జ్ఞాన రూపమనే ఎరువు అవసరం. అప్పుడే మనం పోగొట్టుకున్న గౌరవాన్ని పొందగలం. స్త్రీలు ప్రయత్నిస్తారు కానీ పురుషులు వారి పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకుని స్త్రీ శక్తికి మళ్ళీ పునర్ వైభవాన్ని కల్గించాలి.

గృహస్థాశ్రమంలో వ్యక్తులు వారి ఆత్మ వికాసాన్ని అభ్యసిస్తారు. స్వార్థంను వదలి బాధ్యతను స్వీకరిస్తారు. శ్రీకృష్ణుడు నందునికి గృహస్థుల కర్తవ్యాలను గురించి చెప్తూ తల్లి, తండ్రి, గురువు, భార్య, శిష్యులు, స్వయం నిర్వహణలో అసమర్థుడైన పుత్రుని, అనాథైన సోదరిని, కన్యను, గురుపత్నిని ఆదరించి, పోషించటం కర్తవ్యమని చెప్పాడు.

హద్దులతో కూడిన గృహస్థాశ్రమంలో దివ్య భావనలను అభ్యసిస్తారు. ఇది ఒక చిన్న ప్రయోగశాల, వ్యాయామశాల వంటిది. తన క్షుద్రమైన కోరికలు, వాసనల నుండి పైకివచ్చి మనం అందరి హితాన్ని దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. మనం మన ఆశ్రితులను ఉపేక్షించి మన భౌతికావసరాలను మాత్రమే పూర్తిచేసుకునేందుకు, ఈ గృహస్థాశ్రమం కోరికలు, సంతోషాలు, సరదాలు తీర్చుకునేందుకు ఏర్పాటు చేయబడిందికాదు. శ్రీకృష్ణుడు యుధిష్ఠరునితో ఎవరైతే పిల్లలకు, వృద్ధులకు, అలసిన మానవులకు పెట్టకుండా ఒంటరిగా తినేవారు నరకంలో పడాల్సి వస్తుంది అన్నాడు.

గృహస్థు కుటుంబంలోని సభ్యులందరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నడవాలి. కేవలం తన సుఖసంతోషాలను మాత్రమే చూసుకునే వారు శ్రీకృష్ణుని మాటలలో దండనకు పాత్రులౌతారు. కుటుంబసభ్యులకు కేవలం భోజనం, వస్త్రాలు మాత్రమే సమకూర్చితే చాలదు. వారికి విశిష్ఠమైన సంస్కారాలను కూడా అందించాలి. లేనట్లయితే వారు సంయమనం లేని కారణంగా అనేక బాధలలో చిక్కుకుంటారు. సంయమనం లేని వారి ధనం, సాధన, అన్నీ వ్యర్థమౌతాయి.

– అనువాదం : ఎ.ఆర్.నిర్మల

*యుగనిర్మాణయోజన - డిసెంబర్- 2003*

## శ్రీ గాయత్రీ శతకం

27. *కోటిమారులు మంత్రమున్ ధాటిగాను*
*ఆర్తితోడు జపమునొనర్తు వేని*
*బ్రహ్మ హత్యాది దోషాల పాతి పెట్టు*
*విశ్వజనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. ఏకారణంంచేతనైనా నీకు బ్రహ్మహత్యా పాతకం అంటుకుంటే ఆర్తితో గాయత్రీ మంత్రమును కోటి సార్లు భక్తితో జపిస్తే ఆపాతకాన్ని పోగొట్టి నిన్ను నిర్మలునిగా చేస్తుంది.

28. *మాతమంత్రపు మహిమను మనసునెరిగి*
*ఆలపించగ ఎనిమిది వేల మార్లు*
*కుటిల సాక్ష్యపు దోషమున్ కూల్చివేయు*
*విశ్వజనయిత్రి గాయత్రి వేదమాత*

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. గాయత్రీ మంత్రం యొక్క మహిను మనః పూర్వకంగా తెలుసుకుని ఎనిమిదివేల సార్లు ఆలపిస్తే దొంగసాక్ష్యం చెప్పినందువల్ల కలిగిన దోషాన్ని సమూలంగా తొలగించి సన్మార్గునిగా చేస్తుంది.

*రచన*
*సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**పూల పరిమళం గాలికి వ్యతిరేకదిశలో వ్యాపించదు. కాని సద్గుణాల యొక్క కీర్తి దశదిశలా వ్యాపిస్తుంది.**



## ధారావాహిక : భక్తిగాథ-31

# భక్తి ఫలస్వరూపము

అంతఃకరణ భక్తిరసంతో తడవడం ఒక మధురమైన అనుభూతి. భక్తిని గురించీ, భక్తుని గురించీ, భగవంతుని గురించిన చర్చలు ఎక్కడ జరుగుతున్నా, ఎవరి ద్వారా జరుగుతున్నా అంతఃకరణలో శాంతి, సుధారసం వెల్లుబుకుతుంది. ఆ ప్రదేశంలో అనుభవించే తృప్తి, సంతోషమూ, శాంతి మరెక్కడా లభ్యంకావు. భక్తి సరోవరం ఎటువంటిదంటే దీన్లో ఎన్నిసార్లు మునకలు వేసినా తనివి తీరదు. ఇంకా మునగాలి ఇంకా మునగాలన్న భావన కలుగుతుంది. హిమాలయాల పవిత్ర సన్నిధిలో అందరికీ ఈ విధమైన అనుభూతే కలిగింది.

బ్రహ్మర్షి క్రతువు భావసమాధినుండి తేరుకున్నారు. అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న ప్రదేశంలో హిమపక్షి తన మధుర స్వరంతో గానం చేసింది. ఆ గానం దేవర్షి యొక్క కొత్త సూత్రాన్ని ఆహ్వానిస్తున్నట్లుంది. క్రతు మహర్షి దేవర్షి వంక జిజ్ఞాసతో చూశారు. మిగిలిన వారందరిలో కూడా ఇదే విధమైన ఉత్కంఠను గమనించిన నారద మహర్షి మధురమైన స్వరంతో ఈ విధంగా గానం చేశారు.

స్వయం ఫల రూపపతేతి బ్రహ్మ కుమారాః (30)

సనత్కుమారులూ మొదలైన బ్రహ్మపుత్రుల అభిప్రాయం "భక్తి స్వయంగా ఫల స్వరూపము." సూత్రాన్ని ఉచ్చరించి వారు మౌనం వహించారు. క్రతుమహర్షి ఇలా అన్నారు. "ఇందులో సందేహించవలసింది ఏమీ లేదు. బ్రహ్మకుమారులు చెప్పింది అక్షరాలా సత్యం. భక్తిలో సాధనా, సాధనలూ, ఫలితమూ అన్నీ కలిసి ఉంటాయి. భక్తిలో లీనమైన వారికి వేరే ఏ విధమైన సత్యం కానీ తత్త్వం కానీ అవసరం లేదు. భక్తివల్ల అన్నీ లభ్యమయ్యే ఉంటాయి." ఇది సత్యమని అందరూ అంగీకరించారు. కానీ విస్తారమైన వివరణ కావాలనీ, బ్రహ్మకుమారుల అభిప్రాయం, దేవర్షి యొక్క అభిప్రాయంలోని రహస్యార్థం తెలుసుకోవాలనీ, ఇటువంటి కథను వినాలనీ అందరూ కోరుకున్నారు.

నారదమహర్షి క్రతుమహర్షితో ఈ సూత్రాన్ని గురించిన అనుభవాన్ని గురించి తెలియచేయమని కోరారు. క్రతు మహర్షి చెప్పడం ప్రారంభించారు. "భక్తి తత్త్వం చెప్పేవారినీ, వినేవారినీ కూడా కృతార్థులను చేస్తుంది. వారు ధన్యులైనట్లుగా భావిస్తారు. ఒకసారి ఒక భక్తుని సాన్నిధ్యం లభించింది. అతను చదువురాని భిల్లుడు.

ఆ భిల్లుని పేరు కణప్ప. వారి తండా వింధ్య పర్వతాలలోని ఒక అడవి. కణప్ప ఆ తండా నాయకునికి ఒక్కగానొక్క కొడుకు. నల్లటి బలిష్ఠమైన శరీరము, ముఖం మీద సాత్విక ఆకర్షణతో నిండిన వర్చస్సు. భిల్లు కుమారుడైనప్పటికీ అతని నడవడీ, ఆహారమూ అన్నీ కూడా సాత్వికమైనవే. మాంసాహారం ముట్టేవాడు కాదు. బలవంతుడైనా లేశ మాత్రమైనా అహంకారము ఉండేది కాదు. తండాలోని పనికి తండ్రికి సహాయపడేవాడు. సమయం దొరికినప్పుడల్లా అడవిలోని సాధువులూ, తాపసుల సేవ చేసేవాడు."

ఈ సేవా పరాయణతల ఫలము అతనికి భక్తిరూపంలో లభ్యమైంది. వింధ్యపర్వతాలలోని ఒక తాపసి ప్రసన్నుడై అతనికి పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశించారు. "నమఃశివాయ" పంచాక్షరీ మంత్రంతో పాటు భగవంతుని లీలామయగాథలు వినిపిస్తూ ఇలా చెప్పాడు.

"భావ సమాధిలో మునిగా నీ ఆరాధ్యదైవాన్ని స్మరిస్తూ నిన్ను నీవు అర్పించుకోవడమే భక్తి. గాఢంగా ఈ సాధన చేస్తూ పరిపక్వతను పొందినపుడు భక్తి యొక్క తీవ్రత ప్రకటితమౌతుంది. భక్తునికి ముఖ్యంగా కావలసింది.

**ఇతరుల ఆత్మవిశ్వాసాన్ని జాగృతం చేయడం సర్వోత్తమ కానుక**

అనన్యమైన భక్తి, అనన్యమైన భక్తి సాధనలో జీవితం యొక్క తత్వాన్నీ, సత్యాన్నీ తెలుసుకోగలుగుతారు. ఈ లోకంలో అతనికి సాధ్యం కానిది ఏదీ ఉండదు. భక్తి స్వయంగా ఒక మధురఫలం.

దేవవ్రతుడనే సాధువు చెప్పిన మాటలన్నీ అతని హృదయంలో నాటుకుపోయాయి. కుటుంబం కోసం తన కర్తవ్యపాలన కానీ భావనలన్నీ భగవంతుని కొరకే. ఉదయమూ, సాయంకాలమూ సరోవర తీరానికి వెళ్ళి మఱ్ఱిచెట్టు నీడలో పూజ చేసుకునేవాడు. స్మరణా, సమర్పణల భావన అతని రోమ రోమాల్లో నిండిపోయింది. శివమంత్రాన్ని ఉపదేశిస్తూ సాధువు చెప్పి మాటలు "ఎవరైతే తన భావనలన్నింటినీ భగవంతునికే సమర్పిస్తారో అతడే భక్తుడు. సంపదలను ఇతరులకు పంచవచ్చు. కానీ భావనలు ఒక్క భగవంతునికే. అవి కేవలం అతనికే అర్పించబడాలి. అలా కాకపోతే అతనెప్పటికీ భక్తుడు కాలేడు."

"సరళ హృదయుడైన కణప్పకు ఆ పలుకులు హృదయంలో నాటుకుపోయాయి. అతని మేధస్సు అంత గొప్పది కాకపోవచ్చు. కానీ భావనలు పవిత్రమైనవి. భావ సమర్పణ అనే కళ అతన్ని భావ సమాధిలో లీనమయేటట్లు చేసింది. ప్రభువుతో కలసిపోయాడు. అతని మనో మందిరం భగవంతునికి నివాసమైంది. బోలేనాధుడు తన ప్రియశిష్యుని ఎదుట సాక్షాత్కరించాడు. భావసమాధిలో లీనమైన కణప్ప భగవంతుని గమనించలేదు. భగవంతుడు తన చేతిని కణప్ప శిరస్సుపై ఉంచి మేల్కొలిపాడు. "నీకేమి కావాలో కోరుకో" అన్నాడు. భగవంతుని తన ఎదుట చూసేసరికి కణప్ప కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. అతి కష్టంతో "నాకు భక్తి అనే వరాన్ని ప్రసాదించండి. ఎటువంటి పరిస్థితులెదురైనా నేను భక్తిలోనే మునిగి ఉండాలి." బోలేనాధుడు "అలాగే" అన్నాడు. భక్తునికీ భగవంతునికీ కూడా భక్తి ఫలస్వరూపమని అనుభవమైంది.

*– అనువాదం : కె. అరవిందమ్మ*

*అఖండ జ్యోతి – ఆగస్టు 2008*

## ఆత్మబలము యొక్క మహిమ

*ఆ రోజు మొగల్ దర్బారులో చాల హడావుడిగా వుంది. మొగలులతో సంధి మంతనాలు జరపటానికి సిఖ్ఖు గురువు గోవిందసింహ్ ఆహ్వానింపబడ్డాడు. అందరి ముఖాలలోను ఆందోళన ఆనందము మిళితమై ఉన్నాయి. గురువు విచ్చేశారు. మొగలులలో ఒక మౌల్వీకి ఆయనను గురువు అనడమే ఇష్టంగా లేదు. సైన్యాన్ని నడిపించి యుద్ధంచేసేవాడు గురువెట్లాఅవుతాడు? గురువైన వాడు విద్యను గాని, ఆధ్యాత్మిక విషయాలు గాని నేర్పించాలి.*

*మౌల్వీ : అయ్యా! మీ గురువులు కాదా! ఏదైనా ఒక మహిమను చేసి చూపండి.*

*గురు : (నవ్వుతూ) మౌల్వీగారూ! ఆధ్యాత్మికతకు, మహిమలకు సంబంధం లేదు. మహిమలు చూపటమే గురువుల పనికాదు.*

*మౌల్వీ : మరి మీ పని ఏమిటి?*

*గురు : శిష్యులకు సరియైన మార్గదర్శనం చేయటం.*

*మౌల్వీ : ఏదైనా ఒక చిన్న మహిమ చూపండి.*

*గురు : మహిమలే చూడాలనుకుంటే నీ చుట్టు ఉన్న ప్రకృతిని చూసి దానిని సృష్టించిన భగవంతుని మహిమను చూడు.*

*మౌల్వీ : నేను మానవుని మహిమను చూడాలనుకుంటున్నాను.*

*గురు : అయితే మీ చక్రవర్తి ఒక్కడే ఇంత పెద్దరాజ్యాన్ని తన కనుసన్నల్లో నడుపుతున్నారుకదా! అది మానవ మహిమయే.*

*మౌల్వీ : లేదు. నేను మీ పరిధిలోనున్న మహిమను చూడాలనుకుంటున్నాను.*

*గోవిందసింహ్‌కు చిర్రెత్తుకొచ్చింది. ఒక్కసారిగా లేచి నిలబడ్డాడు. వరలోనుండి ఖడ్గాన్ని సర్రున లాగాడు. "నా పరిధిలో మహిమను చూడాలనుకుంటే ధైర్యంగా నా ముందుకురా" అంటూ సింహగర్జన చేశాడు. మౌల్వీకి ముచ్చమటలు పట్టాయి. పాదుషా కనుక వినయంగా బుజ్జగించి మౌల్వీని తన ప్రక్కకు చేర్చుకోక పోయినట్లయితే అతని తల మొండెంనుండి వేరైపోయేదే. ఆత్మబలము యొక్క మహిమ ఎలాంటిదో అందరూ చూచేవారు.*

**ఇతరులకు ప్రోత్సాహం ఇవ్వడం పెద్ద సహాయం.**

ప్రత్యేక వ్యాసం

# పితృదేవతలను స్మరించాలి వారు మనకు శక్తిని ఇస్తారు

## గాయత్రీ జయంతి - గురుదేవుల మహా ప్రయాణ గాథ సందర్భంగా

పరమపవిత్రమైన గాయత్రీ జయంతి నాడు పరమపూజ్య గురుదేవుల మహా ప్రయాణం కొనసాగింది. ఈనాడు వారు మనందరికీ (పరిజనులందరికీ) పితృదేవులు, వారు మహోన్నతమైన ఆశయాలతో జీవించారు. "యుగనిర్మాణం" అన్న మహోన్నత కార్యాన్ని చేపట్టారు. తమ స్థూలశరీరంతో ఉన్నంతకాలం కఠోర నియమాలతో లోకకల్యాణం కోసం పాటుపడ్డారు. మనందరం వారి వారసులం. వారు తలపెట్టిన కార్యాన్ని పూర్తి చేయవలసిన బాధ్యత మనపై ఉంచారు. సూక్ష్మ శరీరంతో మనల్ని ప్రోత్సాహపరుస్తూ ఉన్నారు. అండదండగా మనకు వెన్నంటి ఉన్నారు.

తాము చేయవలసిన పనిని మరింతగా చేసే సంకల్పంతో ఉద్దేశ్యపూర్వకంగా స్థూల శరీరాన్ని విడిచిపెట్టారు. అటువంటి మహాత్మునికి మనం ఇచ్చే తర్పణం ఏమిటి? ఒక్కసారి బాగా ఆలోచించుకోవాలి. పిండప్రదానాలకు బదులుగా అంశదానాలు సమర్పించాలి. నువ్వుల తర్పణకు బదులుగా మన సమయాన్ని అర్పణ చేయాలి. వారి మహాదాశయాన్ని అనుక్షణం మననం చేసుకుంటూ ముమ్ముందుకు సాగాలి. గురుదేవులు చెప్పిన విధంగా మరణం కూడా ఒక మహోత్సవమే. వారి మహా ప్రయాణ లక్ష్యాన్ని మన మనసుల్లో మననం చేసుకోవాలి. మనవంతు బాధ్యతను ఉడుతాభక్తిగా నిర్వర్తించాలి. దానికి నాందిగా మన దేవసంస్కృతీ వైభవాన్ని పితృతర్పణల ప్రయోజనాన్ని గుర్తు చేసుకుందాం. గురుదేవులు మనకు కావలసిన శక్తిని ప్రసాదించుగాక!

జీవితం యొక్క సమగ్ర జీవన విధానమే దేవ సంస్కృతి. మానవ జీవనవికాసం దీని మీదనే ఆధారపడి ఉంటుంది. శరీరాన్ని వదలి వెళ్లిన ఆత్మకు నాశనం లేదు. మృతాత్మలతో సంబంధాన్ని పెంచుకుంటూ ఇచ్చిపుచ్చుకోవడాలు జరుగుతూనే ఉంటాయి. అదే మరణానంతరం జరిపే శ్రాద్ధ తర్పణ కార్యక్రమం. సంవత్సరంలో 15 రోజులు పితృపక్షాలుగా (మహాలయ పక్షాలు) ప్రత్యేక పద్ధతిలో జరుపుకుంటూ ఉంటాం. ఇలాంటి వ్యవస్థ మరి ఏదేశ సంస్కృతిలోనూ లేదు. మొగల్ చక్రవర్తి షాజహాన్‌ను అతని కుమారుడు ఔరంగజేబు బంధిఖానాలో ఉంచినప్పుడు దేవసంస్కృతిలోని ఈ విధానాన్ని గుర్తు చేసుకున్నాడు. "వాకే ఆత్ఆల్ మగీరీ'' ఆకిల్ ఖాగ యొక్క గ్రంథంలో "పుత్రకేనామ్‌పత్ర్" అంటూ ఈ విధంగా వ్రాశాడు. "కుమారా నువ్వు బ్రతికి ఉన్న తండ్రినే దహనం చేయాలని ప్రయత్నిస్తూ ఉన్న విచిత్రమైన ముసల్మానువి. కాని హిందువులు మరణించిన తండ్రిని మాత్రమే దహనం చేస్తారు. ఇందులకు వారిని ఎంతైనా మెచ్చుకోవచ్చు.

ఇదే విధంగా "ఆరోగ్యం కీ మహానతా" అనే గ్రంథంలో హిందూ శ్రాద్ధకర్మల విధానం అతి ప్రాచీన కాలం నుండి వస్తున్నదే. ఈనాటి నుండి నేటి వరకు అతి పవిత్రమైనదిగా భావింపబడుతోంది. నాకు తెలిసినంత వరకు క్రైస్తవ సంప్రదాయంలో పితృదేవతలను స్మరించుకోడం అంటే పొరపాటు క్రియగా భావిస్తారు. హిందువులు చూపించే ఈ శ్రద్ధ ప్రశంసనీయమేకాదు ప్రోత్సాహనీయం కూడా. నా దృష్టిలో ఈ సంప్రదాయం అన్ని ధర్మాలవారు అనుసరించదగినది. కేవలం వారిని స్మరిస్తూ శుభాన్ని కోరుకోవడం సరిపుచ్చక (సరిపోదు) వారిని తృప్తి పరస్తూ దానధర్మాలు చెయ్యాలి. ఆ విధంగా చేయకపోయినట్లైతే వారు అసంతృప్తితో బాధపడతారు అని ఒక ఆంగ్ల పండితుడు వ్రాసుకున్నాడు.

**మనిషి ఎలాంటి ఆలోచనలు చేస్తాడో తదనురూపంగా తయారవుతాడు.**

మహాలయ అమావాస్య (పెద్దల అమావాస్య) పితృదేవతలను గుర్తు చేసుకుని, వారిని తృప్తిపరచే గొప్ప పండుగ. 'శ్రాద్ధం' అంటే శ్రద్ధతో కూడిన వ్యవహారం అనీ 'తర్పణ' అంటే తృప్తిపరచడం అనీ అర్థాలు. 'శ్రాద్ధతర్పణం' అంటే మరణించిన పెద్దలను తృప్తిపరచడం అని భావం. ఈ భావంతోనే పితృ అమావాస్య జరుపుకోవడం జరుగుతుంది. దీని ద్వారా మనం మన పెద్దల, మహాపురుషుల ఆదర్శాలను, ఆదేశాలను గుర్తు చేసుకుంటూ ఆచరించాలి.

ఋషుల ఆలోచన ప్రకారం మరణం తర్వాత ఆత్మ చంద్రలోకం వైపుకు పోతుంది. ఇంకా ఇంకా పైకి వెళ్లి పితృలోకం చేరుకుంటుంది. ఆత్మకు అక్కడిదాకా చేరుకునే శక్తిని ఇవ్వడానికే చనిపోయిన తర్వాత పిండప్రదానం చేయడం జరుగుతుంది. శ్రాద్ధ కర్మలో భాగంగా వారి పేరుమీద జ్ఞాన ప్రసాదం పంచడం జరుగుతుంది" అందువల్ల పితరులు తృప్తి చెందుతారన్న విశ్వాసం పెట్టుకోవాలి.

శాస్త్రాల ప్రకారం "పితృ కర్మలు జరిపించిన వ్యక్తికి వారి ఆశీస్సులు లభిస్తాయి. ఆయువు, బలములతో పాటు పుత్ర పౌత్రాభివృద్ధితో, ధన ధాన్యములతో తుల తూగుతూ ఉంటారు." అందువల్ల ఆశ్వయుజ బహుళపక్షం 15 రోజులూ నియమంగా పితృతర్పణలు ఇవ్వడం జరుగుతుంది. పితరులు మరణించిన తిథిప్రకారం దాన ధార్మాలు చేస్తూఉంటారు.

మహర్షి సుమంతుని ప్రకారము "శ్రాద్ధకర్మను మించిన శుభకర కార్యక్రమం ప్రపంచంలో మరొక్కటిలేదు." అందువల్ల బుద్ధిమంతులైన వారు శ్రాద్ధ కర్మను శ్రద్ధాభక్తులతో నిర్వహించాలి. గరుడపురాణం ప్రకారం "పితృ దేవతలను పూజిస్తే వారు తృప్తి చెంది వంశానికి సకల సుఖ,సౌకర్యాలు కల్పిస్తారు. పితృదేవతలు తృప్తి చెందితే సృష్టిలోని సకల జీవులు తృప్తి చెందుతాయి.

విధి పూర్వకంగా శ్రాద్ధ కర్మను నిర్వర్తించిన వారి పట్ల మనుష్యగుణాలు, బ్రహ్మగణాలు, ఇంద్రగణాలు, రుద్రగణాలు, అశ్వినీ కుమారులు, సూర్య భగవానుడు, అష్టదిక్పాలకులు, పశుగణాలు, పితృగణాలు, భూతగణాలు సర్వులూ అనుగ్రహం చూపిస్తారు. ఇదే విషయం విష్ణుపురాణంలో గూడా చెప్పబడింది. మానవుడు ఒక్కరోజున శ్రాద్ధ తర్పణ చేస్తే పితృదేవతలు సంవత్సరకాలం తృప్తిగా ఉంటారు.

పైన తెలిపిన విషయాలు అతిశయోక్తులు కావు. ఋషులు చెప్పిన సిద్ధాంతాల ప్రకారం వైజ్ఞానికంగా పరిశోధనలు చేయడం జరిగింది. ఈ బ్రహ్మాండంలో ఉన్న అణువణువు ఒక దానితో ఒకటి జోడింపబడి యున్నది. ప్రపంచంలో ఏమూల ఏది జరిగినా దాని ప్రభావం అందరి మనస్సుల మీద పడితీరుతుంది. కాకపోతే దీనిని గుర్తించుట కష్టం. ఒకచోట యజ్ఞం చేస్తే ఆ హోమద్రవ్య ప్రభావం వాయురూపంలో విశ్వమంతటా వ్యాపిస్తుంది. అదే విధంగా కృతజ్ఞతా భావంతో శ్రద్ధగా చేసిన శ్రాద్ధ కర్మ ప్రభావం సకల ప్రాణులలో ప్రశాంతతను, సంతృప్తిని కలుగచేస్తుంది. సద్భావనాతరంగాలు జీవించి ఉన్నవారితోపాటు మరణించినవారికీ మేలును కలుగచేస్తాయి.

పితృకర్మలను నిర్లక్ష్యం చేయుట, పితృదేవతలను నిర్లక్ష్యం చేసినవారిని మూర్ఖులు అనవచ్చు. అట్టివారికి పితృదేవతల వల్ల హానికూడా కలుగవచ్చునని అనేక శాస్త్రగ్రంథాలలో వ్రాయబడిఉంది. అందువల్ల ప్రతి ఒక్కరు ఏదో ఒక రూపంలో పితృదేవతలను సంతృప్తి పరచాల్సి ఉంటుంది. దానివల్ల వారితో పాటు మనం కూడా ప్రశాంతంగా, హాయిగా ఆనందంగా జీవించగలుగుతాం. మన ప్రస్తుత కర్తవ్యం మన గురుదేవులు నిర్దేశించిన పని చేయడం వారిని సంతృప్తి పరచడం.

– *అఖండజ్యోతి 2005 – సెప్టెంబరు*

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**

**మనం ముందు ప్రపంచాన్ని మార్చొద్దు. ముందు నువ్వు మారు.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# యజ్ఞమంటే ఉదారత, ఆత్మీయత, సద్భావనలే

దేవతలారా, సోదరులారా !

ఒకసారి బాగా ఆకలిగా ఉన్న ఛండాలుడు ఒక బ్రాహ్మణుని దగ్గరకు వచ్చాడు. అతను, అతని భార్య, పిల్లలు తమతమ రొట్టెలను ఆ ఛండాలునికి ఇచ్చారు. వాడు అవి తిని సంతుష్టుడైనాడు. రొట్టెలు తిని నీరుత్రాగి ఒకచోట కూర్చుని చేయి కడుగుకున్నాడు. తరువాత ఒక ముంగీస వచ్చింది. అక్కడ విశ్రమించింది. వెంటనే దాని నల్లటి వెంట్రుకలు బంగారు రంగులోనికి మారాయి. మనుష్యులు దానిని అడిగారు నల్లగా ఉన్ననీవు బంగారం రంగులోనికి ఎలా మారావు? ఒకచోట యజ్ఞం జరిగింది అక్కడకినేను వెళ్ళి పడుకున్నాను. నా వెంట్రుకలు బంగారు రంగులోకి మారాయి అని సమాధానం చెప్పింది.

మిత్రులారా, యజ్ఞం గొప్పది. దానిని పెద్దవారే గాక చిన్నవారు కూడా చేయవచ్చు. మీరు డబ్బు ఖర్చుపెట్టిచేసే హవనమే యజ్ఞమనుకుంటారు. కాని అది సరికాదు. మీరు ఎవరైనా ముసలివాడి, ఎవరైన సోదరికి, సోదరునికి కంటి ఆపరేషన్ చేయించినా అది కూడా యజ్ఞమే. మీరు ఇటువంటి యజ్ఞము చేస్తే మిమ్మల్ని యజ్ఞం చేయించిన వారుగా, శ్రేష్ఠుడైన వానిగా భావిస్తాను. మిమ్మల్ని ఆహ్వానిస్తాను. మీరు కంటిచూపులేని ముసలివానికి డబ్బు ఖర్చుచేసి అతని కంటిలో కొత్త జ్యోతిని నింపినట్లయితే నేను మిమ్మల్ని మంచి యజ్ఞం చేసిన వానిగా మిమ్మల్ని నిజమైన హవనకర్తగా చెప్తాను. ఇదే మన సంస్కృతి, ప్రతి మనిషి కర్తవ్యం. ఇతరుల కష్టాలను, బాధలలో సహాయం చేయించటం సహకరించడం. మన దృష్టికోణం ఇలా ఉంటే సమాజంలో సమస్యలు ఏమి ఉంటాయి. ఎవరైన దొంగతనం చేస్తారా, బందిపోటుతనం చేస్తారా? ఎవరూ చేయరు. మనిషికి సమస్యలే ఉండవు. వారి భావాలలో పరివర్తన వస్తుంది. దొంగతనం చేసేముందు, ఈ వ్యక్తి ఈ డబ్బు ఏ పనిమీద తీసుకువెళ్తున్నాడో వీడికి కష్టం కల్గించడం ఎందుకనుకుంటాడు. మనలో ఇలాంటి పరివర్తన వస్తే ఏ సమస్యలు ఉండవు. ఇలాంటి భావన మనస్సులో ఉంటే అపరాధం ఎలా చేస్తాడు. మన శరీరం మనిషిదే కాని లోపల హృదయం రాక్షసుడిది. హృదయం మావనత్వంతో నిండితే ఇక సమస్యేముంది. మనం గాయత్రి సిద్ధాంతములమీద, ఆధ్యాత్మిక సిద్ధాంతములమీద నడిచేవారమైతే మనం పాపాలు చేయగలమా? అసంభవం. సమాజంలో పాపాలు అపరాధాలు తీసివేయగలిగితే నలువైపుల సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. ఈ రోజు ఇటువంటి సిద్ధాంతాలు ప్రజలలో వచ్చినట్లయితే గాయత్రి, యజ్ఞముల ఫిలాసఫీ అర్థం అయితే మనిషి మహామనిషి అవుతాడు.

నేడు నృత్యాంగనాలు సమాజమును నాశనం చేస్తున్నారు. వీరు మీ జీవితంలో రాకపోతే చాలా మంచిది. మీ ధర్మపత్నిని ప్రేమిస్తే మజా వస్తుంది. మీరు, మీ ధర్మపత్ని ఒకరి కొరకు ప్రాణం ఇచ్చి జీవించగలిగితే ఆనందం కలుగుతుంది. అప్పుడు మీ పరివారం ఒక కొత్త ఉత్సాహం, ఉల్లాసంతో నిండిపోతుంది. మిత్రులారా ఇది కూడా యజ్ఞం యొక్క సిద్ధాంతమే. ఈ రోజున మీ భార్య భోజనంలో ఉప్పు ఎక్కువ తక్కువయినా, కంచం సరిగ్గా కడగకపోయినా నానా తిట్లు తిడుతుంటారు, చావకొట్టేందుకు సిద్ధపడుతుంటారు. ఇదేమి పద్ధతి? ఆమె తల్లిదండ్రులను వదలి మీ దగ్గరకు వచ్చిందని మీకు గుర్తుండదు. ఆమె జీతం అడగదు. పెన్షన్ అడగదు. ఆదివారం సెలవు కూడా అడగదు.

ఎంత గొప్పది ఈ నారీజాతి. అలాంటి దేవతను చూడలేరు. మీరు రాతితో చేసిన దేవతలను చూశారు. ఈ దేవతలే మేకలను తినేస్తుంటాయి. మీరు ఈ దేవతకు హారతి ఇవ్వకపోయినా ఫరవాలేదు. పూజ చెయ్యకపోయినా ఫరవాలేదు. కనీసం భావసంవేదనతో చూడండి. ఇలాంటి జీవనాన్ని నేర్చుకుంటే, ప్రేమతో నిండిన జీవనాన్ని జీవిస్తే ఎంత బాగుంటుంది.

మీరు కుటుంబంలోని భార్యబిడ్డలను సుసంస్కారవంతులుగా చేయకపోతే, భావసంవేదనలు చూపకపోతే మీకు చాలా వినాశనం జరుగుతుంది. మీకు

**ముళ్ళు చెట్లు నాటితే ముండ్లే వస్తాయి.**

ముసలి తనంలో ఎవరు పలుకరు. మీలో చాలామంది ముసలితనంలో అడుగు పెట్టబోతున్నారు. మీ జుట్టు నా జుట్టులాగే తెల్ల బడుతుంది. మీ పిల్లలు పెద్దయినపుడు వాళ్ళమ్మను మీరు పెట్టిన బాధలు మరచిపోరు. అమ్మను పెట్టిన బాధలకు మీమీద కోపం ఉంటుంది. మీ కోడలితో మీరు ఎలా ఉన్నారో గమనించుకోండి. జాగ్రత్త. ఇంటిలో కనుక ప్రేమించటం నేర్చుకుంటే ఎంత బాగుంటుంది. వారి జీవనం ధన్యం అవుతుంది. ఆధ్యాత్మికత మన ఇంటిని నింపివేస్తుంది. ఇంట్లో ఆనందభరితమైన, ఉల్లాస భరితమైన వాతావరణం ఉంటుంది. ఇల్లు స్వర్గంగా మారుతుంది.

ఆధ్యాత్మికత అంటే ప్రేమ, ఆత్మీయత. ఒకసారి స్వామి రామతీర్థ జపాన్ వెళ్ళారు. అక్కడ ఒక ఫాక్టరీని చూడటానికి వెళ్ళారు. అక్కడ ఉన్న వారందరు పనిలో నిమగ్నమయి ఉన్నారు. ఒక్కసారి ఈయన వంక చూచి, మరల వారి వారి పనులలో నిమగ్నమయ్యారు. ఇతనితో మాట్లాడటానికి ఎవరికి సమయం లేదు. జపనీయులు చాల కష్టపడి పనిచేస్తారు. వారంలో ఐదు రోజులు పనిచేస్తారు. అందువల్లనే జపాన్ ప్రగతిపథంలో నడుస్తుంది. దేశం పురోభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో మరింత ఉత్పాదన కొరకు ఉత్సాహంగా పనిచేస్తారు. రెండు రోజులు కుటుంబ సభ్యులతో సుఖంగా, సంతోషంగా జీవిస్తారు. స్వామి రామతీర్థ చాలా ప్రభావితమయ్యారు.

రామతీర్థుల వారికి వారిని చూచి తలతిరిగిపోయింది. మీకు సంస్కృత శ్లోకాలు చదివి ఆధ్యాత్మిక శిక్షణ ఏమి ఇవ్వగలను? మీరందరు నిజమైన ఆధ్యాత్మికవాదులు. ఇంత బాధ్యతగా పనిచేస్తున్నవారికి ఏమి చెప్పగలను? అన్నాడు. మీరు అందరు జపనీయులు లాగా కర్మయోగులు అవ్వాలి.

మీకు ప్రేమించటం వచ్చా? రాదు. మీరు మీ భార్యను ఎగతాళి చేస్తుంటారు. నల్లగా ఉన్నదని, లావుగా ఉన్నావని కట్నం తీసుకురాలేదని. మీరు ఎప్పుడూ సంతోషంగా ఉండరు. మీ జీవితంలో డబ్బు సినిమాలకి ఖర్చుపెడతారు. సిగరెట్లు ఊదేస్తుంటారు. మీకు బడ్జెట్ వేసుకోవటం రాదు. మీ ఆదాయాన్ని పిల్లల వికాసానికి, ప్రగతికి ఖర్చుపెడితే పరిస్థితి ఇంకొక రకంగా ఉంటుంది. మీరు నవ్వటం, నవ్వించటం వస్తే, ప్రేమించటం తెలిస్తే, బడ్జట్ ప్రకారం ఖర్చు చేయడం వస్తే, మీరు నిజమైన ఆధ్యాత్మికవాదులు. గాయత్రీ ఉపాసకులు, యజ్ఞకర్తలు.

ప్రపంచంలోని సమస్యలకు సమాధానం యజ్ఞ దర్శనంతోనే సాధ్యమవుతుంది. అందరూ కూర్చుని మాట్లాడుకుంటే ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రపంచంలో రక్తం చిందటం అనేది ఆగిపోతుంది. సముద్రజలాన్ని తియ్యగా చెయ్యవచ్చు. దీనివల్ల ఆహార సమస్య తీరిపోతుంది. బంజరు భూములు పంట భూములవుతాయి. మనిషి తెలివితేటలు, శ్రమ ఉపయోగించుకుంటే కొండల మీదకూడా పంటలు పండించవచ్చు. యుద్ధం కొరకు ఖర్చుపెడ్తున్న డబ్బు మనుష్యుల వికాసానికి ఖర్చుపెడితే మనుష్యులలో ఆనందం వెల్లివిరుస్తుంది. ఇదే యజ్ఞీయ ఫిలాసఫీ అంటే. దీనితో ఎడారులను సస్యశ్యామలం చేయవచ్చు. బాంబులు, అస్త్రశస్త్రాలకు పెట్టే డబ్బుతో గొట్టపుబావులు వేస్తే, స్కూల్సు పెట్టిస్తే ఎంత ఉపయోగకరంగా ఉంటుంది.

అన్ని సమస్యలను డబ్బుతో, రాజనీతితో పరిష్కరించలేము. కేవలం మానవత్వంతోనే అదిసాధ్యం. దీనిద్వారానే రాష్ట్రాల మధ్య పోట్లాటలు, యుద్ధాలు, భాషాప్రాంతవాదం, జాతివాదం, మొదలైన సమస్యలను పరిష్కరించుకోవచ్చు. మీరు మహాత్మాగాంధీజీకి జై అంటారు. కాని ఆయన ఆదర్శవాదములను పట్టుకోలేదు. కుర్చీ కోసం కుక్కల్లాగా పోట్లాడుకుంటున్నారు. మనిషి యొక్క సంకుచిత హృదయం, వ్యవహారంవల్ల సమస్యలు అన్నీ ఉత్పన్నమవుతున్నాయి. చిన్న చిన్న సమస్యలు జీవితాన్ని సర్వనాశనం చేస్తున్నాయి. మనుష్యుల ఉదార స్వభావముతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

త్యాగం, సద్భావనలే యజ్ఞమంటే. ఈ త్యాగమే ప్రపంచానికి కొత్తరూపురేఖలు ఇస్తాయి. విశాల హృదయం, ఉదారతే ప్రపంచాన్ని కాయకల్పం చేస్తుంది. ఇది ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి, లేకపోతే 1000 సంవత్సరాల తర్వాత తప్పనిసరిగా వస్తుంది. అప్పుడు ప్రజలందరు భారతీయ సంస్కృతి అనుయాయులవుతారు. విశాల హృదయం, ఉదారత వారి అస్త్ర శస్త్రాలవుతాయి. ఆ రోజు మానవజాతి శాంతిని పొందగలుగుతుంది. ప్రపంచం శాంతి సౌభాగ్యాలను పొందుతుంది. పృథ్వి స్వర్గంగా మారుతుంది.

*– అఖండ జ్యోతి 1997 ఏప్రిల్*

**మంచిపనులకి దుర్గతి ఎన్నడు లభించదు.**

వైజ్ఞానిక ఆధ్యాత్మికత

# అధర్వణ ఋషి - లోకసేవ

ఆధ్యాత్మికత వైజ్ఞానికత యొక్క ప్రయోక్త ఆధర్వణ మహర్షి వ్యక్తిత్వం వైజ్ఞానిక, దార్శనిక, మనీషి, అధ్యాత్మికవేత్త, కవి, రహస్యవాదం యొక్క వివిధ ఆయామముల సమన్వయం. ఆయన అనుసంధాన క్షేత్రం విలక్షణమైనది. ఇతరులకన్న భిన్నమైనది. ఆయన చేతనత్వం యొక్క చైతన్యంతో వివిధ ధాతువుల ఉత్పత్తి, పదార్థముల సూక్ష్మరూపంలో స్పందించే చేతనత్వ వ్యక్తీకరణపై పనిచేస్తున్నారు. ప్రారంభ దశలోనే విశిష్ట విభూతులను ఆయన విశ్లేషించారు. అర్థం చేసుకున్నారు. ఇంత గొప్ప మహర్షి ఇటువంటి రిసర్చి పనిపై సమయం వ్యర్థం చేసుకుంటున్నారని అనేకమంది భావించారు. ఋషిగా మూడు లోకముల యందు పూజనీయుడు. ఆర్యావర్తనములోని రాజులందరు ఆయనను దేవతలకన్నా ఎక్కువ గౌరవిస్తారు. ఆయనకు అంతకన్న ఏమి కావాలి? చిన్నగా తియ్యగా నవ్వుతూ ఆధర్వణ మహర్షి ఇలా అన్నారు. “నాకు ఆత్మ సన్మానం కాదు కావలసింది. లోక సేవను ఆకాంక్షిస్తున్నాను. లోకమునకు ఉపయోగపడే రిసర్చి పని చేయాలని ఉన్నది.”

నిజంగానే ఈ అద్భుత ఋషివర్యులకు లోకసేవయే అన్నింటికన్న ముఖ్యం. ప్రపంచంలోని కష్టాలు చూచి ఆయన బాధపడుతుండేవారు. ఎవరి కష్టాలు చూచినా ఆయన కన్నులు ద్రవించేవి. మనుష్యులైన, పశువులైన పక్షులైన అన్నీ తనవే. మధుమతీ నదీ తీరంలో ఆయన ఆశ్రమం ఉండేది. చుట్టుప్రక్కల గ్రామాలవారు దానిని “ఆధర్వ ఆశ్రమం” అని పిలిచేవారు. మధుమతీ తీరమునగల దట్టమైన వనములో ఈ ఆశ్రమం ఒక కొండ గుర్తుగా చెప్పుకునేవారు. కాని వనమంతా ఆశ్రమంలో భాగమే. ఎందుకంటే అధర్వ ఆశ్రమం యొక్క కుటీరములు కేంద్రములు వనమంతటా ఉండేవి. ఆశ్రమంలోని ముఖ్య కుటీరంలో మహర్షి, పుత్రిక వాటిక ఉండేవారు. ఇది నదీ తీరానికి దగ్గరగా ఉండేది. ఆశ్రమ ఇతర కేంద్రాలలో, కుటీరములలో మహర్షి శిష్యగణం ఉండేవారు. మహర్షి నిర్దేశానుసారం రీసర్చ్ పనులలో నిమగ్నమయ్యేవారు.

వీరందరు లోక సేవ కొరకు సంకల్పించిన వారే. మహర్షి వారు చేస్తున్న పనికి కొత్త పేరు ఇచ్చారు. “ఋషి అర్చన” “ఋషి అర్చనతో లోకవందనం” అనేది వారికి జీవన సూత్రం అయింది. వయస్సు చూస్తే వారు వృద్ధులే కాని ఇప్పుడు కూడా యువకుల తేజం, బలం, ఉత్సాహం, శ్రమశీలత ఉన్నాయి. వీరి పుత్రిక కూడా లోకసేవ కొరకు తీర్మానించుకున్నది. ఆమె తన తండ్రి చేస్తున్న పనులలో సహాయ సహకారాలందించేది. కొద్ది రోజుల క్రితం మహర్షి ఒక మాట అన్నారు. పదార్థం విఘటించినపుడు భౌతిక సూక్ష్మచేతనల శక్తి బయటకు వస్తుంది. ఇలాంటి శక్తి ప్రవాహములను క్రమపద్ధతిగా ఘనీభవింపచేసినట్లయితే రకరకాల పదార్థముల సృష్టి జరుగుతుంది. మహర్షి ఏం చెప్తున్నారంటే పదార్థముల విఘటన ప్రక్రియ ఒక విశేషమైన ముహూర్తములో, విశేషమైన మంత్రసాధన సంకల్పంతో చేసినట్లయితే సంవత్సరాలలో అయ్యే పని ఒక్క రోజులో పూర్తి అవుతుంది. విశేషమైన ముహూర్తమున జరిపే యజ్ఞ కర్మలో పదార్థ విఘటనతో ప్రాప్తించే శక్తి, కార్యసిద్ధికి సర్వోత్తమ ఉపాయంగా మహర్షి భావించేవారు.

అధర్వణ మహర్షి ఔషధులు, మణుల, యంత్రముల మీద చాల ప్రయోగాలు చేశారు. వీటితో పాటు రకరకాల వృక్షాలు, ధాతువులు, విభిన్న స్థలముల నుండి మట్టి, జలం, అన్య పదార్థముల మీద కూడా సూక్ష్మ అన్వేషణ ఉండేది. మహర్షుల పనిలో ప్రతి శిష్యుడు పాల్గొన్నప్పటికి పుత్రిక వాటికా, శిష్యులైన క్రతు, కౌత్స, భృంగారీల విశేషమైన యోగదానమున్నది. వీరు మహర్షితో 16 సంవత్సరాలు నిద్రాహారాలు మరచి శ్రమించారు. ఈ సాధన విశేషమైన ఫలితాలను ఇచ్చింది. వేరు వేరు స్థానములనుండి శక్తి ప్రవాహం ప్రత్యేకంగా విశేషంగా ఉంటుంది. అందువల్ల ప్రత్యేకమైన ముహూర్తంలో ప్రత్యేకమైన రీతిలో చేసిన ప్రయోగ ఫలితం కూడా ప్రత్యేకంగా ఉంటుంది.

సంపూర్ణ ప్రకృతిలోని ప్రతి జీవించివున్న లేక చనిపోయిన ప్రాణి, చెట్లు, పదార్థములకు విశేషమైన గుణములు ఉంటాయి అని తెలుసుకున్నారు. అవి అన్నీ అణువుల సంరచన అనుసారంగా బ్రహ్మాండములో వ్యాపించి ఉన్న అనంతమైన శక్తి ప్రవాహములలో ఏదో ఒక ప్రత్యేకమైన ప్రవాహమును గ్రహిస్తుంది. దీని గ్రహించే శక్తి విశేషమైన తిథులలో, వారములలో యోగములలో, ముహూర్తములలో అసాధారణరీతిలో పెరుగుతుంది. రవి–పుష్యమి, గురు–పుష్యమి, భీమవతీ సోమవతీ, శనివారం వచ్చే అమావాస్యలు, అలాగే ఇతర యోగములు,

**రోజుకి ఒక పేజి చదివినా సంవత్సరంలో 365 పేజీలు పూర్తవుతాయి.**

ముహూర్తములు సంపూర్ణ ప్రకృతిలో తమ అనుకూల అనురూప పదార్థములపై, చెట్లపై అసాధారణ రీతిలో ప్రాణశక్తి పెంపొందిస్తుంది. తేజోమయం చేస్తుంది. దీనితో పాటు మంత్ర సాధన, సమయోచిత ఆలోచనలను కలుపుకున్నట్లయితే ఆ శక్తి ప్రవాహంతో అసంభవ కార్యములు సంభవమవుతాయి. అప్పుడు దరిద్రుడు ధనవంతుడు కావచ్చు. మరణాసన్న స్థితిలోని రోగి రోగముక్తుడు కావచ్చు. మూఢుడు ప్రజ్ఞావంతునిగా పరివర్తన చెందవచ్చు. ఇందులో అణుమాత్రమైన సందేహం లేదు.

అధర్వణ మహర్షి తమ శిష్యసముదాయంతో కలసి అనేకమైన ప్రయోగాలు చేశారు. ఆయన, ఆయన శిష్యులు లెక్కలేనన్ని కలహాల కాపురాలలో మధురత నింపారు. మూఢులైన బాలకులను మేధా సంపన్నులుగా చేశారు. ఆయనకు అసాధ్యం, అసంభవం అంటూ ఏమి లేదు. ఎందువల్లంటే మహర్షి ఇచ్చే ఔషధులు, మణులు, మంత్రములు అసంభవాలను సంభవం చేసేవి. దీనులు దుఃఖితులు ఆయనలో భగవంతుడిని చూచేవారు. మహర్షికి, ఆయన శిష్యులకు పీడిత జనులలో నారాయణుడు గోచరించేవాడు. అందువల్ల అది అధర్వమహర్షి ఆశ్రమమే గాక ఆ వన ప్రాంతమంతకును, ఆర్యవర్తంలోని గ్రామాలకు, జన పదాలలో నివశించే వారికి అది ఒక తీర్థం, ఒక దేవాలయం, ఒక చికిత్సాలయం అయింది.

ఆ యుగంలో మహర్షి చేస్తున్న లోకసేవ అనేకులకు నచ్చలేదు. ఇటువంటి వారిలో సంపన్నులు, ఐశ్వర్యవంతులు, జ్ఞానులనబడేవారు, తత్వవేత్తలు ఉన్నారు. మహర్షి తత్వచింతనం నుండి ఋషి కర్మల నుండి దూరం అయ్యారని వారు భావించారు. ఆయనను మహర్షి అనడమే తప్పు అన్నారు. ఈ మాటలు విన్న మహర్షి ఏమి అనలేదు. చిన్నగా నవ్వి ఊరుకున్నారు. ఏమన్నా "నేను నా అనుసంధాన (రీసర్చ్) కార్యక్రమం "ఋషుల అర్చన లోక వందనం" చేస్తున్నాను. నన్ను ఋషి అని భావించకపోయినా పరవాలేదు. కాని నేను ఋషుల, సంపూర్ణ ప్రపంచానికి సేవకుడిని" అన్నారు. మహర్షి వినయశీలత అతని శిష్యులలో కూడా ఉన్నది. మహర్షి తన శిష్యులతో కలిసి ప్రకృతి యొక్క రాశుల, పదార్థ, ప్రాణుల, వనస్పతుల స్వరూపం, వాటి భౌతిక సూక్ష్మ సంరచనపై లోతుగా అధ్యయనం చేశారు. దీనితో పాటు ఇవన్నీ ఎప్పుడు ఎలా యోగ – సంయోగముల చే అంతరిక్షంలోని శక్తి ప్రవాహములను గ్రహించి ప్రాణవంతులయినాయి? వీటి ఉపయోగం ఏమిటి? అధర్వమహర్షిని ఆ యుగంలో జనులు స్వీకరించకపోయిన ఆయన ద్వారా రచింపబడ్డ అధర్వవేదంలోని 5987 మంత్రములలో 1696 మంత్రములు అధర్వ మహర్షి ద్వారా దర్శింపబడినవే. ఆయన ఋషి దృష్టికి స్థూలం యొక్క సూక్ష్మశక్తి స్వరూపమును, సూక్ష్మశక్తి యొక్క పదార్థ రూపము గోచరించింది. శక్తి యొక్క అనేక స్థాయిల ప్రవాహముల సూక్ష్మ అనుభూతి వాక్ఋషి కూడా పొందారు.

*– అఖండ జ్యోతి – జూలై 2009*

## భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష - 2009 స్టేట్ అవార్డ్స్

**ఇంగ్లీష్ మీడియం - 7వ తరగతి :**

| క్ర.సం. | విద్యార్థి పేరు | పాఠశాల పేరు | మార్కులు | ర్యాంక్ |
|---|---|---|---|---|
| 1 | చరిష్మా రెడ్డి D/o. జనార్ధనరెడ్డి | నారాయణ కాన్సెప్ట్ హైస్కూల్ నెల్లూరు | 95 | 1 |
| 2 | యమ్. మౌనిక D/o. బక్కయ్య | జడ్.పి.హెచ్. స్కూల్ బలరాజ్‌పల్లి కరీంనగర్ జిల్లా | 93 | 2 |
| 3 | పి. సుకన్య D/o. భాస్కర్ రెడ్డి | యమ్.సి.హెచ్. హైస్కూల్, దొడ్డపురం వీధి,తిరుపతి | 93 | 3 |

**ఇంగ్లీష్ మీడియం - 8వ తరగతి :**

| క్ర.సం. | విద్యార్థి పేరు | పాఠశాల పేరు | మార్కులు | ర్యాంక్ |
|---|---|---|---|---|
| 1 | మయూర్ S/o. సి.వి.బాలకృష్ణ | భారతీయ విద్యాభవన్ హైస్కూల్, తిరుపతి | 94 | 1 |
| 2 | పి.యస్.యల్.డి. యస్.వి. ప్రసాద్ S/o. సురేంద్రబాబు | నాగార్జున మోడల్ హైస్కూల్, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా | 94 | 2 |
| 3 | కె. హర్షిత | విశ్వభారతి హైస్కూల్, కోరుట్ల, కరీంనగర్ జిల్లా | 90 | 3 |

**తెలుగు మీడియం - 9వ తరగతి :**

| క్ర.సం. | విద్యార్థి పేరు | పాఠశాల పేరు | మార్కులు | ర్యాంక్ |
|---|---|---|---|---|
| 1 | టి. మౌనిక D/o. గోపాల్ | గౌతమ్ విద్యా మందిర్ హైస్కూల్, గోల్‌పల్లి కరీంనగర్ జిల్లా | 95 | 1 |
| 2 | యమ్. మమత D/o. మల్లేష్ | గౌతమ్ విద్యా మందిర్ హైస్కూల్, గోల్‌పల్లి కరీంనగర్ జిల్లా | 94 | 2 |
| 3 | గోవింద రాజుల రుచిక | జడ్.పి.హైస్కూల్, వానగట్ల, నిడదవోలు, పశ్చిమ గోదావరి జిల్లా. | 94 | 3 |

**90% రోగాలు ఊపిరి పీల్చుకోవడం మార్చుకుంటే పోతాయి.**

జీవించేకళ

# సమయం కూడా ఒక సంపదే-చక్కగా వినియోగించుకోవాలి

భగవంతుడు మనిషికి ఇచ్చిన విలువైన సంపద సమయం. దీనిని పెట్టుబడిగా పెట్టి ప్రతి పనిలోనూ విజయాన్ని పొందవచ్చు. సమయాన్ని సద్వినియోగం పరచుకున్న వ్యక్తికి అపజయం ఎన్నడూ ఎదురవ్వదు. కష్టేఫలి అంటే కష్టించి పనిచేస్తే విజయం లభిస్తుందన్న విషయం మనందరికీ తెలుసు. కష్టించి పనిచెయ్యడం అంటే సమయాన్ని సద్వినియోగపరచడమే.

మనిషి ఎంత కష్టపడి పనిచేసినా, తను చేసే పనిని సమయంలో చేయనట్లయితే అతని శ్రమ నిష్ఫలమవటం ఖాయం. తను ఆశించిన ఫలితం అతనికి లభించదు. రైతు పొలంలో ఎంతో శ్రమకోర్చి పనిచేస్తూ ఉంటాడు. కాని ఆ శ్రమను తగిన సమయంలో చేయనట్లయితే శ్రమకు తగ్గ ఫలితం దక్కదు. కాలంకాని కాలంలో వేసిన విత్తనాలు మొలకెత్తవు. పొలం దున్నటానికి ఒక నిశ్చిత సమయం ఉంటుంది. ఆ సమయంలో ఆ పని చెయ్యకపోతే దాని సారం వెలికిరాదు. కాలం కాని కాలంలో కోసిన పంట చేతికిరాదు. అదే విధంగా, చెయ్యవలసిన సమయంలో చెయ్యని పరిశ్రమ సాఫల్యాన్ని ఇవ్వదు.

ప్రకృతి ప్రతిపనినీ ఒక నిశ్చిత సమయంలో చేస్తూ ఉంటుంది. ఎండాకాలంలో ఎండ, వర్షాకాలంలో వర్షం, చలికాలంలో చలి, వసంతఋతువులో ప్రకృతి చెట్లన్నింటినీ పూలతో నింపుతుంది. ఈ ప్రకృతి క్రమంలో ఎక్కడ తేడా వచ్చినా ఎన్నో కష్టాలు ఏర్పడతాయి. భగవంతుడి నియమాలన్నింటిలోనూ, ముఖ్యమైనది – సమయపాలన.

మనిషి తన సమయాన్ని, శ్రమను మనస్సుని ఒకే దిశగా కేంద్రీకరించినపుడు అద్భుతమైన విజయాలు సాధిస్తాడు. ప్రపంచంలో మహాపురుషులుగా కీర్తింపబడిన వారందరూ వారి జీవితంలోని ప్రతిక్షణాన్నీ సద్వినియోగపరచుకొని ఇతరులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. ఈ విధానాన్ని అవలంభించి తన జీవిత లక్ష్యాన్ని నిర్ధారించుకున్ననాడు మనిషి తను అడుగుపెట్టిన ప్రతిరంగంలోనూ సునాయాసంగా ఉన్నతశిఖరాలను అధిరోహించగలుగుతాడు. మనిషిలో సామర్థ్యానికి కొదవ లేదు. కాని అది అస్తవ్యస్తంగా పడిఉంది. తన శక్తులన్నింటినీ ఏకత్రితం చేసి వాటిని కేంద్రీకరించిన వ్యక్తి, తన సామర్థ్యం గురించి ప్రజలకు చెప్పకనే చెపుతాడు.

విజ్ఞులు తమ పనులను ప్రణాళికాబద్ధంగా రూపొందించుకొని వాటిని తన్మయతతో పూర్తిచేస్తూ వాటి ద్వారా అనేక విజయాలు సాధించారు. సమయం భగవంతుడు మనకు ప్రసాదించిన వరం. ఈ సమయాన్ని శ్రమతో పెట్టుబడిగా పెట్టి మనం అన్ని సంపదలను సొంతం చేసుకోవచ్చు. కాలాన్ని వృథా చెయ్యడం అంటే, జీవితాన్ని వృథా చెయ్యటమే. ఎవరు ఎంతకాలం జీవించారు అని ప్రశ్నకు సమాధానం వాళ్ళ పుట్టుక నుండి మరణం వరకు ఉన్న రోజులని లెక్కించి చెప్పటం కాక వారు జీవించినంత కాలం సత్ప్రయోజనాల కోసం ఎంత సమయాన్ని వినియోగించారు అన్నదే. కాలం విలువ తెలిసిన మనిషి ఒక్క క్షణాన్ని కూడా వృధాపోనివ్వడు. తన ప్రతిక్షణాన్ని ఒకముత్యంగా, ఒకవజ్రంగా భావించి దాన్ని సద్వినియోగ పరుస్తాడు. అటువంటి వ్యక్తి జీవితంలో విజయాన్ని సాధిస్తాడు. మహామానవుడిగా కొనియాడబడతాడు.

భగవద్భక్తి కలిగిన ఒక వ్యాపారి ఒక మహాత్ముడి దగ్గరకి వెళ్ళి ఆయనను ఈ విధంగా అడిగాడు –"ప్రభూ శ్రేష్ఠమైన పనులకోసం సమయాన్ని కేటాయించడం చాలా అవసరం, కాని వాటికోసం సమయం లభించకపోతే ఏం చెయ్యాలి". ఇది విన్న మహాత్ముడు 24 గంటలకంటే ఒక్క క్షణం కూడా తక్కువ సమయాన్ని ఏ మనిషికీ ఇవ్వలేదు. అటువంటప్పుడు సమయం లభించకపోవటం మీద మీ అభిప్రాయం ఏమిటి? ఇది విన్న వ్యాపారి నిరుత్తరుడయ్యాడు. ఆ మహాత్ముడు మళ్ళీ

**ఊపిరి పీల్చుకున్నప్పుడు కడుపు బయటకు రావాలి.**

ఈ విధంగా అన్నాడు – నాకు సమయం సరిపోవట్లేదు అని నువ్వు అంటున్నావు. నిజానికి అది సమయం లభించక పోవటం కాదు, దాన్ని సవ్యంగా వినియోగించకపోవటం. అనవసరమైన పనులకు సమయం వృథా అవుతోంది. ఉపయోగకరమైన పనులు చెయ్యటానికి సమయమే మిగలటం లేదు. సమయాన్ని సద్వినియోగపరచని వ్యక్తికి, జీవితాన్ని జీవించటం చేతకాలేదు. వారు జీవితాన్ని భారంగా ఈడుస్తూ ఉంటారు. వృథా చేస్తూ ఉంటారు. ఎవరు ఎన్ని సంవత్సరాలు జీవించారు అన్నది జీవితం కాదు. ఎవరు ఎంత సమయాన్ని మంచి పనుల కోసం వినియోగించారు? ఇదే దీర్ఘ జీవితానికి (Long Life) నాంది.

కాలాన్ని దుర్వినియోగపరచడం అంటే జీవితాన్ని దుర్వినియోగపరచడమే. బద్ధకంతో, వాయిదాలువేస్తూ మనం వృథా చేసిన సమయం తిరిగి మనదగ్గరకు రాదు. జీవితపాత్రనుండి ఒక్కక్షణం ఒలికితే ఆ పాత్ర ఆ మేరకు ఖాళీ అవుతుంది. ఈ ఖాళీని ఏ విధంగానూ భర్తీ చేయలేము.

జీవితంలోని ప్రతిక్షణం ఉజ్జ్వల భవిష్యత్తుకు ఒక అవకాశాన్ని ఇస్తుంది. ఏదైనా సమయంలో అతని జీవితంలో అనూహ్యమైన మలుపులు తిరగవచ్చు. మనం వృథాగా, నిరర్థకంగా గడిపిన సమయం మనకు అదృష్టాన్ని తెచ్చిపెట్టే సమయం కావచ్చు.

ప్రతి మనిషి జీవితంలో కొన్ని అనూహ్యమైన మార్పులు తీసుకువచ్చే సమయం వస్తుంది. కాని దాని గురించి మనిషికి ముందుగా తెలియదు. అందువల్ల తెలివైన మనిషి ప్రతిక్షణాన్నీ అమూల్యమైన నిధిగా భావిస్తాడు. దానిని వ్యర్థం చెయ్యడు. ఏ క్షణాన్ని వృథా పరచనినాడు ఆ అమూల్య క్షణాలు మన చేతుల్లోంచి జారిపోవు. అవి మన జీవితంలో మనం కోరుకున్న మార్పులు తెచ్చేక్షణాలు. బద్ధకస్తుడు, ఎడతెగని ఆలోచనలు కలవాడు తనకు అనుకూలమయిన సమయం కోసం నిరీక్షిస్తూనే జీవితం మొత్తం వృథా చేస్తాడు. అతనికి అనుకూలమయిన సమయం ఎప్పటికీ లభించదు. వాయిదా వేస్తూ ఉండే వ్యక్తి ప్రతిక్షణం ఒక సువర్ణావకాశం అనీ, అది చల్లగా వచ్చివెళ్ళిపోతుందనీ గ్రహించలేడు. తనకు దొరికిన క్షణాన్నీ సద్వినియోగపరచకుండా ఫలానా సమయం నాకు కలిసిరాలేదు అని అనడం మూర్ఖత్వమే అవుతుంది.

ప్రతి మనిషి క్షణక్షణానికి గల విలువని గ్రహించాలి. జీవితంలో మనకు లభించిన సమయం పరిమితం, పని అపరిమితం. సమయాన్ని చేజారిస్తే పశ్చాత్తాపపడవలసి వస్తుంది. జీవితంలో ఏదైనా సాధించాలని అనుకున్నవాళ్ళు ఇవాళ పనిని పొరపాటున కూడా రేపటికి వాయిదా వేయకూడదు. ఇవాళ చెయ్యాల్సిన పనిని ఇవాళే చెయ్యండి. రేపటి పనిని రేపు చెయ్యండి. ఇవాళ పనిని వాయిదా వెయ్యడం వల్ల రేపు చేసే పని రెండింతలవుతుంది. ఆ పనిని పూర్తి చెయ్యడం ఒక్క రోజుతో సాధ్యం కాదు. ఈ విధంగా ఇవాళ పనిని రేపు, రేపటి పనిని ఎల్లుండి వాయిదా వెయ్యడం వల్ల పని భారం పెరుగుతుంది. దాన్ని ఏ విధంగానూ పూర్తి చెయ్యడం సాధ్యం కాదు. ఈ విధంగా వాయిదా వేసే స్వభావం పనిని సరిగా చెయ్యనివ్వదు. రేపు కూడా ఇదే విధంగా వాయిదా చెయ్యదన్న గ్యారంటీ లేదు. మందకొడితనం మందకొడితనాన్నీ, పని చెయ్యడం పని చెయ్యటాన్ని ప్రోత్సహిస్తాయి. ఇది ప్రకృతి విధానం. నిన్నటి పనిని, ఇవాళ పనితో కలిపితే మోయలేని భారంగా తయారవుతుంది. దీనిని ఏడుస్తూ, విసుక్కుంటూ ఒత్తిడిలో పూర్తి చెయ్యాల్సి వస్తుంది. ఇలా చెయ్యడం వల్ల అభ్యాసం దెబ్బతింటుంది. దీని విపరీత పరిణామం కొత్త పనుల మీద పడుతుంది. ఈ విధంగా మందకొడితనం మనిషిలో పని చేసే ఉత్సాహాన్ని, సామర్థ్యాన్ని చంపేస్తుంది.

జీవన సాఫల్యానికి పరిశ్రమ, పురుషార్థంతో పాటు సమయపాలన అత్యంత ఆవశ్యకం. మనం వృథా చేసిన సమయంలో చేయాల్సిన పనిని చేయలేకపోతాము. శ్రమ, సమయంతో జతకూడినప్పుడే సంపదగా మారుతుంది. సమయం, శ్రమతో కూడినప్పుడే సంపదని, సఫలతని అందిస్తుంది. సమయాన్ని సద్వినియోగపరిచే వ్యక్తిని శ్రమించే స్వభావం కలవాడుగా, శ్రమ చెయ్యని వ్యక్తిని బద్ధకస్తుడిగా పిలుస్తూ ఉంటారు. సమయాన్ని సద్వినియోగపరచడమే నిజమైన శ్రమ.

**గాలి వదుల్తున్నప్పుడు కడుపు లోపలికి వెళ్ళాలి.**

బద్ధకంతో, వాయిదాలతో మనం ఎంతో విలువైన సమయాన్ని వృథా చేస్తూ ఉంటాము. మనం రోజువారీ చేసే పనుల మీద దృష్టి సారిస్తే ఎక్కువ సమయాన్ని మనం బద్ధకంతో, ఒళ్ళు విరుచుకుంటూ అనవసర వాగ్వివాదాలతో, కబుర్లు చెప్పుకుంటూ వృథా చేస్తున్నామని తెలుస్తుంది. అలాంటి సమయాన్ని మన యోగ్యతలను అర్హతలను పెంచుకోవటానికి ఉపయోగించుకోవడం మంచిది. తను చేసే పని మీద లక్ష్యం ఉన్న వ్యక్తి ఒక గంటలో అన్నం, పప్పు, కూర చేసి వాటిని తినడం కూడా పూర్తి చేస్తాడు. ఇదే పనికి బద్ధకస్తుడు అరపూట గడిపేస్తాడు. ఎందుకంటే అతనికి తన పని మీద ఏకాగ్రత, ప్రణాళిక ఉండవు. చాలా మంది, ఏదో విధంగా తంటాలుపడుతూ, చిన్న చిన్న పనులు చేస్తూ తమ మొత్తం సమయాన్ని గడిపేస్తూ ఉంటారు. సమయం విలువ తెలిసిన మనిషి ఇదే సమయంలో దీనికి 10 రెట్లు పనిని పూర్తి చేస్తాడు.

ప్రెసిడెంటు లింకన్ స్నేహితుడు ఆయనతో ఇలా అన్నాడు. మీరు పెద్దవాళ్ళు అవుతున్నారు. మీరు పనిచేసే సమయాన్ని కొంచెం తగ్గించుకొని విశ్రాంతి తీసుకోండి. ఇది విన్న లింకన్ నవ్వుతూ మంచి పని చెయ్యడానికి ఇంత పరిపక్వదశను మించిన సమయం ఏముంటుంది. అంటూ తన సెక్రటరీని పిలిచి తను పనిచేసే సమయాన్ని ఇంకొక గంటకి పెంచుమని చెప్పాడు. ఒక నియమిత దినచర్యను ఏర్పాటు చేసుకొని ఆ క్రమంలో ఎటువంటి ఆటంకాల లేకుండా నిరంతరాయంగా పనిచేసేవాళ్ళు సమయపాలన వలన కలిగే లాభాలను ప్రత్యక్షంగా పొందుతూనే ఉంటారు.

– అనువాదం : లక్ష్మీసుందరి

## బడికి వెళ్ళని శాస్త్రవేత్త

*పదిహేడు మంది సంతానంలో ఒకడు. బీదరికం వల్ల బడికి రెండేళ్లే వెళ్ళి చదువు ఆపేశాడు. అలాంటి కుర్రాడు గొప్ప శాస్త్రవేత్త కాగలడంటే నమ్మగలమా? కానీ అదే సాధించాడు. బెంజమిన్ ఫ్రాంక్లిన్! అతడు అలా ఎదగడానికి కారణం ఏమిటో తెలుసా? ఎన్నో పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోగలగడం! చేసే ప్రతి పనిలోనూ శ్రద్ధ చూపడం!*

*అమెరికాలోని బోస్టన్‌లో 1706 జనవరి 17న పుట్టిన ఫ్రాంక్లిన్, రచయిత, ప్రచురణకర్త, రాజకీయ వేత్త, శాస్త్రవేత్త, సామాజిక వేత్తగా ఎన్నో రంగాల్లో ప్రముఖుడిగా ఎదిగాడు. గంపెడు పిల్లలున్న కుటుంబాన్ని పోషించడానికి కొవ్వొత్తుల తయారీని నమ్ముకున్న తండ్రి చదివించలేకపోవడంతో ఫ్రాంక్లిన్ పదేళ్ళకే బడి మానేయాల్సి వచ్చింది. అన్నయ్య ముద్రణ యంత్రంలో సహాయకుడిగా చేరాడు. అచ్చుకోసం వచ్చే ప్రతి పుస్తకాన్నీ ఆసక్తిగా చదివేవాడు. అలా సంఖ్యాగణితం, ఆల్జీబ్రా, జ్యామెట్రీ, నౌకాయానం, వ్యాకరణం, తర్క శాస్త్రాలలో పట్టు సాధించాడు. అన్నయ్య పెట్టిన వార్తా పత్రికలో ఓ మహిళ పేరుతో అతడు రాసిన లేఖలు ప్రాచుర్యం పొందాయి. అయితే అది నచ్చని అన్నయ్య కొట్టడంతో ఇంట్లోంచి పారిపోయి ఫిలడెల్ఫియా చేరుకున్నాడు. కొంత కాలానికి సొంతంగా ఓ ప్రెస్ పెట్టుకోగలిగాడు. ఓ వార్తా పత్రికను ప్రారంభించాడు. అచ్చు పనులతో రాత్రింబవళ్ళు పనిచేసేవాడు. డబ్బు సంపాదించిన తర్వాత ముప్పైఎనిమిదేళ్ళ వయసులో పరిశోధనలు ప్రారంభించారు. ఎన్నో పరికరాలను కనిపెట్టగలిగాడు. ముఖ్యంగా స్థిర విద్యుత్‌పై ఆయన ప్రయోగాలు గొప్పవిగా పేరొందాయి. మేఘాల్లో మెరుపుల ఘర్షణ వల్ల విద్యుత్ పుట్టడమే కారణమని నిరూపించగలిగాడు. గాలిపటాల ద్వారా మెరుపులలో విద్యుత్ ఉంటుందని లోకానికి చాటాడు. పిడుగుల నుంచి రక్షణ కల్పించే పరికరం కనిపెట్టినది ఆయనే. ఇంకా బైఫోకల్ అద్దాలు, క్యారేజి ఒడోమీటర్, గ్లాస్ అర్మోనికా, ఫ్రాంక్లిన్ స్టవ్ లాంటి ఎన్నో పరికరాలు కనిపెట్టిన ఆయనకు ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ పురస్కారం లభించింది. అమెరికాలో తొలి సంచార గ్రంథాలయాన్ని, తొలి భీమా కంపెనీని ప్రారంభించిన గుర్తింపు కూడా ఆయనదే. విద్యావ్యాప్తికై ఆయన స్థాపించిన అకాడమీ విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుంది కూడా.*

**ఒక్కొక్కసారి నటించేవాడికి ఎక్కువ లాభాలు వస్తాయి.**

## గాయత్రీమాత-24 శక్తిధారలు - 13

# సావిత్రి

ఆది శక్తికి రెండు ప్రవాహాలు ఉన్నాయి. 1. ఆత్మికధార 2. భౌతికధార. ఆత్మికధారను గాయత్రి, భౌతికధారను సావిత్రి అంటారు. గాయత్రి ఏకముఖి (ఒకేముఖముగలది). ఆమె ఏకాత్మవాదానికి, అద్వైతవాదానికి, ఆత్మవాదానికి ప్రతీక. సావిత్రి పంచముఖి. శరీరం పంచతత్వాలతో తయారయింది. శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము, అనే ఐదు తన్మాత్రలతో పంచేంద్రియాలకు అనుభూతి కలుగుతుంది. పంచప్రాణాల సహకారంతో చైతన్యానికి స్పందన లభిస్తుంది. జీవితాన్ని నడిపించే ఐదు తత్వాలకు, ఐదు గుణాలకు అధిష్ఠాత్రి సావిత్రి. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు కలిసి జీవన చక్రాన్ని త్రిప్పుతూ ఉన్నాయి.

సూక్ష్మ శరీరం యొక్క స్వరూపం కోశముల సామగ్రితో తయారయింది. వైజ్ఞానిక పరిభాషలో వాటిని ఫిజికల్ బాడీ, యాస్ట్రల్ బాడీ, మెంటల్ బాడీ, కాజల్‌బాడీ, కాస్మిక్ బాడీ అంటారు. ఆధ్యాత్మిక పరిభాషలో అన్నమయకోశం, ప్రాణమయకోశం, మనోమయకోశం, విజ్ఞానమయకోశం, ఆనందమయకోశం అంటారు. ఈ ఐదూకూడా అత్యంత విలువైన శరీరం అనే ఖజానాలో నిండి ఉన్నాయి. వాటిల్లో అనేక సిద్ధుల, మహత్తుల భండారాలు నిండి ఉన్నాయి. శరీరంలో నిండి ఉన్న వీటిని దేవతలు అన్నారు. ఇవి ప్రసుప్త స్థితిలో ఉన్నంతకాలం మానవుడు దీనుడుగానూ, దుర్బలుడుగానూ ఉంటాడు. ఈ దేవతలు జాగృతమానవులకు అనేక రకాలుగా సహాయం చేస్తారు. దక్షిణ మార్గ సాధనలో గాయత్రిని, వామమార్గ సాధనలో సావిత్రిని ప్రముఖంగా చెప్పుకుంటారు. కోర్కెలతో కూడిన సాధనలు సావిత్రిని గురించి చేస్తారు. ప్రయోజనానికి అనుగుణంగా బీజాక్షరాలు చేర్చడం జరుగుతుంది. ఆత్మయొక్క ఉన్నతి కోసం గాయత్రిని ఉపాసిస్తారు. గాయత్రిలో స్థూల, సూక్ష్మ, కారణ శరీరాలను బలపరుచుకునేందుకు “భూః, భువః, స్వః” అనే మూడు బీజమంత్రాలు కలపడం చేర్చడం జరిగింది. బ్రహ్మవర్చస్ సాధనలో ఈ మూడింటి సమన్వయం ఉంటుంది.

పంచముఖీ సావిత్రి యొక్క జ్ఞాన విభాగంలో జీవితంలోని అనేకరంగాలలో ఉపయోగపడే పంచశీలలు, వాటిని పాటించవలసిన విధి విధానం ఉన్నది. సామాన్యజీవితంలో శ్రమశీలత, మితవ్యయం, సహకారం, సజ్జనత్వం, ప్రవర్తనా తీరులెన్నులను పంచశీల అంటారు. భిన్న భిన్న వర్గాలవారికి, భిన్న భిన్న ప్రయోజనాల నిమిత్తం భిన్న భిన్న పంచశీలలు ఉంటాయి. వాటిని పాటించడం వల్ల కోరుకున్న రంగంలో పనులు నెరవేరుతూ ఉంటాయి. పంచశీలయే పంచదేవతలు.

గాయత్రి యొక్క ధారలలో అన్నింటికన్నా దగ్గరగా ఉండేదీ, ఎక్కువగా సామర్థ్యం కలదీ సావిత్రి. రెండింటికి అవినాభావ సంబంధం ఉంది. ఇద్దరి మధ్య భేదమే లేదు. చాలామంది రెండు ఒక్కటే అని నమ్ముతారు. సావిత్రి శరీరం అయితే గాయత్రి ఆత్మ. భౌతిక ప్రయోజనాలకోసం సావిత్రిని, ఆత్మిక ప్రయోజనాల కోసం గాయత్రి ఆరాధించడం జరుగుతుంది. అవసరాన్ని బట్టి కోరిన లబ్ధిని పొందడానికి తగు సాధన చెయ్యాలి.

★★★

## మానవత్వానికి గుర్తింపు

*స్వామి వివేకానంద ఒకసారి అమెరికాలోని ఒక వీధిగుండా నడచిపోతున్నారు. ఆయన కాషాయపు దుస్తులు ధరించి ఉన్నారు. అతని వేషధారణ చూచిన వారికి అవహేళనగా అనిపించింది. అవాకులు చవాకులు ప్రేలుతూ ఒక గుంపు ఆయన వెనుకనే నడువసాగింది. పరిస్థితిని గమనించారు స్వామీజీ. ఆగి వెనుకకు తిరిగారు. “మిత్రులారా! మీ దేశంలో దుస్తులను బట్టి వ్యక్తిత్వాన్ని గుర్తిస్తారు కాబోలు. మా భారతదేశంలోనైతే వ్యక్తి చరిత్రను బట్టి వ్యక్తిత్వాన్ని గుర్తిస్తారు.” అని గంభీరస్వరంతో సున్నితంగా చెప్పారు. ఆయన వాక్కులో ఏ శక్తిదాగున్నదో కాని గుంపు వెనుదిరిగిపోయింది. చిరునవ్వుతో స్వామి ముందుకు సాగిపోయారు.*

**గృహస్థాశ్రమంలో సేవా సాధన చెయ్యాలి.**



మహిళా జాగరణ

# నారీ అభ్యుదయం - అరుణోదయం

ప్రకృతి యొక్క అనుపమ కళాకృతి స్త్రీ. సృష్టియొక్క వికాసక్రమంలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైనది. అసలు మానవునికి జన్మను ప్రసాదించునది స్త్రీ మూర్తియే! సౌందర్యం, దయ, మమత, ప్రేమ, త్యాగం, సమర్పణ మున్నగు అన్ని అంశాలకూ స్త్రీ సజీవమైన ప్రతిరూపంగా భావించబడుతోంది. ఇన్ని దైవీగుణాలు కలిగియున్న కారణంచేతనే వేదకాలంనుండి నేటి ఆధునికకాలం వరకూ ఆమె ప్రాముఖ్యత స్థిరంగా నిలచిఉంది. మేఘాచ్ఛాదితమైన మధ్యకాలమూ, భోగపూరితమైన నేటి ఆధునికసమాజం కూడా ఎన్నోవిధాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ఆమె ప్రాముఖ్యతను ఏమాత్రమూ తగ్గించలేకపోయాయి. ప్రతీయుగంలోనూ స్త్రీ యొక్క ప్రతిభాపాటవాలవల్ల, వ్యక్తిగతంగానేకాక, దేశం, ప్రపంచంకూడా లాభాన్వితమౌతూనే ఉన్నాయి. అభివృద్ధి పథంలోనూ, నిర్మాణంలోనూ స్త్రీ యొక్క పాత్రను ఎన్నటికీ మరచిపోలేం.

వేదకాలం స్త్రీ చరిత్రకు స్వర్ణయుగం వంటిది. ఆరోజులలో స్త్రీని ఆదర్శానికి ప్రతిరూపంగా చూచేవారు. విద్యకు అధిష్ఠాన దేవతగా సరస్వతీని, ధనానికి లక్ష్మీదేవినీ, శౌర్యపరాక్రమాలకు దుర్గనూ, సౌందర్యానికి రతీదేవిని, పవిత్రతకు గంగనూ ప్రతీకలుగా భావించడం జరుగుతోంది. ఈ యావత్ సృష్టిని పర్యవేక్షించే శక్తియొక్క ప్రకృతి కూడా స్త్రీ రూపంలోనే చిత్రీకరించబడింది. డాక్టర్ రాజకిశోర్‌సిన్హాగారు తాను వ్రాసిన ప్రాచీన భారతీయ కళ మరియు సంస్కృతి అనే గ్రంథంలో స్త్రీ ఔన్నత్యాన్ని వర్ణిస్తూ ఇలా అన్నారు. మమతలకు మంజూష (పెట్టెవంటిది), స్నేహానికి సదనం, దయకు మూలస్థానం, క్షమాగుణంలో మేరుపర్వతం, విధాత యొక్క కళాపూర్ణమైన సృష్టికి శృంగారమూర్తి, పృథ్వియొక్క కవిత, దేశనిర్మాణానికి ఆధారశీలమైనది. లక్ష్మి, పార్వతి, సరస్వతీ ఈ ముగ్గురుమూర్తులకూ సమానమైనటువంటి స్త్రీకి ఈ భారతభూమిలోనే కాదు, యావత్ప్రపంచంలో కూడా ఆదరణీయమైన స్థానం ఉంటూనే ఉంది.

వైదికకాలంలో లేదా ప్రాచీన భారతదేశంలో స్త్రీలు ఎంతో ఉన్నతస్థాయి విద్య అభ్యసించేవారు. అందుచేత వారిపట్ల ఎంతో గౌరవం ఉంటూఉండేది. యజుర్వేదంలో స్త్రీని సంబోధిస్తూ ఈ విధంగా చెప్పబడిఉంది. “ఓ స్త్రీ! నీవు స్తుతింపదగిన, ఉత్తమమైన, ఆదరణీయమైన, పూజనీయమైన కమనీయమైన, చంద్రుని వలె ఆహ్లాదం కలుగజేయుదానవు. శ్రేష్ఠమైన శీలం చేత నీ దైవీగుణాల ప్రకాశవంతం చేత అజ్ఞానాంధకారాన్ని దూరం చేయగలిగినటువంటి దానవు. నీవు దీన, హీన భావాలు లేనిదానవు.” స్త్రీని గురించిన ఈ దివ్యమైన వర్ణన ఆమె యొక్క శ్రేష్ఠత్వాన్ని సూచించే ఒక మచ్చుతునక. వేదమంత్రాలపట్ల అభిరుచి, వాటిని గురించి తెలుసుకొనవలెననే కుతూహలం కలిగియుండుటచేత, స్త్రీని యజుర్వేదంలోనే ‘సోమపృష్ఠా’ అని సంభోదించడం జరిగింది. డాక్టరు ఉపేంద్రఠాకూరు తాను వ్రాసిన సాహిత్యం – సంస్కృతి అనే పుస్తకంలో ఈ సత్యాన్ని ఎంతో చక్కని రీతిలో ధృవీకరించారు. ఆయన అభిప్రాయాన్ననుసరించి అత్రిమహర్షి కుటుంబానికి చెందిన విశ్వవార మంత్రద్రష్టగా ప్రఖ్యాతిగాంచింది. కక్షీవాన్ మహర్షి యొక్క పుత్రికయైన ఘోషా ఋగ్వేదంలోని రెండుమండలాలనూ, అగస్త్యమహర్షి యొక్క ధర్మపత్నియైన లోపాముద్ర రెండు ఋక్కులనూ రచించినట్లుగా చెప్పబడినది. అసంగమహారాజు భార్య రాణీ శాశ్వతి, బ్రహ్మావాదిని అపాల కూడా ఈ యుగంలో ప్రఖ్యాతిచెందిన తత్త్వవేత్తలు.

వైదికయుగంలో విదుషీమణులకు లెక్కలేదు. వారి ప్రఖరపాండిత్యం, అఖండమైన ప్రతిభలను గూర్చిన పలు విషయాలు సవివరంగా మనకు లభిస్తాయి. సులభ అను విదుషీమణి ఆకాలంలోనే ప్రఖ్యాతిగాంచిన మహిళ, వక్తృత్వకళలో ఆమె విశేషమైన ప్రావీణ్యం గడిచింది. ఆమెయేగాక, శ్రద్ధ, సరమ, రోమాశ, యమి, అదితి మున్నగు స్త్రీ–ఋషికలు వేదాలయొక్క నిగూఢమైన రహస్యాలను సాక్షాత్కరింపజేసుకొన్నారు. ఆధ్యాత్మికజ్ఞానాన్ని కలిగియుండుటతోపాటు, ధార్మిక, సాంఘికరంగాలలోకూడా వారికి పురుషులతో సమానమైన ప్రతిపత్తి ఉండేది. యజ్ఞాలలో నైతే వారి సహభాగిత్వం తప్పనిసరి.

**సంతోషం సగం బలం.**

డాక్టరు వాసుదేవశరణ అగర్‌వాల్‌గారి వాక్కుల ననుసరించి 'స్త్రీ-పురుష' లిరువురూ నదికి రెండు తీరాల వంటివారు. అనగా తీరాలు రెండూ ఒకదానితో నొకటి అనుసంధానించబడిఉన్నట్లు, స్త్రీ-పురుషు లిరువురి జీవితాలూ ఒకదానితో ఒకటి జోడింపబడి ఉంటాయి. ఇరువురి మధ్యా జీవితమనే ప్రవాహం సాగుతూ ఉంటుంది. వైదిక సాహిత్యంలో స్త్రీ-పురుషులను భూమి ఆకాశాలతో పోల్చినారు. ముత్యపుచిప్పలోని రెండు దళాలమధ్య ముత్యం ఉన్నట్లుగా, స్త్రీ-పురుషుల మధ్య సంతతి ఉంటుంది. ఆ విధంగా పతి-పత్ను లిరువురూ పరస్పరపూరకాలుగా ఉంటారు. ప్రకృతి స్త్రీకి సంతానోత్పత్తి చేయడమనే విశిష్టగుణాన్నిచ్చి, సృష్టిలోని సమస్త జీవులలోనూ ఒక ప్రత్యేకతను ఆపాదించింది.

కుటుంబంలోని గానీ, సంఘంలోనిగానీ స్త్రీ యొక్క పాత్ర, పురుషునితో సమానంగా ఉండేది. కన్యాదాన సమయంలో తల్లియొక్క ఉపస్థితి తప్పనిసరిగా భావించబడుతుండేది. స్త్రీ తల్లిగానూ, గృహిణిగానూ, సహచరిగానూ చూడబడుతుండేది. గృహిణి రూపంలో గృహనిర్వహణ ఆమెయే నిర్వహిస్తూ ఉండేది. పతివ్రతయైన స్త్రీని దేవతాస్వరూపంగా గౌరవించేవారు. స్త్రీకిగానీ, పురుషుడికిగానీ తమతమ ఇష్టానుసారం వివాహం చేసుకునే స్వతంత్రం ఉండేది.

రామాయణకాలంలో స్త్రీని వివిధరూపాలలో చిత్రించడం జరిగింది. అహల్య, సీత, తార, మండోదరి వంటి మహిళామణుల కారణంగా ఆ యుగం ప్రత్యేకతను సంతరించుకున్నది. ఆనాటి సమాజంలో స్త్రీశిశువు జన్మించింది అంటే ఎంతో శుభంగా భావించబడుతుండేది.

శుభకార్యాలలో అవివాహితమైన కన్యల ఉనికి తప్పనిసరిగా ఉండేది. ఇక కన్యాదానం చెయ్యడమంటే మహాపుణ్యకార్యమే! స్త్రీలకు లౌకికమైన, నైతికమైన విద్యలతోపాటు రాజనైతిక నైపుణ్యాన్ని కూడా బోధించేవారు. స్త్రీలు సంగీతం, నృత్యం మున్నగు పలుకళలలో నిష్ణాతులుగా ఉండేవారు. కౌసల్యాదేవి మంత్రసహితంగా ఆహుతులు వెయ్యడమూ, సీత సంధ్యోపాసన చెయ్యడమూ, తారాదేవి మంత్రాలలో నిష్ణాతురాలు అన్పించుకోవడమూ మొదలైన పలు అంశాలు రామాయణంలో మనకు తారసపడతాయి. కైకేయి యుద్ధవిద్య అభ్యసించి, దశరథ మహారాజును యుద్ధసమయంలో రక్షించింది. ఆ రోజులలో పలు సందర్భాలలో స్త్రీల శౌర్యపరాక్రమాల గురించిన వివరణ మనకు లభిస్తోంది.

రామాయణకాలంలోని స్త్రీల విషయంలో శాంతాకుమార్ వ్యాస్ ఈవిధంగా వ్రాస్తున్నారు. 'ఆ కాలంలో స్త్రీల పరిస్థితి శుభకరంగా ఉండేది. అప్పటి పరిస్థితులననుసరించి స్త్రీని ఒక కన్యగా, పత్నిగా, మాతగా, విధవగా... ఏ స్థితిలో ఉన్నాసరే ఆమెకు సమకూర్చవలసిన సమస్త సౌకర్యాలను ఏర్పరచి, ఎంతో గౌరవంగా చూసేవారు. అధికారాన్నిచ్చి ఆదరించేవారు. అందువల్ల ఆమె కుటుంబంలో, సంఘంలో, దేశంలోనూ సంస్కృతిక పురోగతికి అమూల్యమైన కృషిని చేయగల్గేది. స్త్రీత్వమునకు ఆఖరుమెట్టు మాతృత్వంగా ఆదికవి వాల్మీకి అభివర్ణించారు. మానవుని వ్యక్తిత్వ నిర్మాణానికి సూత్రధారణి తల్లియే, తండ్రికాదు.

మహాభారత కాలంలో కూడా స్త్రీ యొక్క సమృద్ధి, ప్రగతి స్పష్టంగా దృగ్గోచరమౌతోంది. మహాభారతంలోని అనుశాసన పర్వంలో భీష్మపితామహుడు స్త్రీని ఎల్లప్పుడూ పూజనీయురాలిగా భావిస్తూ స్త్రీల పట్ల స్నేహపూర్వకమైన ప్రవర్తనను కల్గియుండుట ఎంతో అవసరం అని అన్నాడు. స్త్రీలను పూజించి గౌరవించినచోట దేవతలు నివసిస్తూంటారు. స్త్రీలు లేని ప్రదేశాలలో అన్ని కార్యాలు నిష్ఫలం అయిపోతాయి. స్త్రీని దైవీగుణ సంపన్నురాలిగా వర్ణించడం జరిగింది. పత్ని-భర్తయొక్క సగభాగంగా భావించబడింది. భర్తకు ఈ ప్రపంచంలో అందరికన్నా ముఖ్యమైన స్నేహితుడు భార్యయే అని నిర్ణయించడం జరిగింది. మూడురకాలైన ధర్మ అర్థ కామములకు ఆమెయే మూలంగా భావించిబడింది. దుఃఖమును దాటడానికి ఒకేఒక్క ఆసరా భార్యామాత్రమే! భార్యను కూడిఉంటేనే భర్తకు గౌరవమూ, ఆనందమూకూడ! ప్రియమైన మాటలను మాట్లాడుతూ, జనశూన్యమైన ప్రదేశాలలో భార్య-భర్తకు స్నేహితునివలె వ్యవహరిస్తుంది. ధార్మిక కార్యక్రమాలలో తండ్రి వలె సలహాలను ఇస్తూ ఉంటుంది. ఆ రోజులలో వివాహితులైన స్త్రీలకు సన్యాసం స్వీకరించేటందుకు అధికారం ఉండేది. సావిత్రీ, దమయంతి, గాంధారి, ద్రౌపది, సత్యభామ, సుభద్ర మొదలైనవారు ఆనాటి

**సంతోషానికి సత్సంగం కన్నా మించినది లేదు.**

పతివ్రతామణులు. స్త్రీకి సౌశీల్యమే ఆభరణంగా భావించబడేది. భార్యకు భర్తతో సమానంగా అన్ని అధికారాలు లభించేవి. ఆ కాలంలో స్త్రీని గృహలక్ష్మిగా భావించి, సమస్తమైన సుఖసమృద్ధులకు చిహ్నంగా భావించేవారు, గౌరవించేవారు. సమాజంలో సత్యవతి, కుంతి, ఉత్తర మొదలైనవారికి విశిష్టస్థానాలు లభించినట్లుగానే, విధవలకు మంచి గౌరవాభిమానాలు లభించేవి.

మహాభారతకాలం తరువాత మౌర్యులవంటివారి కాలంలో స్త్రీ యొక్క విద్వత్తుకూ, పాండిత్యానికీ పలు ఉదాహరణలు లభిస్తున్నాయి. గుప్తులకాలంలో కూడా స్త్రీలయొక్క పాండిత్యాన్ని గురించిన వర్ణన మనకు లభిస్తుంది. వాత్స్యాయనుడు తన కామసూత్రాలు అనే పుస్తకంలో కుటుంబగౌరవానికి, ప్రతిష్టలకు సంబంధించిన కొన్ని అవసరమైన పనులను స్త్రీలు నిర్వహించవలసి ఉంటుందని కూడా వ్రాశారు. ఆ రోజులలో స్త్రీ విద్యపట్ల తగినంత ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. శీలాభట్టారిక అనే మహావిద్వాంసురాలు ఆ కాలంనాటి స్త్రీయే! భోజులు తాను వ్రాసిన సరస్వతీకంఠాభరణంలో శీలాభట్టారికను సిద్ధహస్తురాలైన పాంచాలిరీతి ప్రయోక్తగా భావించారు. శూద్రకుడు మృచ్ఛకటికం అనే నాటకంలో ప్రఖ్యాతిగాంచిన సంగీతజ్ఞులను పరిచయం గావించాడు. చంద్రగుప్త విక్రమాదిత్యుని కుమార్తె ప్రభావతి కూడా ఒక ప్రఖ్యాత విదుషీమణి. ఆ కాలంలో పరదావిధానం అమలులో ఉండేదికాదు. ఆరోజులలో స్త్రీలు సార్వజనీనమైన అన్ని ఉత్సవాలు, కార్యక్రమాలలో పాల్గొనేవారు. నారద, పరాశరస్మృతులలో స్త్రీకి పునర్వివాహం సమంజసమే అని సమర్థించబడి ఉంది.

రాజపుత్రుల కాలంలో స్త్రీల పరిస్థితి దృఢంగానూ, శక్తివంతంగానూ ఉండేది. అవసరమైనప్పుడు వారి అస్త్రశస్త్రాలను ధరించి రణరంగంలో పోరాటానికి సంసిద్ధమయ్యేవారు. ఎడారివంటి రాజస్థాన్‌ప్రాంతం ఆకాలంలో స్త్రీల శౌర్యపరాక్రమాలకు నిలయంగా ఉండేది. స్త్రీలు మంచి వ్యక్తిత్వం, సౌశీల్యం కల్గి పతీవ్రతలై ఉండేవారు. వారు మహమ్మదీయ దురాక్రమణదారుల నుండి తమ సతీత్వాన్ని, పాతివ్రత్యాన్ని కాపాడుకోడానికి జౌహరు వ్రతాన్ని ఆచరించేవారు. ఆ సందర్భంగా ప్రఖ్యాత విద్వాంసుడు రాధాముఖర్జీ తాను వ్రాసిన "భారతదేశపు సంస్కృతీ కళలు" అనే పుస్తకంలో జౌహరు గురించి వ్రాశారు. రాజపుత్ర చరిత్రలో జౌహరు కు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. యుద్ధాలలో పరాజితులైన, మరణించిన రాజపుత్రుల భార్యలు, కొందరు సామాన్యస్త్రీలు ఆత్మాహుతి చేసుకునేవారు.

భాస్కరాచార్యుని పుత్రిక లీలావతి గణితశాస్త్రంలో మహామేధావి, అదేవిధంగా రాజశేఖరుని పత్నియైన అవంతీదేవి కూడా శ్రేష్ఠురాలైన కవయిత్రిగా పేరుగాంచింది. ఆ కాలంలోనే కాశ్మీరరాణి, కాకతీయుల రాణీ రుద్రాంబ మొదలైన శాసకులు కూడా ఉన్నారు. రాణీదుర్గావతి శౌర్యపరాక్రమాలకు ప్రతీక! స్త్రీలలో ఆత్మబలిదానం చేయవలెననే భావం అన్నింటికన్నా ప్రథమంగా ఉండేది.

ఈ మధ్యకాలంలోనే జరిగిన స్వాతంత్ర్యపోరాటంలో స్త్రీలు నిర్వహించిన పాత్ర తక్కువైనదేమీకాదు. స్వాతంత్ర్య సంగ్రామసమయంలో ఆత్మాహుతి చేసిన వీరాంగన లక్ష్మీబాయి వారిలో ప్రథమురాలు. దేశబంధు సి.ఆర్.దాస్‌గారి పత్ని వాసంతీదేవి, సోదరి ఊర్మిళాదేవి స్వాతంత్ర్యపోరాటంలో తమ వంతుపాత్రను నిర్వహించారు. ఊర్మిళాదేవి సత్యాగ్రహ పోరాటపు కమిటీకి అధ్యక్షురాలిగా ఉండి, గాంధీగారితోపాటు నవకాళీ సంఘటనలో పాల్గొన్నారు. ఉక్కుమనిషి సర్దార్‌పటేల్‌గారి కుమార్తె మణిబెన్‌పటేల్ కూడా సజీవత్యాగమూర్తియే. లీలావతీదేవి స్త్రీవిద్యా సేవసంఘమును స్థాపించి, సాహిత్యాన్ని స్థాపించడంలో విశేషమైన కృషిసలిపారు. శ్రీ అరవిందులవారి సోదరి సరోజినీదేవి, బిస్మిల్లాగారి సోదరి శాంతాదేవి, దుర్గాబాయి మొదలైన వారందరూ స్వతంత్రపోరాటమనే యజ్ఞంలో తమ సర్వస్వాన్నీ ఆహుతిచేశారు.

21వ శతాబ్దం స్త్రీ శతాబ్దం అనే జెండాలు అన్నింటికన్నా ఎత్తుగా ఎగురవేయగలిగే సమయం దగ్గరలోనే ఉంది. స్త్రీని చేయిపట్టి ముందుకు తీసుకుని పోగలిగిన మహాకాలుని హుంకారమే ఇది!

ఈనాడు స్త్రీ జీవితంలో తాను బంధవిముక్తురాలు కాగలిగే అదృష్టంతోపాటు, ఇతరులకు కూడా బంధవిముక్తి చేయగలిగే గౌరవనీయమైన బాధ్యత కూడా విధాత ఆమెకు అప్పగించాడు.

*– అఖండ జ్యోతి 1998, అక్టోబర్*

*అనువాదం : కృష్ణకుమారి*

**ఇతరుల కష్టాలకు కరిగిపోయే వారే సాధు సజ్జనులు.**

# అమృతత్వ విద్య

పరమపూజ్య గురుదేవులు 21వ శతాబ్ది ఉజ్జ్వల భవిష్యత్తు తీసుకువస్తుందని, పృధ్వి స్వర్గంగా మారుతుందని, దాని కొరకు మనమందరం మన వంతు ప్రయత్నం మనం కూడా చెయ్యాలని నిర్దేశిస్తూనే ఉన్నారు. పృధ్విపై 84,00,000 జీవరాశులున్నాయని చెప్పారు. పృధ్వి స్వర్గంగా మారాలంటే ఈ జీవ రాశులలో ఒకడైన, సృష్టికి మకుటాయమానంగా చెప్పబడుతున్న మానవుడు దేవతగా మారాలి. దేవతలను అమరులంటారు. అమరులు అంటే మరణం లేనివారు. కనుక మనిషి అమరత్వాన్ని సాధించుకున్నప్పుడు, దేవతగా మారినప్పుడు స్వర్గీయ వాతావరణము ఏర్పడుతుంది.

"గయాంత్రాయితి గాయత్రి" అంటే ప్రాణాలను రక్షించేది గాయత్రి. గాయత్రి సాధకుడు ప్రాణశక్తిపై పట్టుసాధించుకోవాలి. అమృతత్వం సాధించుకోవాలి. అమరుడు కావాలి.

గాయత్రీ మంత్రం అంటే ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్ మనకందరికి తెలిసినదే. దీనితోపాటు అజపా గాయత్రి అంటే జపంతో సంబంధంలేనటువంటి గాయత్రి. శ్వాసకు సంబంధించినటువంటి సాధన. ఈ అమృతత్వ సాధనలో గాయత్రి మంత్రంతో పాటు శ్వాసను ఉపయోగించుకోవాలి.

గురుతత్వాన్ని మించిన ఆధ్యాత్మిక శక్తి ప్రపంచంలో లేదు. గురుతత్వాన్ని పట్టుకునే ప్రయత్నం చేయాలి. భౌతిక జీవితంలో రకరకాల బాధలు ఉండవచ్చు. బాధలను వదిలించు కోవటానికి గురువులను పట్టుకుంటాం తప్ప అసలు నువ్వు తప్ప నాకు ఇంకా ఏమి అక్కర్లేదు అనే మాట అనం. ఆయనను పట్టేసుకుంటే అసలు కష్టాలే రావు. గురుతత్వం అమృతత్వ విద్య నేర్పుతుంది. అమృతత్వవిద్య అంటే మృత్యువు మీద ఆధిపత్యం.

అమెరికాలో ఉన్నటువంటి వారిలో అనేక రోగాలు డాక్టర్లు ఇచ్చిన మందుల వల్ల వచ్చినవేనని వారి రిసర్చి పేపర్లు చెబుతున్నాయి. డాక్టరు దగ్గరకు వెళ్ళకపోతే ఆ రోగం వచ్చేది కాదేమో. గ్యాస్ట్రిక్ సమస్యలు, పెరాలిసిస్, కీళ్ళనొప్పులు, బి.పి ఇవేవి రోగాలు కాదు. మనస్సులో ఉన్న దోషాలవల్ల, తప్పుడు ఆలోచనలవల్ల వస్తున్నాయి. వత్తిడి వల్ల, స్ట్రెయిన్ వల్ల బి.పి. వస్తుందంటారు. వత్తిడిలో స్ట్రెయిన్‌లో ఎలా పడకుండా ఉండవచ్చో డాక్టర్లు చెప్పలేరు. కాని ఈ విద్యవల్ల యోగులు చెప్పగలరు.

**మూకం కరోతి వాచాలం పంగుం లంఘయితే గిరిం**
**యత్కృపా తమహం వందే పరమానంద మాధవం (భ.గీత)**

కుంటివాళ్ళు నడవటం మొదలుపెట్టారు. గుడ్డి వాళ్ళకి చూపువస్తుంది. మన గురువులు అంతా అలా చేసినవాళ్ళే అమెరికాలో కూడా ఉన్నారు. పి.పి క్వింబే అతని పేరు. ఊతకర్రల మీద ఆయన దగ్గరకు వచ్చి, ఊత కర్రలు అక్కడ పడేసి నడుచుకుంటూ వెళ్ళేవారు. ఈ విద్యను నేర్చుకోవటానికి నాకు 20 సంవత్సరాలు పట్టింది అన్నాడాయన.

మృత్యువును దాటేటువంటి ఈ అమృతత్వ విద్యను పూర్ణిమ నాడే నేర్చుకోగలరు. ఇంకా ఈ సాధనకు శుక్రవారం, జన్మనక్షత్రం ముఖ్యమైనటువంటి రోజులు, ఈ సాధన ప్రతిరోజు చేసుకోవాలి. నిత్యకర్మలాగా చేసుకోవాలి. నిత్యకర్మ అంటే రోజూ స్నానం ఎలా చేస్తామో అలా చెయ్యాలి. రోజు ఒక అరగంట చేస్తే చాలు. **శ్వాసను గమనించుకుంటూ గాయత్రి మంత్రజపం చేయాలి.** అన్నింటికన్న ముఖ్యం ఈ విద్య నేర్చుకోవాలనే తపన, రెండోది విశ్వాసం.

ఒక చదువు రానివాడు, ఒక డాక్టరు, ఒక ఇంజనీరు ఉన్నారు. చదువు రాని వాడికి ఏ ఆలోచనా విధానం లేదు. ఇంజనీరు ఇంజనీరులాగా ఆలోచించే విధానం నేర్చుకున్నాడు. డాక్టరు డాక్టరులాగా ఆలోచించే విధానం నేర్చుకున్నాడు. కనుక డాక్టరు రోగాలను నయం చేయగలుగుతున్నాడు. ఇంజనీరు బిల్డింగ్స్ కట్టగలుగుతున్నాడు. చదువు రానివాడు ఏ విధంగాను ఆలోచించడం నేర్చుకోలేదు కనుక ఏమీ చేయ్యలేకపోతున్నాడు. ఒక డాక్టరు అవటానికి 20 సంవత్సరాలు పడుతుంది. మరి చనిపోయిన వారిని బ్రతికించే అమృతత్వవిద్యకు ఎన్ని సంవత్సరాలు పడుతుంది? దానికి ఒక విశేషమైన ఆలోచనా విధానం ఉన్నది. దానిని పట్టుకోవాలి. ప్రపంచంలో ప్రతి ఐదుగురిలో ముగ్గురు ఈ విద్యనేర్చుకునే స్థాయిలో ఉన్నారు.

**సాటివారికి సేవ చేయడం నిన్ను నీవు సేవించుకోవడమే.**

పదార్థజగత్తు పరమాణువులతో నిర్మాణం చేయబడ్డది. అన్ని పరమాణువులు ఒక లాగా ఉండవు. ఈ పరమాణువులు నెమ్మదిగా ఖనిజ జగత్తునుండి వృక్ష జగత్తుకు వెళ్తాయి. వృక్ష జగత్తులో కాల్షియం, మెగ్నీషియం కణాలుగా ఉండకుండా ఒక ఆకారంగా ఒక ఆకులాగా ఏర్పడతాయి. మర్రిఆకు ఒకలాగా ఉంటుంది. వేపాకు ఇంకొకలాగా ఉంటుంది. ఆకారాలలో మార్పేగాని అదే క్లోరోఫిల్, ఆ కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్ ఉంటుంది. కేవలం ఆకృతి మారింది. ఈ ఆకృతిలోపాటు ఒక విశేషమైన సంవేదన కనిపిస్తుంది. ప్రేమించేటటువంటి గుణం చెట్లకు కూడా ఉన్నది. ఇంకా అవి ఎప్పుడు సూర్యుని వైపు తిరిగి ఉంటాయి. వెలుగువైపు చూస్తుంది. ఈ లక్షణాన్ని ఋషులు ఉపయోగించుకుంటారు. భావసంవేదనలు ఎంత తీవ్రంగా ఉంటే అంత బాగా రోగనివారణ చేయగలుగుతారు.

మానవజాతిలో ఈ అనుభూతి, ప్రేమ తగ్గిపోయి రకరకాల రోగాలు వస్తున్నాయి. ప్రకృతి దగ్గరగా వెళ్ళగలగాలి. కాయగూరలు ఎక్కువగా తింటే రోగనివారణ అవుతుంది అంటారు. ఇదీ కారణం. కాని ఈ రోజులలో చెట్లను కొట్టేస్తున్నారు. కనుక చెట్లను నాటాలి. చెట్లను పెంచాలి. ప్రతి ఇంట్లో తులసి మొక్క పెంచటం చాలా మంచిది. తులసికి ఇవ్వాల్సిన గౌరవం, ప్రాధాన్యత ఇస్తే మృత్యువుని కూడా దాటవచ్చు. తులసి తీర్థం పూర్వకాలం ఇందుకు పోసేవారు. చనిపోయే సమయంలో తులసి తీర్థం పోస్తే లేచి కూర్చునేవారు. కాని ఈనాడు తులసిని ఉపయోగించుకునే టెక్నిక్ లేదు. కనీసం తులసిని పెంచుదాం.

వృక్షజగత్తు తరువాత జంతుజగత్తు. జంతుజగత్తులో మనస్సు యొక్క ఆవిర్భావం జరుగుతుంది. ప్రేమ వేరు, మనస్సు వేరు. మనసున్నవాడు ప్రేమించలేడు.

వైద్యశాస్త్రం కొరకు, మందులు కనిపెట్టటం కొరకు జంతువుల మీద పరిశోధనలు చేస్తూ లక్షలాది జంతువులను చంపేస్తున్నాము. లక్షలాది జంతువులను చంపగా తయారయిన మందు మన బాధను తగ్గించవచ్చు. కాని ఆ ప్రాణులు పడిన బాధ యొక్క మొత్తం వైబ్రేషన్స్ (స్పందనలు) ఆ మందులో ఉన్నాయి. అవే మనను సైడ్ ఎఫెక్ట్స్‌గా పీడిస్తున్నాయి. అందువల్ల వేరే ఒక వైద్య విధానాన్ని కనిపెట్టాలి. వైద్యవిధానమే యోగవిద్య. యోగులు ఉంటే డాక్టర్లు అక్కర్లేదు. డాక్టర్లు నయం చేయలేనటువంటి వ్యాధులు యోగుల దగ్గర తగ్గటం చూస్తున్నాము. అదికూడా ఒక విశుద్ధమైన వైజ్ఞానిక విధానమే. కాని దానిని ఒక చమత్కారం, ఒక మ్యాజిక్ అంటుంటాం. గురువులు చేస్తున్నటువంటి వైజ్ఞానిక ప్రక్రియ తెలియకపోవటం వల్ల మనం అలా అనుకుంటుంటాం. మొత్తం యోగవిద్య ఒక సెంటెన్స్‌లో చెప్పాలంటే – నువ్వు మనస్సు ఆధీనంలో ఉన్నావా లేక మనస్సు నీ ఆధీనంలో ఉన్నదా? మనిషి మనస్సు యొక్క ఆధీనంలో ఉంటే యోగికాలేడు. మనస్సు వంశంలో ఉంటూ ఖచ్చితంగా యోగి కాగలడు. **మనస్సును ఎలా లొంగదీయాలంటే ఒక టైమ్‌టేబుల్ వేసుకొని, ఆ టైమ్‌టేబుల్‌ని బలవంతంగా అమలుపరచడమే. ఒక గంట జపం చేద్దామనుకుంటే ఒక గంట జపం చేయటమే.** శరీరం, మనస్సు మనం అనుకున్నట్లు ఉండాలి తప్ప వాటికి అనుగుణ్యంగా మనం మారకూడదు.

ఈనాడు మనం జీవిస్తున్న జీవితం చర్మం బయట ఉన్నటువంటి జీవితం. చర్మం లోపల ఏముందో తెలియదు. ఎప్పుడైతే చర్మం బయట ఉన్న జీవితాన్ని పట్టించుకోకుండా లోపలికి వెళ్ళి వెన్నెముక ఆధారంగా జీవించడం మొదలుపెట్టారో, అక్కడ ఉన్న పంచ చక్రాలలో (మూలాధారం, స్వాధిష్ఠానం, మణిపూరకం, అనాహతం, విశుద్ధి) ఉన్నటువంటి సవ్యమైన జీవితం జీవిస్తారు. పంచపాండవులవలె జీవిస్తారు. చర్మం బయట జీవించేవారు కౌరవులు. **రాత్రి పడుకునేముందు ప్రశ్నించుకోవాలి. "నేను ఈ రోజు కౌరవులవలె జీవించానా? పాండవుల వలె జీవించానా?" కౌరవులు అంటే కోరికలకు బానిస కావడం.** ఒక ఉదాహరణ "ఇవాళ ఉపవాసం ఉంటాను" నీరసం వచ్చేసింది. తినేస్తావు. కౌరవుడివి అయిపోయావు. 5 మాలల గాయత్రి చేసుకుందామని మొదలుపెట్టి మూడు మాలలతో ముగించావు. కౌరవుల వంశంలో చేరిపోయాము. ప్రతిరోజు చూచుకోవాలి. చర్మం మీద జీవిస్తున్నామా? వెన్నెముక మీద జీవిస్తున్నామా? **చర్మం మీద జీవించడం అంటే కోరికలకు బానిస అవడం, మనస్సుకి లొంగిపోవడం. వెన్నెముక మీద జీవించడం అంటే అనుకున్నది చేయడం.** కాని మన పనులు ఇతరులను బాధపెట్టకుండా ఉండాలి.

**ప్రతిరోజు ఒకేలాగా జీవించాలి. ఆధ్యాత్మిక జగత్తులో ఇది ఒక ప్రముఖమైన నియమం, అమృతత్వ విద్యకు మూలాధారం.** ప్రతి రోజు ఒకే సమయానికి నిద్రలేవడం, ఒకే సమయానికి

**వికసించని పూలు సుగంధాన్ని ఇవ్వవు. వికసించని మానవులు జ్ఞానాన్ని ఇవ్వలేరు.**

నిద్రపోవడం, ఒకే టైమ్‌కి ఒకే చోట జపం చేసుకొనడం, ప్రతిరోజు ఒకే సమయంలో స్వాధ్యాయం వగైరా. ఈ చక్రీయ గమనం చాలా ముఖ్యం. సృష్టిలో ప్రతీది చక్రీయగమనమే. జీవజంతువులన్నీ సూర్యుడి మీద ఆధారపడి ఉంటాయి. ఒక్క మనిషి జీవితం మాత్రమే సూర్యుని మీద ఆధారపడి ఉండదు. కాని అలా చేసుకోవాలి.

**శ్వాస :** సుఖంగా ఉన్న, కష్టాలలో ఉన్న, ఆనందంగా ఉన్న ఆడుతున్న, పాడుతున్న నిద్రపోతున్నా పుట్టినప్పటి నుండి చివరి క్షణం వరకు జరిగే నిరంతర ప్రక్రియ శ్వాస.

కొంచెం ప్రాక్టీసు చేస్తే ఇది సహజశ్వాసగా మారుతుంది. సహజశ్వాస అంటే చిన్న పిల్లలశ్వాస చూస్తే తెలుస్తుంది. శ్వాస తీసుకుని వదిలేటప్పుడు పొట్ట పైకి క్రిందకి కదులుతుంది. ఈ శ్వాసే ఆధ్యాత్మిక జగత్తుకు ప్రవేశం. శ్వాస చిన్న పిల్లల శ్వాసలాగా ఉండాలి. మానసిక స్థితి కూడా చిన్న పిల్లల వలె ఉండాలి. అంటే నిష్కపటంగా ఉండాలి. జీసస్‌క్రైస్ట్ అంటారు. **Be like children and enter the kingdom of Heaven** చిన్నపిల్లలవలె ఉండండి స్వర్గప్రవేశం చేయండి, చిన్నపిల్లలకు కోపం ఉండదు. ద్వేషం ఉండదు. అలా ఉండాలి యోగ సాధకుడు. గురువుగారు దీనికి ఒక సూత్రం ఇచ్చారు.

**"హర్‌దిన్ నయాజన్మ్, హర్ రాత్ నయీమౌత్"**
**ప్రతిరోజు కొత్త జన్మ, ప్రతిరాత్రి కొత్త మృత్యువు**

ప్రతి రోజు కొత్త జన్మ ప్రతి రాత్రి కొత్త మృత్యువు అని భావించినపుడు ఆ మధ్యనున్న కాలాన్ని మంచి పనులకు వినియోగించుదామనే ఆలోచన సహజంగా ఉంటుంది. ఎలాగు చనిపోతున్నాను చేసేదేదో మంచి చేద్దాము, ఇతరులతో ఉదారంగా ఉంటాను. ఇతరులకు సహాయం చేయడం స్వాభావికంగా జరుగుతుంది. ఇలాంటి పరిస్థితులలో ఇంకా కోపానికి, ద్వేషాలకి అసూయలకు తావెక్కడుంటుంది. ఇలా జీవించటం వల్ల మనిషి దేవతగా మారతాడు.

చాలా ముఖ్యమైన విషయం ఏమిటంటే ఊపిరి పీల్చుకునే విధానం పూర్తిగా మార్చుకోవాలి. మనలో ఉన్నటువంటి అనేక రోగాలు ఊపిరిపీల్చుకోవడం మార్చుకుంటే పోతాయి. దీనిని ప్రాణయామం అనడం లేదు. దీర్ఘ శ్వాస అనవచ్చు. దీర్ఘశ్వాస అంటే ఊపిరి పీల్చుకుంటున్నప్పుడు పొట్ట బయటకు రావాలి. శ్వాస వదులుతున్నప్పుడు పొట్ట లోపలికి వెళ్ళాలి. దీనిని నిరంతరం ప్రాక్టీసు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుంది. మనస్సుకు స్థిరత్వం వస్తుంది. ఇంకా ఎన్నోలాభాలు కలుగుతాయి. దీనితో పాటు గాయత్రీ మంత్రం మీద నిష్ఠాతులు కావాలి. ఇది ఆచరణలోకి వస్తే మృత్యువును దాటేయగలరు. చనిపోయిన వాళ్ళను బ్రతికించగలరు. ఇది మాక్సిమం మినిమమ్ మీరు, మీ కుటుంబం సుఖంగా ఉంటారు.

యోగస్థితికి ఎదగటానికి ఏది అవసరమో అది తీసుకోవాలి తప్ప అనవసరమైనవి అడగకూడదు. కోరికలు కోరడం తప్పుకాదు. కాని ఈనాడు అవసరమైనవి కోరుకుంటున్నారు. పక్కింటి వాడు కారు కొన్నాడు. అందువల్ల నాకూ కావాలి. ఒక ఫ్రెండ్ మేడ వేశాడు. నేను వేయాలి. ఇలాంటి కోరికలవల్ల కష్టాలు వస్తున్నాయి. సమస్యలన్ని మనం తెచ్చిపెట్టుకున్నవే. అందుచేత కష్టాలు పోవాలంటే దృష్టిని శ్వాసమీదకు మార్చుకోండి. లోతుగా గాలి పీల్చుకోవడం మొదలుపెడితే సమస్యలు తీరిపోతాయి. ఇలా ఒక సంవత్సరం చేసుకుంటే అసలు చావు రాదు. ఎవరిని ఏమి అడగక్కరలేదు. ఉద్యోగాలు చేయనవసరం లేదు. అన్ని సంపత్తులు మీ దగ్గరకు వస్తాయి. అలవాట్లు ఏమి మార్చుకోనక్కరలేదు. నిరంతరం దృష్టి శ్వాస మీద ఉంచుకుని పనులు చేసుకుంటూ ఉండాలి. అప్పుడు అనుకున్న పనులు అన్ని జరిగిపోతాయి. రోగగ్రస్తుడు శ్వాస మీద దృష్టి పెట్టుకుంటే వాడి రోగం పోతుంది. ఉద్యోగం లేనటువంటి వారు దృష్టి శ్వాసమీద పెట్టుకుంటే ఉద్యోగం లభిస్తుంది. పెళ్ళిగాని పిల్లలకు పెళ్ళి అవుతుంది. మనస్సును శ్వాసతో లగ్నం చేసుకుని జీవితం జీవిస్తుంటే ఏదనుకుంటే అది జరుగుతుంది.

అందువలన అమృతత్వం సాధించుకోవాలనే లక్ష్యంతో గాయత్రి సాధన చేసుకుంటూ, ఒక టైము టేబుల్ వేసుకుని దాని ప్రకారం పనులు చేసుకుంటూ తద్వారా మనస్సును ఆధీనంలో తెచ్చుకుంటూ, మనస్సును వెన్నెముక మీద నిరంతరం లగ్నం చేసుకుని జీవితం జీవించటం వలన అమృతత్వం సిద్ధిస్తుంది. ఇటువంటి వారితో నిండిన పృధ్వి స్వర్గంగా మారుతుంది. పరమ పూజ్య గురుదేవుల కల నెరవేరుతుంది.

★★★

**అందరినీ ఆదుకో - దయతో దగ్గరకు చేర్చుకో.**

నావారితో నామాట : 2011 - 2012 శతాబ్ది సంవత్సరం

# జన్మశతాబ్దికి ఇంకా 253 రోజులు మాత్రమే ఉన్నాయి

## మన వ్యక్తిత్వ పరిష్కారానికి నిర్దేశాలు

జన్మ శతాబ్ది ప్రయాజ (ముందు) సంవత్సరంలో ఏమేమి చెయ్యాలో ఏప్రిల్, మే నెలలో వివరంగా చెప్పబడింది. ఈ సమయం చాలా మహత్వపూర్ణమైనది. రాబోయే 7 నెలలు చాల ముఖ్యమైనవి. ఈ సమయం "శతాబ్ది సంవత్సర శ్రద్ధాంజలి సమారోహం" మనము ఎలా చేస్తామో అనేదాన్ని నిర్ధారిస్తుంది. అందువల్ల ఈ సంవత్సరం కేంద్రీయ జోనల్ క్షేత్రాల కార్యకర్తలకు "వ్యక్తిత్వ పరిష్కార్" ట్రైనింగ్‌కు ప్రాముఖ్యత ఇవ్వబడింది. కుంభమేళ పూర్తి అయిన వెంటనే దీని శుభారంభం శాంతికుంజ్‌లో చేయబడింది. ఈ మాసము గాయత్రి జయంతి పావనపర్వము. ఈ సందర్భమున సీనియర్ కార్యకర్తల ద్వారా ప్రాప్తించే గురుదేవుల అమృతవచనములను అర్థం చేసుకోవాలి. దీనిపై ఒక వివేచన ఈ సంచికలో

పరమపూజ్య గురుదేవుల జీవనములో నిరంతర శిక్షణ అతి మహత్వపూర్ణమైనది. ఆయన తనను తాను అన్నిరకముల ఆకర్షణలనుంచి, పబ్లిసిటి నుంచి దూరంగా ఉంటూ వ్యక్తిత్వాన్ని కంచుకోటలాగా మలచుకోవడంలో నిమగ్నమయ్యారు. ఆయన తమ గురుదేవుల నిర్దేశం ఆధారంగా చేసిన కఠోర తపశ్చర్య "యుగనిర్మాణ యోజన" స్వరూపం దాల్చింది. ఇది ఆయన తపశ్చర్య ఫలమే. దీనికి మూలం వారి తీవ్ర సంకల్పమే కారణం. వారు ఒక ఆదర్శ శిష్యులయ్యారు. తపోనిష్ఠులయ్యారు. వేదమూర్తులయ్యారు. ఇవి ఆయన సిద్ధించుకున్నవి. ఆయన పొందినదానిని తమ శిష్యులకు, అంగ అవయవములు అనబడే ప్రతినిధులకు కూడా పాలుపంచారు.

ఒక వంక ప్రేమ, ఒక వంక మార్పు అనే విధానంతో అనుభూతిపరమైన శిక్షణను గురుదేవులు అందరికి అందించారు. ఒక సంస్థను ఈ విధంగా తయారుచేయవచ్చు అని చేసి చూపించారు. సంస్థకు ఎరువు, నీరు ఏ విధంగా ఇవ్వాలి? సంస్థలో లోక సేవకులను కలపడం ఏ విధంగా చేయాలి? జూన్ 1, 1990 గాయత్రి జయంతి నాడు స్థూల శరీరమును విడిచి మహా సమాధి స్థితి తీసుకుని, మన అందరి మధ్య సూక్ష్మకారణ శరీరములతో వ్యాపక స్థితిని పొంది అఖిల విశ్వగాయత్రీ పరివార్‌కు ఆధారమయ్యారు. గురుదేవులు అందించిన ఆ శిక్షణ యొక్క ముఖ్య అంశములు అర్థం చేసుకోవాలి.

### తమ అంగ అవయవాలకు ఒక స్పష్టమైన నిర్దేశం

పరమపూజ్య గురుదేవులు తమ అంగ అవయవములకు వ్రాసిన లేఖను ప్రతిరోజు చదవమని చెప్పారు. తమ సంకల్పంతో ప్రభావితమైనవారు విశ్వాసంతో వాటిని చదవటమే గాక జీవితంలో వాటిని పాటించాలని గురుదేవులు కోరుకున్నారు. కార్యకర్తల ఆలోచనలు ఎలా ఉండాలి? ఆచరణ ఎలా ఉండాలి? నిత్య జీవితం ఎలా ఉండాలి? అనేది ఈ లేఖలో వివరంగా చెప్పారు.

### అంగ అవయవముల బాధ్యత

గురుదేవులు ఇలా వ్రాశారు – నా మనోభావములను వ్రాసేది నా మూడు వేళ్ళు అయినప్పటికి ఈ తయారవుతున్న ప్రణాళికను ఈ వేళ్ళు, కాగితం, కలము క్రియాన్వితం చెయ్యలేవు. ఈ బాధ్యత కార్యకర్తలందరిపై ఉన్నది. మేనేజ్‌మెంటులో మహత్వపూర్ణ సూత్రం ఏమిటంటే "డెలిగేటింగ్ ది పవర్" అంటే బాధ్యతలను పంచడం. పరమపూజ్య గురుదేవులు ఈ బాధ్యతను తమ శిష్యులందరికి పంచారు. వారు తమకిచ్చిన బాధ్యతలను నెరవేర్చాలి. నిష్క్రియంగా కూర్చోకూడదు. గురుదేవుల అంగ అవయవములు ప్రణాళికను క్రియాన్వితం చేసే బాధ్యతను

**కలసి మెలసి జీవించడం బలం - కలియబడడం బలహీనం.**

తమ భుజస్కంధాలపై తీసుకొనకపోతే వారికి ఏమీ ఉపయోగం, లాభం ఉండదు.

అంగ అవయవములు ఎవరు? గురుదేవుల విరాట్ జ్ఞాన శరీరంతో జోడించబడిన ప్రతి ఒక్కరు వారి అంగ అవయవములే. కార్యకర్తలు, అఖండ జ్యోతి, యుగశక్తి గాయత్రి పాఠకులు, మిషన్ యొక్క అన్ని ప్రణాళికలతో ఏదో విధంగా కలపబడి ఉన్న సాధారణవ్యక్తులు, పుస్తక మేళ నుంచి ఎక్జిబిషన్‌లలో గురుదేవుల వ్యక్తిత్వంతో ప్రభావితమైన వారందరు. ఇంకా శాంతికుంజ్, గాయత్రీ తీర్థం, బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్, దేవసంస్కృతి విశ్వవిద్యాలయం, గాయత్రీ తపోభూమి, అఖండ జ్యోతి సంస్థాన్, ఆవల్‌ఖేడా యుగతీర్థం, భారతదేశంలో, విదేశాలలో నాలుగు వేల కన్నా ఎక్కువ ఉన్న ప్రజ్ఞాసంస్థానాలలో ఎటువంటి అనుభూతి పొందిన వారైనా గురుదేవుల అంగ అవయవములే. శరీరంలో వేళ్ళు, పాదములు, నాడులు, మాంస కోశికులు ఇంకా ఎన్నో ఉంటాయి. ఇవన్నీ కలిపితే శరీరం తయారవుతుంది. పరమ పూజ్య గురుదేవులు ప్రజలను తమ శరీరంలోని కణాలుగా భావిస్తారు. దీక్ష పొందిన వారు, మంచి ఆదర్శములు, మంచి కోరికలు గలవారు వారి అంగ అవయవములే. వారు ఆ లేఖలో ఇలా అన్నారు. ''ఈ ప్రణాళికను మస్తిష్కం, హృదయముల కణముల, అణువులు వ్రాస్తున్నాయి. వ్రాయడమే కాదు దీనిని పూర్తి చేసే పడుగుపేకలను అల్లుతున్నాయి. ఎటువంటి పరిస్థితులలోనూ ఈ పని ఆగదు. రక్తంలోని ప్రతికణం, మస్తిష్కంలోని ప్రతి గుణముతో పాటు అదృశ్య దైవీసత్తాకూడా దీనితో సక్రియంగా ఉన్నది.

### నిమిత్త మాత్రంగా పనిచేయాలి

ఈ నిర్దేశము అతి మహత్వపూర్ణమైనది. ప్రణాళిక స్వరూపం పూర్తిగా తయారయింది. ఏమి చెయ్యాలి. ఎలా చెయ్యాలి అనే ఆవేదన అవసరం లేదు. మనం శ్రీకృష్ణ భగవానుడు చెప్పింది గుర్తుంచుకోవాలి. "నిమిత్త మాత్రం భవసవ్యసాచిన్" (కౌరవ వీరులందరిని నేను ముందరే చంపేశాను. నీవు నిమిత్తమాత్రుడవై యుద్ధం చెయ్యి – గీత 11/33). ప్లాన్ పూర్తి అయి తీరుతుంది అనే విశ్వాసం ఉంచుకోవాలి. అనుమానాలకు తావివ్వద్దు. ఈ సమయంలో ఎలా జరుగవలసి ఉన్నదో అదే జరుగుతున్నది. అది గుర్తుంచుకోండి.

ప్లాను ఏమిటి? దాని స్వరూపం ఎలా ఉంటుంది. యుగ నిర్మాణ యోజన, విచార క్రాంతి అభియాన్ ప్లాను చాలా పెద్దది. దీని పేరు గొప్పదే. ''యుగపరివర్తన'' ఈ శబ్దములలోని రకరకాల భావార్ధములను గ్రహించిన వారు ధన్యులవుతారు. రకరకాల ప్రణాళికలు తయారవుతాయి కాని అవి లౌకికపరమైనవి. ఈ ప్లాన్ పై వానిది, పరమాత్మది, ప్రపంచాన్ని పూర్తిగా మార్చటానికి, ప్రజల ఆలోచనలలో పరివర్తన తీసుకురావడానికే ఈ ప్రణాళిక. పరమపూజ్య గురుదేవులు ఆ స్థాయిలో జీవించారు. వారు 1943లో గాయత్రీ తపోభూమి నిర్మాణం తర్వాత సత్యయుగ పునరాగమనం యుగనిర్మాణ మిషన్ ద్వారా జరుగుతుందని ఉద్ఘాటించారు. యుగపరివర్తన కొరకు చేసే ఈ కార్యక్రమంలో లక్షల, కోట్ల మంది యోగదానం కావాలి. ఒక వర్గం వారిని మార్చడం కాదు. ఒక రాష్ట్రాన్ని మార్చడం కాదు. ప్రపంచాన్నే మార్చివేయాలి. ఇది జరిగితీరుతుంది. అనేకమంది మేధావులు దీనిలో పాలుపంచుకుంటారు. ఈ యుగపరివర్తన కార్యక్రమాలలో పాలుపంచుకునే వారికి భగవంతుని అనుగ్రహం సహజంగానే లభిస్తుంది. శ్రేయస్సు కొరకు ఆలోచించకండి. పని పూర్తి అయ్యేటట్లు చూడండి. ఈ రకం శిక్షణను గురుసత్తా యొక్క అనాసక్తి కర్మయోగ శిక్షణ అనవచ్చు. కర్మయొక్క వేగం అప్పుడే తీవ్రతరం అవుతుంది. యుగనిర్మాణం వంటి అసంభవం అనిపించే కార్యం సంభవమవుతుంది.

పూజ్య గురుదేవులు తమ అంగ అవయవములకు ఇలా చెప్తారు. "ఇచ్చిన ప్రణాళిక ఆధారంగా యుగపరివర్తన యొక్క విభిన్న సోపానములను ఎక్కాలి. అందుకొరకు దీనిని అనేక మార్లు చదవాలి. తమ భూమికను అర్థం చేసుకోవాలి. జీవనశైలి తదనుసారంగా మార్చుకోవడం తప్పనిసరి." ఎందుకు? ఎందుకంటే సర్వాధిక మహత్వపూర్ణ యోగదానం అంగ అవయవములదే అవుతుంది. మీ శ్రమ, సమయం,

**పాము కన్నా ప్రమాదకరం - పరుల ధనం.**

వనరులు, యోగ్యతలు ఈ ప్రణాళికలో పూర్తిగా ఉపయోగపడాలి. స్వార్థపరమైన లక్ష్యాలలో మునిగిపోకండి. మనం ఒక మాటను తప్పని సరిగా గుర్తుంచుకోవాలి. మనమందరం కలసి ఈ పంక్తులు వ్రాస్తున్న శ్రీరామశర్మ ఆచార్య అనే మహాపురుషుని వ్యక్తిత్వాన్ని నిరూపించాలి. అలా చేసినపుడే మనం వారి శరీరంలో కణాలమవుతాము. ఇటువంటి గొప్ప శ్రేయస్సు పొందటానికి మన జీవనశైలి ఆ మహా పురుషుని జీవనశైలి వలె ఉండాలి. అలాంటి బ్రాహ్మణత్వం, అలాంటి నిరాడంబరత, అలాంటి విశాల అంతఃకరణ, అలాంటి కరుణ తెచ్చుకోవాలి. ఈ బాధ్యత తీసుకొగలరా అని ఆయన అడుగుతున్నారు. మనం జవాబు ఇవ్వాలి.

ఈ యుగనిర్మాణ కార్యక్రమం ఎలా పూర్తి అవుతుంది? దీనిని మనం ఎలా పూర్తి చేయగలమనే ప్రశ్నలు మనస్సులో ఉదయించవచ్చు. ఇల్లు కట్టాలంటేనే ఎంతో శ్రమను చేయవలసి వస్తుంది. యుగపరివర్తన అనే మహాకార్యంలో ఎన్ని సాధనములు కావాలి. ఎంతో మంది మేధావుల సహాయోగం కావాలి. ఎవరు చేయగలరు ఈ పనిని? పూజ్య గురుదేవులంటారు "దీనిని గురించి మీరు దిగులు పడనక్కరలేదు. పని అప్పచెప్పినవారే దానికి కావలసిన సాధనములను ఏర్పాటు చేస్తారు. ఎవరు ఎంత ఎక్కువ శ్రమ చేయగలరు, ఎవరు ఎంత బాగా సమర్పణ చేయగలరో అనే దానిపై పోటీ పడండి".

### అత్యధిక శ్రమ - సంపూర్ణ సమర్పణ

ఇది వారి నిర్దేశము, గీతా సారం యొక్క మూల స్వరము. విరాట్ స్థాయిలో సరంజామను చేరుస్తున్న ఆ గురు సత్తా ఈ పని పూర్తి చేస్తుంది. ఇది ఐతిహాసికమైన మహత్వపూర్ణ సమయం. ఇలాంటి క్షణాలు లక్షల సంవత్సరాలకి ఒకటి రెండు సార్లు లభిస్తాయి. మనం ఆదర్శముల క్షేత్రంలో ఒకరికంటే ఇంకొకరు ముందుండే ప్రయత్నం చేయాలి. **రెండే ముఖ్యమైనవి. అధికాధిక శ్రమ, అనన్యభావంలో చేసిన సమర్పణ.** ఇది ఆచరణలో పెట్టిన వారికి పరమసత్తా యొక్క విశేష కృపకు యోగ్యత కలుగుతుంది. గురుసత్తా అందించిన వనరులను ఉపయోగించి సమర్పణ భావంతో ఈ పనిని నిర్వహించాలి. ఈ మహత్వపూర్ణ నిర్దేశముల మిగిలిన భాగం గురుసత్తా వాక్యాలలో వచ్చే సంచికలో మీ ముందుంటుంది. ఇదే వ్యక్తిత్వ పరిష్కార ప్రశిక్షణ యొక్క ఇరుసు అవుతుంది.

★★★

## శారీరిక శ్రమ చేయటం అన్నివిధాల అవసరం

*మహాత్మా గాంధీ దక్షిణాఫ్రికా నుండి తిరిగి వచ్చారు. తన సంపదనంతా సామాజిక కార్యాల కోసం ఇచ్చివేయాలన్న దృఢనిశ్చయంతో వచ్చారు. తన సంబంధీకులను, నలుగురు కుమారులను సమావేశపరచారు. విషయాన్ని వివరించారు. పుత్రుల చేత సంతకాలు తీసికున్నారు. ఇప్పుడు గాంధీ పూర్తిగా నిరుపేద అయ్యారు.*

*విధవరాలైన సోదరి నుండి లేఖవచ్చింది. పాపం ఆమెకు కూడా విధవరాలైన ఏకైక కుమార్తె ఉన్నది. ఇరువురు కూడా గాంధీ గారి మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ఆయన సర్వసంగ పరిత్యాగంతో వారు మరీ అనాథలైపోయారు.*

*"అన్నయ్యా! ఇప్పుడు మేము పొరుగువారి దగ్గర పిండివిసిరి జీవిస్తున్నాము. మాకేదైనా ఆధారం చూపించు" అని వ్రాసింది.*

*వెంటనే మహాత్ముడు చెల్లెలికి సమాధానం వ్రాశాడు. చెల్లీ పిండి విసిరి జీవించటం ఏ రకంగా చూచినామంచిదే. శరీరారోగ్యం చక్కబడుతుంది. మూడు పూటలా కడుపునిండుతుంది. మేము కూడా ఇక్కడ పిండి విసురుతూనే ఉన్నాము. ఇష్టమైతే మీరిద్దరూ కూడా ఇక్కడకు రావచ్చు. నాతోకలసి శ్రమించవచ్చు. ప్రజాసేవ చేయవచ్చు. అందరం కలిసే జీవిద్దాం. అంతేకాని నా ద్వారా వేరే సహాయం అర్థించటం వ్యర్థం. ప్రజాసేవలో నేను, నావారు అన్న బంధానికి తావేలేదు.*

**శీల నిర్మాణం చేసి మనిషికి ఉన్నతిని కలిగించేదే విద్య.**

## దేవ సంస్కృతి విశ్వవిద్యాలయము - 3

# భారతదేశ ప్రాచీన విశ్వవిద్యాలయాలు

ప్రాచీన భారతదేశములో రెండు ప్రముఖ విశ్వవిద్యాలయాలు ఉండేవి. అవి తక్షశిల, నలందా. ఇవి రెండూ కూడా ప్రపంచ ప్రఖ్యాతి గాంచినవి. ఆ రోజుల్లో ఇప్పుడున్న రవాణా సౌకర్యాలు లేవు. విమానాలు లేవు. రైళ్ళు, బస్సులు లేవు. అసలు సరైన రోడ్లు కూడా ఉండేవి కావు. అయినా సరే అనేక మంది విదేశీయులు అతి కష్టం మీద అనేక అడ్డంకులను దాటుకుంటూ ఈ విశ్వవిద్యాలయాలలో చదువుకోవటానికి వస్తుండేవారు. ఈనాడు ఉన్న ప్రచార సాధనాలు (న్యూస్ పేపర్, రేడియో, టీవీ, ఇంటర్నెట్) ఏమీ కూడా లేనప్పటికీ భారతదేశము యొక్క ఆధ్యాత్మికత విద్య ఆనోట ఈనోట అలా అలా విశ్వమంతా ప్రాకిపోయింది. భారతదేశములో మనుష్యులను దేవతలుగా మార్చే విద్య ఉన్నది అని ఓ అద్భుత ప్రభ ప్రపంచమంతటా వ్యాపించింది.

అసలు భారతదేశము ఎక్కడున్నదో కూడా తెలీయకుండా భారతదేశానికి వెళ్ళాలి అనేటటువంటి ఆకాంక్షతో బయలుదేరిన అనేక మంది విదేశీయులు కొత్త కొత్త దేశాల్ని కనిపెట్టారు. మొట్టమొదట కొలంబస్ రాదల్చుకున్నది అసలు భారతదేశానికే. ఎక్కడో స్పెయిన్ నుండి బయలుదేరి అప్పటి వరకు వాళ్ళకు తెలియనటువంటి భూభాగానికి సముద్రయానము ద్వారా చేరి అక్కడ సస్యశ్యామలతను చూసి అదియే భారతదేశము అనుకొన్నాడు. అదే తర్వాత అమెరికాగా మారినది. భారతదేశము కాకపోయినా భారతదేశము అనుకొన్నదానికే (అమెరికా) అంత విలువ ఉంటే, నిజమైన భారతదేశము ఎంత గొప్పదో ఊహించుకోవచ్చు. ఈ ఒక్క ఉదాహరణ చాలు భారతదేశము యొక్క ఆధ్యాత్మిక విద్య యొక్క గొప్పతనాన్ని తెలుసుకొనటానికి. విదేశాలలో ఉన్నటువంటి వ్యక్తులు తమ ప్రాణాలు ఇవ్వటానికి సిద్ధపడి భారతదేశమునకు ప్రయాణం అయేవారు. అతి క్లిష్టమైన సముద్ర మార్గము, అత్యంత దుర్గమైనటువంటి హిమాలయ మార్గము దాటుకుని ఇక్కడకు రావాలని ప్రయత్నించేవారు. దీనికి కారణం ఇక్కడి విద్యలో ఉన్నటువంటి గొప్పదనం, ఇక్కడ నివసించేటటువంటి వ్యక్తుల యొక్క స్థాయి, ఇక్కడ సంచరించేటటువంటి ఋషులు, మునులు, అనేకానేక గురువుల యొక్క సత్తా, వారి గొప్పదనము, వారి వాక్కు యొక్క ప్రభావము. "భారతదేశములో ఉన్న సద్గురువులు సర్వసమర్థులు, అసంభవాల్ని సంభవాలుగా తృటిలో మార్చివేయగల శక్తిమంతులు" అన్న వార్త వ్యాపించి సుదూర ప్రాంతాలలోని అనేకమందికి తెలియటమే కాక అత్యంత విశ్వాసాన్ని కూడా కలగచేసాయి. ఇటువంటి విద్యలు నేర్చుకోవడానికి ఎక్కడెక్కడి నుండో విద్యార్థులు వచ్చేవారు. విద్యాభ్యాసము అయిన తర్వాత విద్యార్థులు తాము నేర్చుకున్న అద్భుత విద్యలను తమ దేశములోని వారికి నేర్పి వారిని కూడా ఉచ్చస్థితికి తీసుకురావడానికి తిరిగి తమ తమ దేశాలకు వెళ్ళేవారు. ఈ భారతీయ విద్యల గురించి తెలుసుకొనే ముందు పూర్వపు విశ్వవిద్యాలయాల గురించి తెలుసుకుందాం.

పురాణాల కాలంలో దాటిన తరువాత గురుకుల వ్యవస్థ విస్తరించి విశ్వవిద్యాలయాలుగా పరిణమించటం గమనించవచ్చు. తక్షశిల, ఉజ్జయిని, నలంద, వారణాసి, వల్లభి, అజంత, మధుర, విక్రమశిల మొదలైనవి చాలా ప్రసిద్ధమైనది. ఇవి కాక కాంచి, అమరావతి మొదలైన ప్రదేశాలలో ఏర్పాటు అయిన విస్తృతమైన విద్యావ్యవస్థ దేశ దేశాల నుంచి విద్యార్థులను ఆకర్షించేవి.

గురుశిష్యుల అనుబంధమే ప్రధానంగా బోధన జరిగిన ప్రాచీన విశ్వవిద్యాలయాలు మన చరిత్ర సంస్కృతికి దర్పణాలు. విద్యాదానం మహాదానం అన్న సూక్తిని పాటించి మనసా, వాచా, కర్మణా విద్యార్థి సంక్షేమమే సమాజ సంక్షేమంగా బోధించే ఆచార్యుల (ఉపాధ్యాయులు) ఆనాటి జాతి జీవన నిర్మాణంలో నిజమైన కర్తలు. ఆనాడు ఆచార్యులకు సంఘంలో ఉన్న గౌరవ మర్యాదలు ఎనలేనివి. విద్యాలయాలపై ప్రభుత్వాధిపత్యం ఉండేది కాదు. తమకు మంచి అని తోచింది ఆచార్యులు విద్యార్థులకు బోధించడానికి స్వాతంత్ర్యం ఉండేది. ఈనాటి విద్యా విధానములో గురువుకుకానీ, శిష్యునకు కానీ ఈరకమైన స్వేచ్ఛ కనిపించదు.

*(సశేషం)*

**మనస్సును జయించిన వాడే ప్రపంచాన్ని జయించగలుగుతాడు.**

# 29.4.2010 నుండి 7.5.2010 శాంతికుంజ్, హరిద్వార్ నందు జరిగిన 9 రోజుల సంజీవని సాధనా శిబిరముపై ఒక సమీక్ష

ఆంధ్రప్రదేశ్ గాయత్రీ పరివార్ కొరకై శాంతికుంజ్, హరిద్వార్‌లో 29.4.2010 నుండి 7.5.2010 వరకు తెలుగు భాషలో 9 రోజుల సంజీవని సాధనాశిబిరము నిర్వహించబడినది.

శిక్షణా శిబిరము 29.4.2010 శుక్రవారము ఉ॥ 8.30 గంటలకు దక్షిణ భారత విభాగ ప్రధాన సంచాలకులైన డా॥ బ్రిజ్ మోహన్ గౌర్ జీ మరియు దక్షిణ భారత సంచాలకులైన శ్రీ అశ్విని సుబ్బారావు గార్లు దీప ప్రజ్వలము గావించి గాయత్రీ మంత్రోచ్చారణ, గురువందనతో ప్రారంభమైనది. శ్రీ అశ్విని సుబ్బారావు గారు, డా॥ గౌర్ జీ గార్లు ప్రసంగిస్తూ పూజ్య గురుదేవులు వేదమూర్తి, తపోనిష్ఠ యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ గారి సందేశాన్ని ఈ రీతిగా వివరించారు.

మిమ్ములను పూజ్య గురుదేవులు ఎన్నుకొని యుగనిర్మాణ కార్యక్రమములో భాగస్వాములను చేయుటకై శాంతికుంజ్‌కు రప్పించారు. మాతృగర్భములో 9 మాసములు ఏవిధముగా మీరు పెంచబడిరో అదే విధముగా గాయత్రీ మాత ఒడిలో ఈ 9 రోజులు ప్రేమతో సంజీవని విద్యను నేర్పెదరు. తక్కువ మాటలాడి ఎక్కువ నేర్చుకొనండి. గురుదేవులు మాతాజీలు మీచే అమృతాన్ని త్రాగించుతారు. దివ్య ప్రాణ చేతనత్వమున్న ఈ తీర్థ రాజ అనుశాసనాన్ని పాటించి, సమయపాలన జిహ్వాచాపల్యాలను నియంత్రించుకొని అమరత్వ దిశగా అడుగులు వేయండి. వ్యక్తిత్వ వికాసాన్ని పొందాలి.

మధ్యాహ్నం గం॥ 2.30 ని॥లకు క్లాసులో శ్రీ పరమానంద ద్వివేదిగారు ప్రసంగిస్తూ "మిమ్ములను మానవులస్థితి నుండి మహామానవులుగా తదుపరి దేవమానవులుగా మార్చెడి లక్ష్యదిశగా ఈ శిబిరము నిర్వహించబడుచున్నది. ఇచ్చట అందించెడి జ్ఞానాన్ని అందిపుచ్చుకొనుటకై అహంకారమును వీడి పాత్రతను పెంచుకొనండి." అని ఉద్భోదించారు. సాయంత్రము 6.30 గం॥లకు సంగీతముతో పాటు "సంజీవని విద్య" వి.సి.డి.ని ప్రదర్శించిరి.

30.4.2010 న ఉ॥ 8.30 గం॥ శ్రీ పి.శర్మగారు గురుదేవుల జన్మశతాబ్ది ప్రాముఖ్యతపై వివరించారు.

మధ్యాహ్నం 3.30 క్లాసులో శ్రీమతి ఉషాజైస్వాల్ గాయత్రి ఉత్పత్తిని, ప్రత్యేకతల గురించి వివరిస్తూ "భారతీయ సంస్కృతికి గాయత్రి తల్లి, యజ్ఞము తండ్రి. గాయత్రి అనెడి పరశువేది మనలో ప్రవేశించిన మనలోనున్న కాఠిన్యత, దుర్గుణముల మార్చివేచి, మన అంతరంగములో మృదుత్వాన్ని, సదాలోచనలతో నిండిన కాంతిని కల్గిస్తుందని అని చెప్పారు. సాయంత్రం 6.30గం॥లకు "సంస్కృతి సందేశ్" వీడియో ప్రదర్శనతో అనాటి కార్యక్రమం ముగిసినది.

1.5.2010 న ఉదయం గం॥ 9.30 ని॥లకు శ్రీ వీరేశ్వర్ ఉపాధ్యాయగారు గాయత్రీ మంత్రార్థమును విపులంగా వివరించారు.

"యంత్ర నిర్మాత చెప్పిన విధముగా యంత్రమును నడిపించినచో అది నమ్మకముగా ఆశించిన ఫలితముల నెట్లు కలిగించునో అట్లే జన్మనిచ్చిన భగవంతుడు నిర్దేశించిన మార్గములో మనము నడచినచో కష్టములు కలుగవు" అన్నారు. రాజవంశములో జన్మించిన విశ్వామిత్రుడు, గాయత్రీ ఉపాసనతో సిద్ధిని పొంది బ్రాహ్మణుడైనాడు. గాయత్రి మంత్రమును గురు మంత్రమని కూడా పిలిచెదరు. విశ్వామిత్రుడు, వశిష్టుడు మున్నగు మహర్షులచే కీలితము గావించబడిన గాయత్రీ మంత్రాన్ని పూజ్య గురుదేవులు సార్వజనీనము చేసిరి అని వివరించారు. తదుపరి శ్రోతల ప్రశ్నలకు జవాబులిచ్చారు.

**"కర్మయజ్ఞానికి దూరమైనా, జ్ఞానయజ్ఞానికి దూరము కారాదు. లోకములోని అశాంతికి అజ్ఞానము మూలం". "ప్రపంచములో నున్న తగాదాలన్నింటికి మూలం ఇది నాది అనుట వలననే". "మన చింతనలో గాయత్రి ప్రవేశించగనే, వెలుపలనుండి యజ్ఞం కర్మ రూపంలో ప్రవేశిస్తుంది." "దుర్బుద్ధియే నేటి అశాంతికి కారణము". "ప్రపంచంలోని టెర్రరిజాన్ని సద్బుద్ధి, సదాలోచనలు, సత్కర్మల ద్వారా మాత్రమే నియంత్రించగలరు".**

**"త్యాగబలిదానాలకు సూర్యుడు ప్రతీక, ఆ సూర్యుని నుండి గాయత్రి పరివార్ వస్త్రరంగులను పూజ్య గురుదేవులు ఎన్నుకొనినారు."**

**"ఋషికులంలో జన్మించిన రావణుడు, శివుని ఆరాధించి శక్తిని పొంది, తదుపరి శివుని మరిచాడు. తత్ఫలితముగా రావణాసురుడైనాడు".** అని పలుప్రశ్నలకు సమాధానమిచ్చిరి.

మధ్యాహ్నము 3.30కు శ్రీ అశ్విని సుబ్బారావుగారు తాను గాయత్రీ పరివార్‌లో ఎట్లు ప్రవేశించినది వివరించారు.

తదుపరి శ్రీమతి ప్రశాంతి ఉమేష్‌గారు గాయత్రీ తీర్థ్ శాంతికుంజ్‌ను గురించి, స్థాపనలోని ఉద్దేశ్యాలను సప్తఋషుల లక్ష్యాలను వివరించారు. "దేవతలకు అతిథిగృహమువంటిది శాంతికుంజ్ – ఋషుల ఆత్మలిచ్చట నివాసముంటాయి" అని పూజ్య గురుదేవులు సెలవిచ్చినారని తెలిపారు.

**సూర్యుడు తన తాపన్ని చూపనిదే పిందెలతో ఉన్న చెట్లు పంటకు రావు.**

రాత్రి గం॥ 7.20 ని॥లకు శ్రీ అశ్విని సుబ్బారావుగారు ప్రజ్ఞాపురాణ కథా కాలక్షేపము చక్కగా నిర్వహించి శ్రోతలను ఆనందపర్చారు. శ్రీ ఉత్తమ్, పూల్‌సింగ్ మరియు తోషన్‌లు వారి గాత్ర వాయిద్యాలతో మంచి సహకారమందించి ప్రజ్ఞాపురాణ కథను రక్తికట్టించారు.

సాయంత్రము గం॥ 5.30 ని॥లకు డా॥ బ్రిజ్‌మోహన్ గౌర్ మాట్లాడుతూ "భగవంతుని ఇచ్ఛకు అనుగుణంగా నడచుకోవాలి. ఇటువంటి మంచి సమయం ఇంతకు ముందెన్నడూ భూమిపై మానవాళికి లభించలేదు. భగవంతుడు స్వయంగా భక్తులకు తన కోర్కెలను చెప్పుకొనుచున్నాడు. భగవంతుని సందేశాన్ని ఇంటింటికి నారదమహర్షిలా మీరంతా చేర్చాలి. మీ సమయాన్ని భగవంతుని చరణాలవద్ద పెట్టండి." అని ఉద్బోధించిరి.

రాత్రి 7.00 గం॥లకు దేవ సంస్కృతి వీడియో ప్రదర్శన జరిగినది. తదుపరి శ్రీడి.వి.ఆర్. మూర్తి గారు "గాయత్రి" ని గురించి వివరించారు.

3.5.2010 న ఉదయం 6 గంటలకు గురుమంత్ర దీక్షా కార్యక్రమాన్ని శ్రీ పరమానంద ద్వివేదిగారు మరియు డి.వి.ఆర్.మూర్తి గార్లు నిర్వహించి 150 మందికి దీక్షనిచ్చారు.

గం॥ 9.30 ని॥లకు శ్రీ గౌర్‌జీ గారు శిబిరములో సమయదానమే యుగధర్మమనెడి విషయంపై ప్రసంగించిరి. మధ్యాహ్నము శిబిరములో సభ్యులు గాయత్రి మంత్ర జపముతో వారు పొందిన అనుభూతులను లాభాలను వివరించారు. సాయంత్రం 4.00 గం॥లకు యజ్ఞము దాని విశిష్టత, బలివైశ్య విశిష్ఠతలపై శ్రీమతి ప్రశాంతిశర్మ వివరముగా ప్రసంగించారు.

రాత్రి గం॥ 7.30 ని॥లకు కార్యక్రమములో శ్రీ వీరేశ్వర ఉపాధ్యాయ్‌గారు శిక్షణ పొందెడివారి కోర్కెపై తిరిగి ప్రసంగిస్తూ "తల్లిదండ్రుల ఆస్తిలో యోగ్యులైన బిడ్డలు భాగం తీసుకొనక సమాజానికి ఇచ్చివేయాలి. పూజ్య గురుదేవుల తమ అవసరాలను కనీసమునకు తగ్గించుకొని, మిగిలిన ధనాన్ని సమాజసేవకై, జ్ఞాన యజ్ఞము ద్వారా వినియోగించారు. ఇట్టివారే నిజమైన బ్రాహ్మణుడు, బ్రాహ్మజ్ఞాని, ప్రేమ నిండినచోట చంచలమైన మనస్సుకు తావుండదు" అని ఉద్బోధించారు.

4.5.2010 న ఉదయము గం॥ 5.30 ని॥ల నుండి శ్రీ శివాజి మరియు తోషన్ గార్లు 235మందితో శ్రాద్ధతర్పణ కార్యక్రమమును నిర్వహించారు.

గం॥ 9.30 ని॥ల నుండి శ్రీమతి యశోద శర్మగారు నారీజాగరణ, వ్యక్తిత్వ, కుటుంబ మరియు సమాజ నిర్మాణముపై ప్రసంగించారు. "కుటుంబ నిర్మాణములో, వ్యక్తిత్వనిర్మాణములో తల్లి పాత్ర అత్యంత ప్రధానమైనది. శక్తివంతమైనదని నొక్కి చెప్పుచూ భారతీయ సంస్కృతికి తల్లి వెన్నెముక వంటిదని తెలిపారు.

మధ్యాహ్నం 3.30 నుండి శ్రీ కృష్ణ కుమార్ వినోద్ గారు బాలసంస్కారశాల ప్రాముఖ్యత దాని నిర్వహణలపై వివరణాత్మక ప్రసంగము చేస్తూ మన మిషన్ ఉద్దేశ్యాన్ని నెరవేర్చుటలో బాల సంస్కారశాల ప్రధాన పాత్ర వహిస్తుంది అని తెలియజేశారు. 11 నుండి 13 సంవత్సరాల వయస్సు మధ్యనున్న పిల్లలు తగినవారు అని, బొంబాయి నగరములో 111 బాల సంస్కారశాలలను నడుపుచున్నామని తెలిపారు.

20 మంది బాల సంస్కారశాలలను నడిపెదమని వాగ్దానము చేసివారి పేర్లు నమోదు చేసికొనినారు.

రాత్రి 7 గంటలకు శ్రీమతి నాగమణిగారు సంస్కారముల ప్రాముఖ్యత వానిని గురించి వివరించిరి. తదుపరి 8.00 నుండి శ్రీ వేణుగోపాలరెడ్డి పరివార్ నిర్మాణములో ప్రజ్ఞా మండలుల మహిళామండలుల ప్రాముఖ్యత గురించి వివరించారు.

5.4.2010 ఉదయము 7.30కు ఆదరణీయ శైల్‌దీది గారి దర్శనము అందరికి ఏర్పాటు చేసినారు. ఉదయం 9.30 కు శ్రీ రఘునందన్ గారిని సభకు పరిచయము చేసిరి. వీరు జాల్నానగర నివాసి. పూజ్య గురుదేవుల జన్మశతాబ్దిని పురస్కరించుకొని గురు దేవుల సాహిత్యసారాన్ని అందరికీ త్వరితగతిని చేర్పించి, వారిని చైతన్యవంతులుగా చేయుటకై గురుదేవుల సద్వాక్యాలను స్టిక్కర్ల రూపములో ముద్రించి విక్రయించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదే ఉద్యమాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా చేపట్టాలనెడి సంకల్పాన్ని వ్యక్తము చేస్తూ అందరి సహకారమును కోరినారు.

6.5.2010 న ఉ॥ 9 గంటలకు 9 రోజులు సంజీవని సాధనాశిబిర ముగింపు సందర్భముగా డా॥ బ్రిజ్‌మోహన్ గౌర్‌జీ గారు వీడ్కోలు సందేశమిచ్చిరి.

మీరు మీ స్థానాలకు పోయిన తరువాత నిత్యము శాంతికుంజ్‌నకు మానసిక యాత్ర ఉదయానే చేసి పూజ్య గురుదేవుల సూక్ష్మ రూపములోని శక్తిని పొందుచూ రోజువారి విధులను నిర్వర్తించండి. సమయదానాన్ని, అంశదానములనిచ్చి గురుదేవుల కార్యక్రమాలను సమర్పణా భావనతో చేస్తూ గురుదేవుల కృపను పొందండి అని ముగించారు. శ్రీమతి ప్రశాంతి శర్మగారు తొమ్మిది రోజులు ఈ శిబిరములోని హిందీ ప్రసంగాలను తెలుగులో అనువదించారు.

శాంతికుంజ్ వ్యవస్థాపకులలో ప్రముఖులైన శ్రీ గౌరీశంకర్ శర్మగారు చివరి ప్రసంగీకునిగా వీడ్కోలు శిబిరములో మాట్లాడుతూ శ్రావణ్ కుమారునిలా కార్యకర్తలంతా తల్లి తండ్రిలాంటి యుగఋషి దంపతుల సాహిత్యాన్ని విశ్వమంతా తమ భుజాలపై తీసుకొని వెళ్ళాలని ఉద్బోధించిరి. ఇంతటితో 9రోజుల సంజీవని సాధనా శిబిరము ముగిసినది.

★★★

**అందరినీ ఆదుకో - దయతో దగ్గరకు చేర్చుకో.**

# సామూహిక యజ్ఞముల నిర్వహణ అనుసరించవలసిన శాంతికుంజ్ అనుశాసనము

పూజ్య గురుదేవులు వేదమూర్తి, తపోనిష్ఠ, యుగద్రష్ట పండిత శ్రీరామశర్మ ఆచార్య గురుదేవుల జన్మదిన శతాబ్దిని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో అనేకచోట్ల యజ్ఞ ప్రక్రియ ఊపందుకున్నది. 5 కుండీల నుండి, 24 కుండీలు పదుల సంఖ్యలో కొన్నిచోట్ల 108 కుండీల యజ్ఞనిర్వహణకు ఉత్సాహము చూపుట మిగుల ఆనందదాయకము. యజ్ఞీయ విధానమును ప్రోత్సహించుచూ పూజ్య గురుదేవులు అందించిన శాస్త్రీయ యజ్ఞవిధానమును మీ అందరి దృష్టికి శాంతికుంజ్ తీసికొని వచ్చుచున్నది. దీనిని అనుసరించి యజ్ఞము చేయుటవలన కలిగే లాభములను, ఋషిసత్తా అనుగ్రహ ఆశీర్వాదములను, జపశక్తి ద్వారా లభించెడి ఊర్జాను, సమాజమునకు, విశ్వానికి అందించినవారమౌతాము.

పరిజనుల సౌలభ్యముకొరకై ఈ క్రింది యజ్ఞ విధానమును మీకు తెలియచేయుచున్నాము.

యజ్ఞం అనే పదానికి మూడు అర్థాలున్నాయి. 1. దేవ పూజనం 2. సంగతీకరణం 3. దానం. ఈ మూడింటిలో ఏ ఒక్కటి లేకపోయిన అది యజ్ఞం కాదు. కేవలం కర్మకాండ అవుతుంది. ఈ మూడు ప్రవృత్తులు సమాజాన్ని ఉత్కర్ష స్థితి వైపు తీసుకుని వెళ్ళటానికి అవసరమయ్యే దివ్య ధారలు

**దేవపూజనం:** దేవ పూజనం అంటే దేవతలను పూజించటం కాదు. మనం దేవతల వలె మారాలి. ఏ దేవతలను ఉపాసన చేస్తున్నామో ఆ దేవత యొక్క లక్షణాలు మన జీవితంలో రావాలి.

**సంగతీకరణము:** సంగతీకరణం అంటే ఒక పనిని అందరు కలసి చేయడం, ఒకరితో ఒకరు సహకరించడం, ఒక గ్రూపుగా తయారవ్వడం, ఒక గ్రూప్ ఇంకొక గ్రూప్‌కి సహాయం చెయ్యడం.

**దానం:** దానం అంటే ఉదారత్వం.

**జాతీయ పతాకంలో మూడు రంగులు ఎలా కనుపిస్తాయో అలాగే యజ్ఞమనగానే దేవపూజనం, సంగతీ కరణం, దానం కనుపించాలి.**

భారతీయ మేధావులు, మరియు జ్ఞానులు యజ్ఞమును రెండు విధములుగా చెప్పినారు 1) పరివారిక యజ్ఞము 2) సామూహిక యజ్ఞము

**1. పారివారిక యజ్ఞము :** ఇంటింట సంస్కార ప్రక్రియ జరిపెడి వేళ లేక అనుష్టాన పూర్ణాహుతి వేళ చేసెడిదీ యజ్ఞము.

**2. సామూహిక యజ్ఞము :** సామూహికముగా నిర్వహించెడి యజ్ఞము. దీనిలో సామూహిక జన జాగృతి జరుగగలదు.

**యజ్ఞములలో మూడు భాగాలుంటాయి.**

1. ప్రయాజ 2. యాజ 3. అనుయాజ

**1.** **<u>ప్రయాజ:</u>** యజ్ఞము చేయవలయుననెడి నిర్దిష్ట సంకల్పము చేసినది మొదలు, యజ్ఞ నిర్వహణ ముందు రోజువరకు యజ్ఞ సఫలతకొరకు చేసే విభిన్న కార్యక్రమములను "ప్రయాజ" అని అంటాము. ప్రయాజ కార్యక్రమములలో ఈ క్రింది సంకల్పములు పూర్తి చేయాలి.

ఎ) ఇంటింటిలో గాయత్రి మంత్రజపము, గాయత్రి చాలీసాపఠనము, సత్సంకల్పములు పఠించుట, గాయత్రిమంత్ర లేఖనం, కలశస్థాపన, జ్ఞానఘట (హుండీ) స్థాపన, దీపయజ్ఞము, దేవస్థాపన, బలివైశ్య కార్యక్రమము, తులసిమొక్క నాటుట, సూర్యార్ఘ్య దానము చేపట్టాలి. యజ్ఞం మున్నగు సంస్కారపూర్వక కార్యక్రమములలో పాల్గొనెడి అవకాశము కుటుంబ సభ్యులకు కల్పించవలయును.

బి) గోడలపై సద్వాక్యముల వ్రాయుట, స్టిక్కర్లు, పోస్టర్లు అంటించుట, యుగశక్తి గాయత్రి మాసపత్రికకు చందా కట్టించుట, వివిధ ప్రదేశములలో ఐదేసి కుండముల యజ్ఞములు సామూహికముగా చేపట్టాలి. సామూహిక దీపయజ్ఞములు చేస్తూ విభిన్న సంస్థలతో గోష్ఠుల నిర్వహణ చేపట్టాలి.

సి) అన్నింటికన్న ముందు యజ్ఞ సమయనిర్ధారణ యజ్ఞ కమిటీని నిర్మాణము చేయాలి. ఈ విషయాలను తెలిపే లేఖలలో ఒకదానిని చేతనా కేంద్రము హైదరాబాద్ వారికి, రెండవదానిని శాంతికుంజ్, హరిద్వార్‌కు పంపించాలి.

**కలసిమెలసి జీవించడం బలం - కలియబడడం బలహీనం.**

అప్పుడు ఈ యజ్ఞ కార్యక్రమం జయప్రదంగా నిర్వహింపబడుటకై గురుసత్తా నుండి ఆశీర్వాదములు కోరుచూ శాంతికుంజ్ పూజాప్రార్థనలు చేస్తుంది. ఈ సంకల్పపత్రములను అఖండదీపము చెంత ఉంచుతారు. అఖండదీపజ్యోతిలో సూక్ష్మ రూపములో నిబిడీకృతమై గురుసత్తా శక్తి యున్నది. అందువల్ల ఈ యజ్ఞ నిర్వహణలో పని చేసెడి మన ప్రతి అడుగులో సప్తఋషుల ఆశీస్సులతో పాటు గురుసత్తా ఆశీస్సులు, హిమాలయాలలో సూక్ష్మ రూపములోనున్న ఋష్యాత్మల ఆశీస్సులు లభిస్తాయి. అప్పుడు మన ఆలోచనలలో, నడవడికలో చక్కని పరివర్తన వచ్చితీరుతుంది. మరియు ఎర్రకాగడా నీడ క్రిందికి వచ్చెడివారంతా చక్కని సహాయ సహకారములందించెదరు.

డి) 108 కుండముల యజ్ఞం చేయుటకు ఎక్కువ శక్తి అవసరమవుతుంది. ఇందులకై యజ్ఞ తేదికి 3 నెలలముందు 50 నుండి 60 మంది శాంతికుంజ్ వెళ్ళి "శక్తి కలశాన్ని" తీసుకొని రావలసియున్నది. ఈ శక్తికలశము భారతదేశములోని 2400 తీర్థరాజములనుండి జలము మరియు మట్టిని కలిగిఉంటుంది. (పూజ్య గురుదేవులు 2400 తీర్థరాజములనుండి సేకరించిన జలము మట్టితో నింపిన కలశము నుండి కొంత భాగమును తీసి ప్రస్తుత యజ్ఞకలశములో కలిపెదరు.) ఈ కలశానికి శ్రద్ధేయ దీదీ మరియు ఆదరణీయ డాక్టర్ ప్రణవ్‌పండ్యా గార్లు పూజలు నిర్వహించి పూజ్య గురుదేవుల మరియు గురువుల ఆశీస్సులతో అందజేసెదరు. శాంతికుంజ్ వారు అందజేసిన పవిత్రకలశము మూడు మాసములు, ప్రచారటోలీతో పాటు ప్రచారరథముతో యజ్ఞం నిర్వహించెడి జిల్లా ప్రాంతమంతా పర్యటిస్తుంది.

ఇ) ఎక్కడైతే కార్యక్రమం చేసెదరో ఆ స్థలములో కాని లేక యజ్ఞ కార్యక్రమము కొరకు ఏర్పాటు చేసిన కార్యాలయం ముందుకాని యజ్ఞ తేదికి 24 రోజుల ముందునుంచే ఉదయము నుండి సాయంత్రం వరకు రెండేసి గంటల చొప్పున అఖండ జపము, ఆరతి, భజన, గోష్ఠి, ప్రార్థనలు చేపట్టాలి.

ఎఫ్) యజ్ఞ సంస్కారములు, దేవ స్థాపన, కలశస్థాపన, హుండీ స్థాపన, మాసపత్రిక చందాదారుల నమోదు, కార్యకర్తల నమోదు, దీపయజ్ఞములు చేసెడి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి నిర్ణీత ధరఖాస్తు ఫారములనింపి, వారికి ఆశీర్వాద పత్రముల పంపే నిమిత్తము శాంతికుంజ్‌కు పంపవలయును. యజ్ఞసంపూర్ణ సాఫల్యము కొరకై, పోలీసుశాఖ, మున్సిపల్ నీటి సరఫరా విభాగము, విద్యుత్ శాఖ, దారులు శుభ్రపరిచెడి శాఖ, పత్రికా విలేఖరుల, వ్యాపారవర్గముల, తదితర సమాజసత్పురుషులు మున్నగువారి సహాయ సహకారముల పొందుట అత్యుత్తమము మరియు అవసరముకూడా.

జి) గాయత్రీ పరివార్ కార్యక్రమములలో వెలుపలి వ్యక్తుల లేకసంస్థల సహకారములను పొందేముందు, అట్టి వ్యక్తులకు లేదా సంస్థలకు గాయత్రీ పరివార్ లక్ష్యాలను గురించి, పని విధానమును గురించి ముందుగనే సవివరముగా తెలియజెప్పాలి.

**గమనిక:**

అ) యజ్ఞనిర్వహణలో భాగము పంచుకొని శ్రద్ధాశక్తులతో పనిచేసెడి నూతన కార్యకర్తల పేర్లు నమోదు చేసి గుర్తింపుపత్రాన్ని అందించి దరఖాస్తును నింపించి ఫొటోతో సిద్ధము చేయాలి.

ఆ) స్థలము, తేది నిర్ణయమై, యజ్ఞ కమిటి ఏర్పాటు చేసిన నాటినుండి వారమునకొకసారి తప్పనిసరిగా కమిటీ సమావేశము నిర్వహించి, అప్పటివరకు జరిగిన పనిని సమీక్షించి, తదుపరి చేపట్టవలసిన పనులపై చర్చజరిపి తదుపరి కార్యాచరణ ప్రణాళికను చేపట్టాలి.

ఇ) మహాయజ్ఞ నిర్వహణ కొరకై యజ్ఞములో పాల్గొనెడి కుటుంబాలు ప్రతి దినము ఒక గుప్పెడు బియ్యాన్ని, పప్పులను తీసి అంశదానంగా తప్పనిసరిగా భద్రపరచవలయును.

ఈ) ఇద్దరిద్దరితో టోలీలను ఏర్పాటు చేసి అక్షతలతో ఇంటింటికి వెళ్ళి యజ్ఞమునకు ఆహ్వానించాలి.

ఉ) దేవపూజనలో పురుషులు ధోతి/కుర్తాను, స్త్రీలు చీరను తప్పనిసరిగా ధరించి పాల్గొనాలి.

ఊ) యజ్ఞమునకు ఆదాయ, వ్యయముల రికార్డుచేసి యజ్ఞము

**పాముకన్నా ప్రమాదకరం - పరుల ధనం.**

పూర్తియైన వారంలోపు చేతనాకేంద్రానికి తప్పనిసరిగా వచ్చి దానిని సమర్పించాలి.

**2. యాజ :** యాజ అనగా మూడు రోజుల యజ్ఞ కార్యక్రమము. దీనిలో మొదటి రోజు ఉదయానే మంగళకలశ శోభయాత్ర మధ్యాహ్నం కార్యకర్తల గోష్ఠి, మరియు సాహిత్య ప్రదర్శన, విక్రయములు సాయంత్రము సాంస్కృతిక కార్యక్రమములు ఉంటాయి.

**రెండవరోజు ఉదయాన్నే** దేవపూజన, యజ్ఞము, మంత్రదీక్షలు మరియు ఇతర సంస్కారములు చేయుట, మధ్యాహ్నం ఆయారంగములలోని ప్రముఖులతో గోష్ఠి మరియు సాయంత్రం సంగీత కార్యక్రమము, ప్రవచనముతో మహాదీపయజ్ఞము, తదుపరి రాబోయే సంవత్సరకాలములో చేపట్టవలసిన పనుల కార్యాచరణ ప్రణాళికపై చర్చ.

**మూడవరోజు ఉదయాన్నే** మహాయజ్ఞ సంస్కారములు మరియు పూర్ణాహుతి, యజ్ఞానంతరము తిరిగివెళ్ళే వారికి రవాణా వసతి, తదుపరి తీసుకొచ్చిన సామాన్లను నిర్ణీతపూర్వపు స్థానాలకు చేర్పించుట.

**గమనిక :** యజ్ఞ సఫలతకై క్రింద తెలిపిన పనులను చక్కగా చేయుటకై ముందే ప్రణాళికాబద్ధముగా సిద్ధమగుట తప్పనిసరి.

ఎ) **సాహిత్య విక్రయ స్టాలు:** తెలుగు, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో ఆయాప్రాంత అవసరాలకనుగుణ్యముగా సాహిత్య విక్రయ స్టాలును ఏర్పాటు చేసికోవాలి. "బ్రహ్మభోజన" స్కీములో ఆర్థిక సహాయమందించెడి వారిని ఎంపిక చేసి, తగిన సాహిత్యాన్ని అమ్మకమునకు సిద్ధము చేసికోవాలి.

బి) **చిత్రప్రదర్శన:** పూజ్య గురుదేవుల జీవితాన్ని పరిచయము చేసెడి చిత్ర ప్రదర్శనను ప్రాంతీయ భాషలో ఏర్పాటు చేయుటకు తగిన ఏర్పాట్లు చేసికోవాలి.

సి) **కార్యాలయము:**

అ) అందరికీ తగిన నివాసము, త్రాగునీటి వసతి, విచారణ కేంద్రము, ప్రకటన కేంద్రము, మరియు చెప్పుల స్టాండు మున్నగువానిని ఏర్పాటు చేయుట.

ఆ) మాసపత్రిక చందాదారులను చేర్చుకొనుటకు కావలసిన ఏర్పాట్లు, కరపత్రాలు మున్నగువాని ఏర్పాటు

ఇ) అంశదానములు, వస్తుదానములు స్వీకరించి తగిన రశీదులను అందించెడి వ్యవస్థ ఏర్పాటు.

ఈ) యజ్ఞశాల స్టోరు, యజ్ఞ సామాగ్రి, యజ్ఞవేదిక ఏర్పాటు, యజ్ఞశాలవ్యవస్థ, పూలు, అక్షతలు వగైరా సరఫరా, నిత్య ఆరతి వ్యవస్థ, ధ్యానము మరియు జాగరణ మున్నగువాని వ్యవస్థ, స్వచ్ఛంద మహిళాటోలీ వ్యవస్థ, కార్యకర్తల మరియు సహాయకార్యకర్తలకు అనువైన నివాస ఏర్పాట్లు.

**వి.ఐ.పి. నివాస వ్యవస్థ :** త్రాగునీటి వసతి, ధోవతి ధరించుటకై ఏర్పాటు, సాహిత్య సెట్ లభ్యత, ప్రధాన కార్యకర్తలను కలుసుకొనుటకు ఏర్పాటు, పత్రికా విలేఖరులు, టి.వి. వారి వ్యవస్థల ఏర్పాటు.

**కలశయాత్ర:** మంగళ కలశయాత్ర ముందు బ్యాండ్ మేళము, ఏనుగు, గుర్రాల సవారీ, సక్రమపద్ధతిలో వాహనాల యాత్రమంచి ఫలితములనివ్వగలదు. యాత్ర దారిలో త్రాగుటకు నీరు, మజ్జిగ మున్నగు వాని వ్యవస్థ, కలశ జాకెట్ వస్త్రము, కలశ కొబ్బరికాయ, మామిడాకుల తోరణము, మైకు, సంగీత టోలీ మున్నగు వాని వ్యవస్థ, పసుపు రంగు వస్త్రధారణతో సోదరీమణుల హాజరు, సోదరులకు కూడా పసుపు వస్త్రధారణ శ్రేష్ఠము.

**భోజన వ్యవస్థ:** స్థానిక పద్ధతులు ఆచారముల కనుగుణమైన భోజన వ్యవస్థ

**3. అనుయాజ :** అనుయాజ అంటే యజ్ఞము తరువాత చేయవలసిన కార్యక్రమం. అనుయాజ కార్యక్రమమునకై ఈ క్రింది కార్యక్రమముల చేపట్టవలయును.

1. యజ్ఞకుండములలోని భస్మమునంతా ఒకచోట చేర్చి, ఇద్దరిద్దరితో ఏర్పరచిన టోలీలద్వారా కాగితపు కవర్లలో పెట్టి ఇంటింటికి చేర్పించాలి. కవర్లపై యజ్ఞతేదిని మరియు చిరునామాను ముద్రించుటమంచిది.
2. యజ్ఞములో ప్రత్యక్షముగా పాల్గొనని వారికి యజ్ఞ భస్మ ప్యాకెట్‌తోపాటు సాహిత్యసెట్‌ను కలిపి తప్పనిసరిగా వారికి అందేలా చూడాలి.

**శీల నిర్మాణం చేసి మనిషికి ఉన్నతిని కల్గించేదే విద్య.**

3. దేవపూజన, దేవస్థాపన, కలశస్థాపన, హుండీస్థాపన, పత్రికాసభ్యుల, దీక్షతీసుకొనినవారి, సంస్కారములు చేయించుకొనిన వారి, యజ్ఞము దీపయజ్ఞములలో పాల్గొన్నవారి, పత్రికావిలేఖరుల సమర్థవంతమైన సహాయ సహకారములనందించిన చిరునామాలను, ఫోన్ నంబర్లతో సహా ఆశీర్వాద పత్రములు కొరకై శాంత్‌కుంజ్‌కు తప్పనిసరిగా పంపాలి.
4. పై అన్ని విషయాలతో నింపిన ఫారాలను ఫైలు చేసి, ఒక జిరాక్సు కాపిని శాంతికుంజ్ తప్పని సరిగా పంపాలి.
5. యజ్ఞ, సంస్కారములు మరియు దీప యజ్ఞాలు చేయించు కొనుటకై ప్రేరణనివ్వాలి.
6. 9 రోజుల సంజీవని సాధనాశిబిరములో పాల్గొనెలా వీరికి ప్రేరణనందించాలి.
7. సక్రియతతో కూడిన ప్రజ్ఞా/మహిళా మండలులను స్థాపించేలా చేయాలి.
8. ప్రతి మండలిలో ఒక వెయ్యి రూపాయిలు ఖరీదు చేసెడి పూజ్య గురుదేవుల సాహిత్యాన్ని ఖరీదు చేసి స్వాధ్యాయానికై ఉంచాలి.
9. మెడకు తగిలించుకొని, ఇంటింటికి తిరిగి విక్రయించెడి పుస్తక విక్రయశాలను ప్రోత్సహించాలి.
10. పై కార్యక్రమ పూర్తి సమీక్షా పత్రాన్ని తయారుచేసి యుగశక్తి గాయత్రిలో ముద్రించాలి. శాంతికుంజ్‌కు ఒక కాపీని పంపించాలి.
11. యజ్ఞకార్యక్రమ నిర్వహణలో పాలుపంచుకొనిన స్థానిక మరియు స్థానికేతర కార్యకర్తలందరికి యజ్ఞ కమిటీ ధన్యవాదములు తెలుపుచూ లేఖలు వ్రాసి వాటి కాపీలను శాంతికుంజ్‌కు పంపాలి.

## 24, 51 లేక 108 కుండముల మహాయజ్ఞముల కార్యనిర్వహణ ప్రణాళిక

| క్ర. సం. | 24 కుండములు | 51 కుండములు | 108 కుండములు | గాయత్రిమహాయజ్ఞ నిర్వహణకై ఈ క్రింది అంశములను తప్పక పూర్తి చేయాలి. |
|---|---|---|---|---|
| | కుటుంబముల సంఖ్య | | | |
| 1. | 108 | 224 | 500 | గాయత్రీ మంత్రజపము చేసెడి కుటుంబముల పేర్లు నమోదు చేయాలి. |
| 2. | 108 | 224 | 500 | దేవస్థాపన, కలశస్థాపన, బలివైశ్యం చేయాలి. |
| 3. | 108 | 224 | 500 | మంత్రలేఖనము, గాయత్రీ చాలీసాపఠనము, సత్‌సంకల్పముల పఠనము చేయాలి. |
| 4. | 108 | 224 | 500 | ఇండ్లలో క్రాంతిధర్మిసాహిత్యం లేక ప్రజ్ఞాపురాణ సెట్లను స్థాపించి పఠించాలి. |
| 5. | 108 | 224 | 500 | దుకాణాలలో హుండీలను స్థాపించాలి. |
| 6. | 108 | 224 | 500 | ఇండ్లలో వంతులవారిగా అఖండజపం చేపట్టాలి. |
| 7. | 108 | 224 | 500 | ఇండ్లలో ఒక కుండీయజ్ఞము, సంస్కారములతో దీప యజ్ఞాలు చేయించాలి. |
| 8. | 5 | 11 | 24 | ఐదేసి కుండముల యజ్ఞాలను వివిధ ప్రాంతాలలో చేయించాలి. |
| 9. | 108 | 500 | 1008 | యుగశక్తి గాయత్రి మాసపత్రిక చందాదారులుగా చేర్పించాలి. |
| 10. | 2 నెలలు | 4 నెలలు | 6 నెలలు | ముందుగా యజ్ఞకమిటీని ఏర్పాటు చేసి స్థల నిర్ణయముగావించి, సంకల్ప పత్రాలను శాంతికుంజ్‌కు పంపించాలి. |
| 11. | 5 రోజులు | 30 రోజులు | 30 రోజులు | ముందునుంచి నిత్యము కార్యకర్తల గోష్టిని నిర్వహించుట తప్పనిసరి. |

**మనస్సు జయించినవాడే ప్రపంచాన్ని జయించగల్గుతాడు.**